

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-7-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 178 పేజీలు: 8+4 వెల: 6.50


ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో హైదరాబాద్ షూటర్ ఈషా సింగ్‌కు స్వర్ణం




-'ఆట'లో

## ఎల్‌నినోపై రైతులకు అవగాహన పెంచండి



### ప్రత్యామ్నాయ పంటలను వివరించండి..

### ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మారాలి

### ఆర్టీజీఎస్ సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 27, ప్రభాతవార్తప్రతినిధి:** ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చర్చించారు. ఈ ఏడాది అంతటా ఎల్ నినో ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని అంచనాలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే తీసుకున్న చర్యలతో పాటు, రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలను రైతులకు వివరించడంతోపాటు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. దీని నిమిత్తం క్యాంపెయిన్ మోడ్‌లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే ఏప్రాంతాల్లో ఏయే పంట సాగు చేయాలనేదానిపై రైతులకు వివరించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని సూచించారు. వరి పంటకు చివరి తేదీ 2026 ఆగస్టు 15 అని చెప్పారు. అర్హులైన రైతులు గరిష్ఠ సంఖ్యలో నమోదు అయ్యేలా సంబంధిత భాగస్వాములందరూ విస్తృత అవగాహన మరియు ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఖరీఫ్-2026 సీజన్‌లో రైతుల ప్రయోజనాలపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో వర్షపాతం లోటు పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. సీజన్ సాధారణ వర్షపాతం 580.1 మి.మీ. కాగా, ప్రస్తుత తేదీ నాటికి సాధారణంగా 225.7 మి.మీ. వర్షపాతం నమోదవ్వాల్సి ఉందని, అయితే కేవలం 104.5 మి.మీ. మాత్రమే నమోదై 53.7 శాతం లోటు ఏర్పడిందని వివరించారు. మొత్తం 28 జిల్లాల్లో 21 జిల్లాలు వర్షపాతం లోటు కేటగిరీలో ఉన్నాయని తెలిపారు. పశ్చిమ గోదావరి, అన్నమయ్య, తూర్పు గోదావరి, విశాఖపట్నం, చిత్తూరు, ప్రకాశం జిల్లాలు కలిపి ఆరు జిల్లాలుతీవ్ర వర్షపాతం లోటు కేట గిరీలో ఉన్నాయని, నెల్లూరు జిల్లాలో మాత్రమే >>2

## లోక్‌సభకు 'పరీక్షల' బిల్లు



### ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

### విపక్షాల రగడతో ఉభయసభలు నేటికి వాయిదా

**న్యూఢిల్లీ,జులై 27:** పేపర్ లీకేజీ నిరోధక బిల్లుపై చర్చించేందుకు అన్ని పార్టీలు సిద్ధంగా ఉన్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అన్ని పార్టీలను ఆయన ఒప్పించినట్లు పార్లమెంటరీ వర్గాలు వెల్లడించాయి. సోమవారం కేంద్రసిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. పేపర్ లీకేజీ నిరోధక సవరణబిల్లును మంగళవారం చర్చించేందుకు అన్ని పార్టీలు అంగీకరించాయని, స్పీకర్ ఓం బిర్లా చేపట్టిన చర్యలవల్ల ఫ్లోర్‌లీడర్లు ఆ చర్చకు ఒప్పుకున్నారని స్పీకర్ కార్యాల వర్గాలుప్రశ్నపత్రాల లీకేజీలు, పబ్లిక్ పరీక్షల్లో అక్రమాలను కట్టడి చేయడానికి >>2



## తిరుపతిలో తొలి కరోనా కేసు

### 65యేళ్ల వృద్ధురాలికి పాజిటివ్

**తిరుపతి,జులై 27ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మళ్లీ ఆందోళనకర అలజడి సృష్టిస్తున్న కరోనా వైరస్ వ్యాప్తి తాజాగా యాత్రాస్థలం తిరుపతిలో కేసు నమోదు కావడంతో యాత్రికులు, తిరుపతి వాసులు ఆందోళన చెందుతున్నారు. 2020-21 మధ్యకాలంలో ప్రపంచవ్యాప్తంగా తీవ్రంగా వ్యాపించి ఎందరో ప్రాణాలు బలిగొన్న ఈ కరోనా వైరస్ ప్రభావంతో జనజీవనం అస్తవ్యస్థంగా మారిన విషయం విదితమే. మళ్ళీ ఐదేళ్ళ తరువాత కరోనా వైరస్ రాష్ట్రంలో కలకలంగా మారింది. ఇప్పటికే రాష్ట్రంలో కరోనా వైరస్ కేసులు తీవ్రంగా నమోదవుతున్న తరుణంలో తిరుపతి నగరంలో ఓ కరోనా వైరస్ >>2

**రాజమండ్రిలో మరో ఇద్దరికి కరోనా** 2లో

## ఇక దృష్టంతా ఫలితాలపైనే



పునాదిపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

### విద్యారంగంలో సంస్కరణలు పూర్తి

### విద్యార్థులకు మార్కులు రాకపోతే సిఎం నా మార్కులు తగ్గిస్తారు..

### పునాదిపాడు జెడ్పీ హైస్కూలును ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి లోకేష్

**విజయవాడ.జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యారంగంలో సంస్కరణలు పూర్తయ్యాయని, ఫలితాలపై దృష్టిపెట్టాలని అధికారులను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులు, విద్యా ప్రమాణాలపై మంత్రి ఆరా తీశారు. ముందుగా పాఠశాలలోని పదో తరగతి ఏ సెక్షన్ విద్యార్థులతో మంత్రి సంభాషించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీ సీనియర్స్ కంటే మీరు బాగా చదవాలి. గతేడాది పదో తరగతిలో 67శాతం మంది విద్యార్థులు మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర సరాసరి కంటే ఇది 11శాతం తక్కువ. మీకు మార్కులు రాకపోతే సీఎం చంద్రబాబునాయుడు గారు నా మార్కులు తగ్గిస్తారు. కాబట్టి మీరంతా బాగా చదవాలని వారిని ఉత్సాహపరిచారు. విద్యార్థులకు పదో తరగతి చాలా ముఖ్యం. పది, ఇంటర్మీడియట్ చదివే సమయంలో నా జీవితంలో మార్పు వచ్చిందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. ఇప్పుడు మంచి మార్కులు వస్తేనే భవిష్యత్ బాగుంటుందని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ అందజేత, పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను మంత్రి ఆరా తీశారు. బాగుందని విద్యార్థులు సమాధానం ఇచ్చారు. ప్రజాప్రభుత్వంలో మధ్యాహ్న భోజనానికి ఫైన్ రైస్ ను వినియోగిస్తున్నామని చెప్పారు. రాగి జావ ఎంతమందికి ఇష్టం, చిక్కీ ఎంతమందికి ఇష్టం అని మంత్రి సరదాగా ప్రశ్నించగా అధికశాతం మంది విద్యార్థులు చిక్కీ ఇష్టమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజాప్రభుత్వం కృషిచేస్తోందని, అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తోందని, మీరు చేయాల్సిందల్లా బాగా చదవడమేనని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. చదువుకున్నది జీవితంలో ఎంతవరకు ఉపయోగపడుతున్నదన్నది ముఖ్యం, లోకజ్ఞానం కూడా అవసరమేనని పేర్కొన్నారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు.

**అభ్యసన సామర్థ్యాల్లో వెనుకబడి ఉండటంపై మంత్రి అసంతృప్తి**

గతేడాది కంటే ఈ ఏడాది 19 మంది విద్యార్థులు పాఠశాలలో కొత్తగా ప్రవేశాలు పొందారు. ఇందుకు పాఠశాల సిబ్బందిని మంత్రి అభినందించారు. మౌలిక సౌకర్యాల్లో పాఠశాల 2.76 రేటింగ్ సాధించింది. అయితే పాఠశాలలోని విద్యార్థులు అభ్యసన సామర్థ్యాల్లో వెనుకబడి ఉండటంపై మంత్రి అసృతృప్తి వ్యక్తం చేశారు. అద్భుతమైన మౌలిక సౌకర్యాలు, మంచి ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ లెర్నింగ్ అవుట్ కమ్స్, సమ్మేటివ్, ఫార్మేటివ్ అసెస్‌మెంట్స్ లో స్కూల్ వెనుకబడి ఉంది. లెర్నింగ్ అవుట్ కమ్స్ లో 0.9శాతం రేటింగ్ సాధించింది. పట్టణ ప్రాంతానికి దగ్గరగా ఉన్న పాఠశాల అభ్యసన సామర్థ్యాల్లో వెనుకబడి ఉందని, లెర్నింగ్ అవుట్ కమ్స్ పై ప్రత్యేక దృష్టిసారించాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలని సూచించారు. అనుమతి లేకుండా ఉపాధ్యాయులు గైర్హాజరు కావడాన్ని నివారించాలన్నారు. ఒకేషనల్ ల్యాబ్స్ పైనా దృష్టిసారించాలని ఆదేశించారు. ఇంటర్‌లో ఒకేషనల్ కోర్సులపై దృష్టి సారించడం ద్వారా ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల విషయంలోనూ మంత్రి ఆరా తీశారు. వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఫలితాల మెరుగుదలకు విద్యార్థుల్లో స్ఫూర్తి >>2



మృతి చెందిన శివాని(ఫైల్)

### సిఎం ప్రశంసలు అందుకొన్న టెన్త్ విద్యార్థిని అనూహ్యంగా ఆత్మహత్య

### బాలిక మృతిపై సమగ్రవిచారణకు తక్షణమే సిఎం ఆదేశం

### రంపచోడవరంలో విషాదం

**పోలవరం జిల్లా ప్రతినిధి, జులై 27 ప్రభాత వార్త:** పోలవరం జిల్లా రంపచోడవరం మండలం ఇర్లపల్లిలో 10 తరగతి విద్యార్థిని శివాని(14) సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనతో రంపచోడవరంలో విషాదం నెలకొంది. ఈ నెల 24 తేదిన పి. టీ.యం.తల్లికి వందనం వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కార్యక్రమంలో మాట్లాడిన విద్యార్థిని భవిష్యత్తులో 'షైనింగ్ స్టార్'గా ఎదిగి, ఆయన చేతుల మీదుగా అవార్డు అందుకోవాలనే తన ఆకాంక్షను వ్యక్తం చేసింది. విద్యార్థిని మాటలకు ముఖ్యమంత్రి స్పందించి, ఆమెతో సెల్ఫీ దిగడంతో పాటు భవిష్యత్తులో తనకు నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆ విద్యార్థిని వచ్చే యేడాది మంచి మార్కులతో శైనింగ్ స్టార్ అవార్డు అందుకుంటాను అని వేదికపై వెల్లడించి, అందరి చేత చప్పట్లు కొట్టించుకుంది. ఈ విద్యార్థిని ప్రసంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ >>2

## నిన్న 'కాక్రోచ్'.. నేడు ఇ-20 జనతాపార్టీ

### స్వచ్ఛ పెట్రోలు కోసం ఉద్యమం

**న్యూఢిల్లీ,జులై 27:** నీట్ పేపర్ లీక్ వ్యవహారం నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) పుట్టుకొచ్చింది. సోషల్ మీడియా నుంచి ప్రారంభమైన ఈ ఉద్యమం చివరకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వరకు సాగింది. ఇప్పుడు సిజెపి లాగే కొత్తగా ఇజెపి అంటే 'ఇ20 జనతా పార్టీ' పుట్టుకొచ్చింది. ఈ పేరుతో కొత్తగా డిజిటల్ ప్రచారం మొదలైంది. ఇ20 పెట్రోల్‌తో పాటు వినియోగదారులకు 100 శాతం స్వచ్ఛమైన పెట్రోల్ కొనుగోలు చేసే అవకాశం ఇవ్వాలనేది ఈ పార్టీ ప్రధాన డిమాండ్. ఇ20 జనతాపార్టీ ఇప్పటికే ఎక్స్, ఇన్స్టాగ్రామ్‌లలో ప్రత్యేక అకౌంట్లు క్రియేట్ అయ్యాయి. >>2

## విజయ్ 'ఉద్యోగ' ఉత్తర్వులు కొట్టివేసిన మద్రాసు హైకోర్టు



### కరూర్ తొక్కిసలాట బాధితులకు ఎలా ఇస్తారని ప్రశ్న

**మదురై, జులై 27:** సెప్టెంబర్ 2025లో 'తమిళగ వెట్రి కళగం (టివికె) అధ్యక్షుడు సి. జోసెఫ్ విజయ్ ప్రసంగించిన ఎన్నికల ర్యాలీ సందర్భంగా కరూర్‌లో జరిగిన విషాదకరమైన తొక్కిసలాటలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం రద్దు చేసింది. >>2



## తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు

### ఆగస్టు 1 నుంచి ప్రజలకు సదవకాశం: డి.సిఎం పవన్

**విజయవాడ,జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు జరుగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ మేరకు డీసీఎంవో ఒక ప్రకటన విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయం స్వాగతించదగినదని పవన్ వ్యాఖ్యానించారు. బహిరంగ మార్కెట్లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యుడికి సాంత్వన చేకూర్చేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమ్ అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ అన్నారు. బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం కేజీ రూ.52లకు, గ్రేడ్ 1 పచ్చి బియ్యం (రా రైస్ ) రూ.50లకు రాష్ట్రంలోని 130 రైతుబజార్లు, 500 రైసు మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రజలకు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు. ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు, సోదరులు నాదెండ్ల మనోహర్ అమలులోకి తీసుకుని వచ్చిన ఈ సౌకర్యం ప్రశంసనీయమన్నారు.. సామాన్యుడిపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరపున ఆయన ప్రత్యేకంగా చొరవ తీసుకోవడం స్వాగతించదగినదని చెప్పారు. బహిరంగ మార్కెట్ ధరలను సమీక్ష చేసి, మిల్లర్లతో అత్యవసరంగా సమావేశం నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండేలా మేలైన ధరలను నిర్ణయించారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ పాలనపరమైన నిర్ణయం సామాన్య ప్రజల ఆర్థికభారాన్ని తగ్గిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

**సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట** 2లో



## బడులు, హాస్టల్స్‌లో స్టీమ్ రైస్ వాడకం

### మధ్యాహ్న భోజన పథకం మరింత నాణ్యతతో అమలు: మంత్రి నాదెండ్ల

### ఢిల్లీలో విద్యామంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ

**విజయవాడ.జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రజలకు స్టీమ్ రైస్ అందించడం ద్వారా వారికి పౌర సరఫరాల శాఖ సేవలను మరింత చేరువ చేయొచ్చని రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. దీనిద్వారా ప్రజలకు నాణ్యమైన బియ్యం అందడంతో పాటు, బియ్యం అక్రమ రవాణా నిరోధానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని దీనికి కేంద్ర పౌర సరఫరాల శాఖ సహకారం ఎంతో అవసరమన్నారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం ఆయన ఢిల్లీలో కేంద్ర పౌర సరఫరాల శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి తో పాటు శాఖ ఉన్నతాధికారులను వరుసగా కలిశారు. ఈ క్రమంలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ జాయింట్ సెక్రటరీ రవిశంకర్, పాలసీ అండ్ ఎఫ్సీఐ జాయింట్ సెక్రటరీ శిఖా కలిశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మనోహర్ సీఎంఆర్ సేకరణ, స్టీమ్ రైస్ పంపిణీ, మీ మార్టుల ప్రారంభం, రాష్ట్రం నుంచి విదేశాలకు ఎగుమతులు వంటి అనేక అంశాలను చర్చించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్రంలోని 130 రైతు బజార్లు, 500 ప్రత్యేక పాయింట్ల ద్వారా తక్కువ ధరకే బియ్యం విక్రయాలను చేపడుతున్నవిషయాన్ని కేంద్ర మంత్రి వద్ద ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి రావల్సిన అనుమతులు, సహకారం, పెండింగ్ నిధుల విషయాలను ప్రత్యేకంగా కేంద్రమంత్రి ముందుంచారు. రాష్ట్రంలోని 41 వేల పాఠశాలలు, 4 వేల వసతి గృహాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో స్టీమ్ రైస్ వాడకం ద్వారా అందుతున్న నాణ్యమైన భోజనంపై సానుకూలత ఉందని, దీన్ని ప్రజాపంపిణీ వ్యవస్థకు >>2




ఎఫ్‌టీపీసీ జాతీయ కార్యకలాపాలకు సంబంధించిన అధికారిక పోస్టర్, లోగోను ఆవిష్కరించిన మంత్రి దుర్గేష్

## వన్ ఇండియా, వన్ సినిమా దిశగా ఎఫ్‌టిపిసి అడుగులు

### క్రియేటివ్ ఎకానమీకి ఎపి చిరునామా: మంత్రి దుర్గేష్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై27,ప్రభాతవార్త:** సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వం లో ఏపీలో క్రియేటివ్ ఎకానమీని అభివృద్ధి చేయాలని ఆలోచిస్తున్నట్లు తద్వారా రాష్ట్రాన్ని వినోద రంగానికి సరికొత్త గమ్యస్థానంగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్ టీపీసీఐ) ప్రతినిధులు సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్‌ని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీపీసీ జాతీయ కార్యకలాపాలకు సంబంధించిన అధికారిక పోస్టర్, లోగోలను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎఫ్‌టీపీసీఐ ప్రతినిధులు తమ భవిష్యత్ ప్రణాళికలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం లాంటి సాంస్కృతిక వేదికపై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. "ఒకప్పుడు తెలుగు, తమిళం, హిందీ అని వేర్వేరు ప్రాంతీయ చిత్రాలుగా చూసేవాళ్లం. కానీ నేడు పాన్ ఇండియా విప్లవం, ఓటీటీల రాకతో సినిమా స్వరూపమే మారిపోయింది. ప్రేక్షకులకు భాషతో సంబంధం లేకుండా అన్ని రకాల వినోదం అందుతోంది. సినిమాకి ఏ భాషా సరిహద్దు కాదని నిరూపితమైంది" అన్నారు. ఈ నేపథ్యంలో "దేశమంతా ఒకే వినోద వేదికపైకి రావాలనే ఎఫ్‌టీపీసీ ఆశయం అభినందనీయం. ఈ వన్ >>2



సోమవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో సమావేశమైన పంజాబ్ బిజెపి అధ్యక్షుడు కేవల్‌సింగ్ ఢిల్లాన్

## సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట

**విజయవాడ,జులై27,ప్రభాతవార్తప్రతినిధి:** గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఊరట లభించింది. మాజీ సీఐ నాగరాజు కస్టడీ విచారణ అంశంలో హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టు ధర్మాసనం సవరించింది. కస్టడీ విచారణ నిబంధనలను రద్దు చేసింది. సిట్ విచారణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు విజయవాడ ఆఫీస్‌లో నాగరాజును ప్రశ్నించనున్నారు. కృష్ణలంక యువకుడు గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో నిందితుడిగా ఉన్న సీఐ నాగరాజు కస్టడీ విచారణపై సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పును వెలువరించింది. నిందితుడిని రాజమండ్రి జైలులోనే విచారించాలంటూ గతంలో ట్రయల్ కోర్టు, హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సర్వోన్నత న్యాయస్థానం పక్కన పెట్టింది. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, దర్యాప్తునకు అనుకూలంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. విచారణ కోసం సీఐ నాగరాజును విజయవాడలోని దర్యాప్తు కేంద్రానికి గానీ, ఇతర సురక్షిత ప్రాంతాలకు గానీ తీసుకెళ్లి ప్రశ్నించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈ కేసు దర్యాప్తు అధికారులకు విచారణ ప్రక్రియలో కీలక వెసులుబాటు లభించినట్లయింది. అయితే, కస్టడీ విచారణ సమయంలో నిందితుడిపై ఎలాంటి భౌతికదాడి లేదా హింసకు పాల్పడరాదని సుప్రీంకోర్టు షరతు విధించింది. అంతేకాకుండా, విచారణ ప్రక్రియ మొత్తాన్ని తప్పనిసరిగా వీడియో రికార్డింగ్ చేయాలని కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పుతో సీఐ నాగరాజు కస్టడీ విచారణపై కొనసాగుతున్న న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి.

## భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం దృష్ట్యా సిఎం చంద్రబాబు విడియో కాన్ఫరెన్స్

**విజయవాడ,.జులై27,ప్రభాతవార్తప్రతినిధి:** భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం దృష్ట్యా సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు' నినాదంతో కార్యక్రమాలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఉత్తరాంధ్ర కలెక్టర్లు పోటీపడాలి. భోగాపురం విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర గేమ్‌ఛేంజర్‌గా మారుతుంది. యువకులకు వాలీబాల్, రన్, పాటలు, పద్యాల పోటీలు నిర్వహించాలి. వివిధ విభాగాల్లో గెలుపొందిన 600 మందిని విజేతలుగా ప్రకటించాలి. విమానాశ్రయం ఏర్పాట్లు వల్ల కలిగే ప్రయోజనాలపై పోటీలు నిర్వహించాలి. విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించాలి. ఈనెల 31న రాత్రి నుంచే డ్రోన్‌షో ఏర్పాటు చేయాలి.ప్రధానికి జాతీయజెండాలతో పిల్లలు స్వాగతం పలకాలి. విమానాశ్రయం ప్రారంభ సమయంలో 13వేల మందితో థింసా ప్రదర్శన. 13 వేల మందితో నిర్వహించే థింసా ప్రదర్శన గిన్నిస్‌రికార్డు సాధించాలి. కొవిడ్ నేపథ్యంలో ఆరోగ్యశాఖ అప్రమత్తంగా వ్యవహ రించాలి. ప్రజలకుఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు 11 అంతర్జాతీయ, 25 జాతీయ ఛానళ్లలో ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రసారం జరగనుంది.

## కందుల జెస్సీకి విద్యామంత్రి లోకేష్ అభినందన

**విజయవాడ.జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ అసాధారణ ప్రతిభతో ప్రపంచ వేదికపైకి అడుగుపెట్టిన ఆంధ్రప్రదేశ్ విద్యార్థినికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రపంచంలోనే తొలి ఆల్‌గర్ల్స్ గ్లోబల్ లూనార్ క్యూబ్‌శాట్ "మిషన్ శక్తిశాట్‌కు ఎంపికైన తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం విద్యార్థిని కందుల జెస్సీ, సోమవారం ఉండవల్లిలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశను కలిసింది. ఈ సందర్భంగా జెస్సీని ప్రత్యేకంగా అభినందించిన మంత్రి, ఆమె భవిష్యత్ ప్రయత్నాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ధవళేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కందుల జెస్సీ, మిషన్ శక్తిశాట్‌కు భారత్ నుంచి ఎంపికైన 20 మంది బాలికల్లో ఒకరిగా నిలిచింది. ఈ ఘనత సాధించిన ఏకైక ఆంధ్రప్రదేశ్ విద్యార్థినిగా ఆమె రికార్డు సృష్టించింది. తన పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌లో చేసిన ప్రయోగాలే తనకు అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తిని పెంచాయని జెస్సీ మంత్రికి వివరించింది. ఏడో తరగతి నుంచే స్పేస్ సైన్స్ పట్ల ఆకర్షితురాలినయ్యానని, మిషన్ శక్తిశాట్‌లో భాగంగా 21 మాడ్యూల్స్‌లో 550 సెషన్ల శిక్షణ తీసుకున్నానని తెలిపింది. భవిష్యత్తులో ఏరోనాటికల్ ఇంజనీర్‌గా స్థిరపడటమే తన లక్ష్యమని ఆమె పేర్కొంది.




## ఉద్యాన పంటల కార్గో ఎయిర్ పోర్ట్‌కు అనంతలో రీసర్వే చేయండి

### కేంద్ర మంత్రి రామ్‌మోహన్ నాయుడిని కోరిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**అనంతపురం, జులై 27, ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించాలని కోరుతూ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్‌మోహన్ నాయుడితో సోమవారం సమావేశమై కోరారు. ఈ మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి స్పందించి సర్వే నిర్వహించి 30రోజుల్లో నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు.

## ఇక దృష్టంతా ఫలితాలపైనే

>> నింపాలని, విద్యావ్యవస్థ బాగుండాలంటే సాఫ్ట్ వేర్, హార్డ్ వేర్ రెండూ ముఖ్యమేనని చెప్పారు. పదో తరగతి పరీక్షా ఫలితాలమెరుగుదలపై దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యారంగంలో సంస్కరణలు పూర్తయ్యాయని, ఫలితాలపై దృష్టిపెట్టాలన్నారు. 340 మంది ఉన్న పాఠశాలలో మార్పు కనపడాలని, ఆ మార్పుఫలితాల్లో ప్రతిబింబించాలని ఆదేశించారు.అనంతరం తొమ్మిదో తరగతి విద్యార్థులతో మంత్రి మాట్లాడారు. మధ్యాహ్నభోజనం నాణ్యతపై ప్రశ్నించారు. విద్యార్థులకు ఆటోగ్రాఫ్ లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ డీకే బాలాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ.వెంకటేశ్వరరావు,ఆర్జేడీఎస్ నాగమణి,డీఈవో యూవీ సుబ్బారావు,ఎంఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## నేడు ఇ-20 జనతాపార్టీ

>> ఇంధనం విషయంలో కూడా వినియోగదారులకు తాము ఎంచుకున్న పెట్రోల్ కొనుగోలు చేసే హక్కు కల్పించాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఇ20ను అందుబాటులో ఉంచినా, దానితో పాటు 100 శాతం పెట్రోల్‌ను కూడా విక్రయించాలని కోరుతున్నారు. మా కార్లపై ప్రయోగాలు ఆపండి ఇంధనాన్ని ఎంచుకునే హక్కు భారతదేశానికి కావాలి మా వాహనాలు ప్రయోగ యంత్రాలు కావు. సంవత్సరాల ముందే పన్నులు చెల్లించి, మా కష్టార్జితంతో వాటిని కొన్నాము. మనది మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉన్న దేశం, మరియు ఇంధన సామర్థ్యం ప్లస్ వాహన పనితీరు మా రోజువారీ జీవనంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతాయి. అలాంటప్పుడు వాహన మాన్యువల్‌ను అనుసరించకుండా, మా ఇంజిన్లపై ఎందుకు ప్రయోగాలు చేస్తున్నారని ఇజెపి అడుగుతోంది. కొందరు వాహన యజమానులు 20 శాతం ఇథనాల్ కలిపిన ఇ20పెట్రోల్ వాడటం వల్ల వాహనాల ఇంజన్లు దెబ్బతింటున్నాయని, మైలేజ్ తగ్గిందని ఆరోపిస్తున్నారు. నిర్వహణ ఖర్చులు పెరిగినట్లు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఇ20 జనతా పార్టీ పేరిట ఉన్న ఎక్స్ ఖాతాకు 13 వేలకుపైగా, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు 8,800కుపైగా ఫాలోవర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

## కొట్టివేసిన మద్రాసు హైకోర్టు

>> తొక్కిసలాట బాధితుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలన్న ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వనిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై సోమవారం జస్టిస్ సి.వి. కార్తికేయన్, జస్టిస్ ఆర్. శక్తివేల్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపి పిటిషనర్ల వాదనను సమర్థించింది. అంతకుముందు, నియామక ఉత్తర్వులను పంపిణీ చేయడానికి జులైలో కరూర్‌లో ఒక కార్యక్రమాన్ని నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి కోర్టు అనుమతినిచ్చింది. అయితే, ఆ ఉద్యోగ నియామకాలు తాత్కాలిక ప్రాతిపదికన ఉంటాయని, న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయని కోర్టు అప్పుడే స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ద్విసభ ధర్మాసనం సోమవారం విచారణ జరిపి విస్పష్ట తీర్పునిచ్చింది.

# అవగాహన పెంచండి

>> సాధారణ వర్షపాతం నమోదైందని చెప్పారు. మండల స్థాయిలో 249 మండలాలు "తీవ్ర వర్షపాతం లోట్లులో, 359 మండలాలు "వర్షపాతం లోట్లులో ఉండగా, కేవలం రెండు మండలాల్లో మాత్రమే "అత్యధిక వర్షపాతం నమోదైందని తెలిపారు. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, కోస్తాంధ్ర, రాయలసీమ అనే నాలుగు వ్యవసాయ వాతావరణ మండలాలన్నీ ఇప్పటికీ "వర్షపాతం లోట్లు కేటగిరీలోనే కొనసాగుతున్నాయని చెప్పారు. వర్షపాతం పరిస్థితులకు అనుగుణంగా జిల్లాస్థాయి ప్రమాద అంచనాలు, రైతులకు సూచనలు, ప్రత్యామ్నాయ విత్తనాల ప్రణాళిక మరియు దశలవారీ పంటల అత్యవసర ప్రణాళిక చర్యలను ఇప్పటికే ప్రారంభించామని సీఎం చంద్రబాబు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అంచనా వేసిన 8,489 రైతు సేవా కేంద్రాలు మరియు 688 మండలాల్లో, 1,357 రైతు సేవా కేంద్రాలు, 168 మండలాలు అధిక ప్రమాద స్థాయిలో ఉన్నాయని సీఎం చంద్రబాబు చెప్పారు.సాగు విస్తీర్ణంపై ప్రత్యేక దృష్టి.జూలై 25 నాటికి, 12 జిల్లాల్లో సాధారణంగా సాగు కావాల్సిన విస్తీర్ణంలో 50 శాతం కంటే తక్కువ విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో 9 శాతం, బాపట్లలో 5 శాతం, ప్రకాశంలో 15 శాతం మరియు మార్కాపురంలో 15 శాతంతో పరిస్థితి అత్యంత ప్రభావితంగా ఉందన్నారు. 10 జిల్లాల్లో సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే 51 శాతం నుంచి 100 శాతం మధ్య సాగు నమోదైందని చెప్పారు. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు, కర్నూలు, పశ్చిమ గోదావరి సహా ఆరు జిల్లాల్లో సాధారణ సాగు స్థాయిని మించి సాగు నమోదైందని వివరించారు. అధిక ప్రమాదంలో ఉన్న 168 మండలాల్లో, సీజన్ సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే 39 శాతం సాగు నమోదైందని తెలిపారు. కర్నూలు జిల్లాలోని అధిక ప్రమాద మండలాలు సాగులో ముందంజలో ఉండగా, మార్కాపురం ప్రాంతంలోని అధిక ప్రమాద మండలాలు రాష్ట్రంలో అత్యంత వెనుకబడి ఉన్నాయని చెప్పారు. సీజన్ సాధారణ పంట విస్తీర్ణం 30.84 లక్షల హెక్టార్లుగా ఉండాలన్నారు.అయితే ఇప్పటివరకు మొత్తం 16.35 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయని సీఎం చంద్రబాబు చెప్పారు. ఇది సీజన్ సాధారణ విస్తీర్ణంలో 39 శాతం మరియు ప్రస్తుత తేదీ నాటికి సాధారణంగా ఉండాల్సిన విస్తీర్ణంలో 74 శాతమని తెలిపారు.రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవల విషయంలో కొంత గ్యాప్ ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆలూరు నియోజకవర్గ పర్యటనలో ఉద్యోగుల పనితీరును చదివి వినిపించినప్పుడు క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన ప్రతిస్పందనను అధికారుల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రంపచోడవరంలో విద్యార్థి శివాని ఆత్మహత్య చేసుకున్న ఘటనను సీఎం చంద్రబాబు అధికారుల వద్ద ప్రస్తావించారు. చదువులో టాపర్ అయిన శివాని చనిపోవడం చాలా ఆవేదన కలిగించిందని అన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పరిశీలించేందుకు సైకో మెట్రిక్ టెస్టులను చేయించాలని విద్యా శాఖ ఆదేశించిందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు సీఎంకు వివరించారు. మానసిన పరిస్థితిని అంచనా వేసేందుకు నిపుణుల సేవలు తీసుకోవడంతోపాటు... టీచర్లకు కూడా అవసరమైన మేరకు శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తిరుపతిలో తొలి కరోనా కేసు

>> పాజిటివ్ కేసు నమోదుతో యాత్రికుల్లో ఆందోళన భావం నెలకొంది. తిరుపతి అర్బన్ ప్రాంతానికి చెందిన 65 ఏళ్ళ వృద్ధురాలికి ఆదివారం కోవిడ్ పాజిటివ్‌గా తేలడంతో తిరుపతిలో మొదటి కేసు నమోదైంది. గత కొన్ని రోజులుగా ఆమె తీవ్ర శ్వాసకోశ సమస్యలతో బాధపడుతోంది. ఆమెను కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించగా ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. నాలుగురోజుల క్రిందట నిర్వహించిన పరీక్షల్లో కరోనా నిర్ధారణ అయింది. అయితే ఆమె కుటుంబ సభ్యులకు జరిపిన పరీక్షల్లో ఎలాంటి వైరస్ లక్షణాలు లేవని వైద్యారోగ్య శాఖ స్పష్టం చేసింది. గత శనివారం ఒక్కరోజే రాష్ట్రంలో మరో 10 మందికి పైగా కరోనా బారిన పడ్డారనేది వైద్యశాఖ అదికారుల సమాచారం. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 49కి చేరగా, ప్రస్తుతం వివిధ ఆసుపత్రుల్లో 24 మంది చికిత్స పొందుతున్నారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో కొత్త కేసులు నమోదవగా కృష్ణా, తిరుపతి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఒక్కో కేసు నమోదైంది. ఇప్పటివరకు రాష్ట్రంలో కరోనాతో నలుగురు మృతి చెందినట్లు వైద్యశాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. కేసుల సంఖ్య పెరుగుతుండటంతో వైద్యశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నారు.తిరుపతిలోని రుయా ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా వైరస్ సోకిన వారికోసం ప్రత్యేక వార్డులు, పకడలు, వైద్యపరికరాలు, వైద్యసదుపాయాలు అందుబాటులో ఉంచడం జరిగిందని రుయా వైద్యులు తెలిపారు. తిరుపతి యాత్రాస్థలం కావడంతో ఇక్కడకు నిత్యం 70వేలమంది వరకు వివిధ రాష్ట్రాల నుండి విదేశాల నుండి యాత్రికులు తరలివస్తుంటారు. వీరిలో ఎవరికైనా అనుమానాస్పదంగా జ్వరం, జలుబు,చలి ,శ్వాసకోశ సమస్యలు తీవ్రంగా ఉన్నా కరోనా వైరస్ భయం నెలకొంది.

# రాజమండ్రిలో మరో ఇద్దరికి కరోనా

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై27,ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జిజిహెచ్ లో సోమవారం నిర్వహించిన కోవిడ్ టెస్ట్ లో ఇరువురు మహిళలకు పాజిటివ్ నిర్ధారణ అయింది. జిజిహెచ్ లో 14 మందికి రాపిడ్ టెస్టులు చేయగా ఇరువురు మహిళలకు కోవిడ్ లక్షణాలు ఉన్నాయని వైద్యులు తెలిపారు. రాజమహేంద్రవరం శ్రీరంగం పట్నం చెందిన 29 ఏళ్ల మహిళ కు అలాగే రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవలేశ్వరం కి చెందిన 45 సంవత్సరాల మహిళలకు పాజిటివ్ అయింది. ఆర్టీ పి సిఆర్ టెస్ట్ కోసం కాకినాడ పంపించినట్లు తెలిపారు రెండు రోజుల్లో రిపోర్ట్ రానున్నదని వివరించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

# టెన్త్ విద్యార్థిని అనూహ్యంగా ఆత్మహత్య

>> మంత్రముగుద్దులు అయ్యారు. ఇంతలోనే ఈ విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవటం అందరి మనసులను కలించి వేసింది. విద్యార్థిని మృతి పై సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్య మంత్రి పోలవరం జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ట్విట్టర్ వేదికగా విద్యార్థిని మృతి పై విచారం వ్యక్తం చేసిన ముఖ్య మంత్రి తన మనసును ఈ ఘటన కలచివేసింది అని పోస్ట్ చేశారు. మంత్రి నారా లోకేష్ ట్విట్టర్ వేదికగా రంపచోడవరం మెగాపేరంటే టీచర్ మీటింగ్లో ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడిన శివాని మృతి తీవ్ర విషాదం నింపింది అని విషయం తెలిసినప్పటి నుంచి శివాని మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి అని,సోదరీ శివాని ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను అని,ఎంత కష్టమైనా పోరాడుదాం. ఎంతటి సమస్యనైనా ఎదుర్కొందాం. మీకు నేనున్నాను ఈ ప్రభుత్వం ఉంది మన దేశ భవిష్యత్తు సంపద మీరు. అని లోకేష్ పోస్ట్ చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే పోలీసులు అన్ని కొనాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు అంత కలిసి ఉండాలని ఈ విద్యార్థిని రాసిన లేఖ ఘటన స్థలంలో లభించింది.ముఖ్యమంత్రి ప్రశంసలు అందుకున్న విద్యార్థిని ఆత్మ హత్య చేసుకోవటంతో రంపచోడవరంలో జరిగిన పి. టీ.యం కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరి కళ్ళు చమార్చెలా చేసింది ఈ విషాదం.

# బడులు, హాస్టల్స్‌లో స్టీమ్ రైస్ వాడకం

>> అనుసంధానం చేసి పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని ఒక జిల్లాలో మొదలుపెట్టేలా అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రివర్యుల నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు ఆయన తెలిపారు. బియ్యం సంచులపై ఆర్ఎఫ్ఐడీను ముద్రించడం ద్వారా అక్రమ రవాణా అరికట్టడానికి దోహదపడుతుందని, దీన్ని పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో అమలు చేయడానికి అనుమతి ఇవ్వాలన్నారు. రేషన్ బియ్యంలో 10 శాతం నూకల బియ్యం అందిస్తే, ప్రజాపంపిణీలో మంచి ఫలితాలు ఉంటాయని, దీన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని తెలిపారు.అలాగే పెండింగ్ ఉన్న నిధులను విడుదల చేయాలని కోరారు. మంత్రి వెంట పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు , పౌర సరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు, తదితరులు ఉన్నారు.

# లోక్‌సభకు 'పరీక్షల' బిల్లు

>> ఉద్దేశించిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026ను కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈనెల 20న విద్యార్థులపై జరిగిన పోలీసుల బలప్రయోగాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. అటు రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి నెలకొడంతో ఉభయసభలకు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. పార్లమెంట్‌లో సంసద్ ఛలో కార్యక్రమం సందర్భంగా విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. పక్ష సభ్యుల ఆందోళన మధ్య కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాలు నిరసన కొనసాగించడంతో లోక్‌సభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. అటు రాజ్యసభలోనూ విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడారంటూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. విపక్షాల నిరసనల మధ్య మొదట మధ్యాహ్నం 12 గంటల వరకు రాజ్యసభ వాయిదా పడింది. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత విద్యార్థులపై లాఠీఛార్జితో పాటు పలు అంశాలపై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టాయి. ఈ క్రమంలో రాజ్యసభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. ఆ బిల్లు ప్రకారం లీకేజీకి పాల్పడి నిందితులకు పదేళ్ల జైలుశిక్ష, 50 లక్షల ఫైన్ విధించనున్నారు. వాస్తవానికి ఇవాళ 5 గంటలకు ఆ బిల్లుపై చర్చ చేపట్టాలని భావించారు. కానీ విద్యార్థులపై లాఠీఛార్జ్‌ను ఖండిస్తూ విపక్షలు సభలో నినాదాలు చేశాయి. దీంతో గందరగోళం మధ్య సభను మరుసటిరోజుకు వాయిదా వేశారు. సుమారు 6 గంటల పాటు బిల్లుపై చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ పరీక్షల సవరణ బిల్లుపై సమగ్ర చర్చ నిర్వహించాలని కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మరోసారి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించకుండా విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బిల్లుపై నిర్మాణాత్మక చర్చ జరపాలని కోరారు. ప్రశ్నపత్రాల లీకేజీలు వంటి సమస్యలను పరిష్కరించేందుకు కీలక బిల్లును తీసుకొచ్చామని, కానీ కాంగ్రెస్, మరికొన్ని ప్రతిపక్ష పార్టీలు దీనిపై చర్చకు సిద్ధం కాకుండా సభలో అంతరాయం కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. పరీక్షల వ్యవస్థలో సంస్కరణల కోసం ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన చర్యలను ప్రతిపక్షాలు గుర్తించాలని రిజిజు కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలోఉంచుకుని ఈ బిల్లును ఆమోదించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. నాలుగు గంటల చర్చ ఈ బిల్లుపై లోక్‌సభలో నాలుగు గంటలపాటు చర్చ నిర్వహించాలని బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఎసి) నిర్ణయించినట్లు సమాచారం. బిజెపి ఎంపీలు బన్సూరి స్వరాజ్, తేజస్వి సూర్యతోపాటు జేడీయూ, టిడిపి,శివసేన, ఎన్‌సిపి, అప్నాదళ్, ఎల్‌జెపి (రాంవిలాస్) తదితర పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొనే అవకాశం ఉంది.

**బిల్లులో ఏడు కీలక సవరణలు**

ఈ సవరణ బిల్లులో మొత్తం ఏడు కీలక మార్పులు ప్రతిపాదించారు. పేపర్ లీక్‌లు, పరీక్షల్లో అక్రమాలకు సంబంధించిన కేసుల విచారణను వేగవంతం చేయడం, నిందితులకు కఠిన శిక్షలు విధించడం, అమలు వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. బిల్లు ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. ఛార్జిషీట్ దాఖలు చేసిన మూడు నెలల్లో విచారణ పూర్తి చేయాలని ప్రతిపాదించారు. రెండు నెలల్లో దర్యాప్తు ముగించాల్సి ఉంటుంది. పరీక్షల అక్రమాల దర్యాప్తు కోసం కేంద్రం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయవచ్చు. రాష్ట్రాలు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించుకునే అధికారం పొందుతాయి. నేరస్థులకు మరింత కఠిన జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధించే అవకాశం ఉంటుంది. హైకోర్టు డివిజన్ బెంచ్‌లో నిర్ణీత గడువులో అప్పీల్ చేసే విధానాన్ని కూడా బిల్లులో చేర్చారు.



సోమవారం న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద భార్యతో కలిసి బాపూజీకి నావాళులర్పిస్తున్న వాంగ్‌చుక్

## ఆకివీడు రామాలయం నిర్మాణానికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

**విజయవాడ.జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఆకివీడు రామాలయం నిర్మాణానికి సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నిర్మాణానికి కలెక్టర్ ఇచ్చిన ఎన్‌వోసీని సుప్రీంకోర్టు సమర్థించింది. అనుమానాలు ఉంటే మరో పిటిషన్ దాఖలు చేసుకోవచ్చన్నారు. ఆకివీడు రామాలయానికి వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

## సుప్రీంకోర్టులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి చుక్కెదురు

**విజయవాడ.జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** సుప్రీంకోర్టులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి చుక్కెదురైంది. ఏపీ లిక్కర్ స్కాంలో నిందితుడు దొడ్డా వెంకట సత్యప్రసాద్‌కు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను కొట్టివేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. సోమవారం ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం విచారించింది. ఈ పిటిషన్‌లో పలు సందేహాలను చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏమైనా సందేహాలుంటే సరైన సమయంలో తమ అభ్యంతరాలతో కోర్టును ఆశ్రయించవచ్చని ఆ వైసీపీ నేతకు ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేసింది. దొడ్డా వెంకట సత్యప్రసాద్‌ను అప్రూవర్‌గా మార్చి.. మాజీ సీఎం వైఎస్ జగన్‌ను ఈ కేసులో ఇరికించాలని చూస్తున్నారంటూ ఆ పిటిషన్‌లో వైసీపీ నేత చెవిరెడ్డి ఆరోపించారు. దొడ్డా వెంకట సత్యప్రసాద్‌కు ఇచ్చిన ముందస్తు బెయిల్ కొట్టివేయాలంటూ సుప్రీంకోర్టులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పి) దాఖలు చేసారు.ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, దొడ్డా వెంకట సత్యప్రసాద్‌లను అప్రూవర్‌లుగా మార్చి తద్వారా వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ని ఇరికించేందుకు కూటమి ప్రభుత్వంతోపాటు ఈ కేసు విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) కుట్ర పన్నుతున్నాయని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆరోపిస్తున్నారు.

## తమ్మినేని సీతారామ్ కుమారుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ

**విజయవాడ, జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ కుమారుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తమ్మినేని కుమారుడు నాగ్‌కు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఫోర్జరీ డక్యుమెంట్లతో అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన కేసులో నాగ్ పిటిషన్ కొట్టివేసింది. ఇదే కేసులో తమ్మినేని సీతారామ్ సతీమణి వాణికి మధ్యంతర బెయిల్ మంజూరయ్యింది. ఎప్పుడు పిలిస్తే... అప్పుడు విచారణకు రావాలని వాణిని హైకోర్టు ఆదేశించింది.

## వన్ ఇండియా, వన్ సినిమా దిశగా ఎఫ్‌టిసి అడుగులు

>> ఇండియా వన్ సినిమా అనే విప్లవాత్మక లక్ష్యం ప్రతి ఒక్కరికీ చేరాలి. థియేటర్, టెలివిజన్, ఓటీటీ, ఈ మూడు రంగాలు సమాంతరంగా వృద్ధి చెందడమే ప్రభుత్వ ఆకాంక్ష." అన్నారు."రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. భవిష్యత్తులో ఎఫ్‌టీపీసీ చేపట్టే అన్ని రకాల ప్రమోషనల్ కార్యక్రమాలకు, సినీ అభివృద్ధి చర్యలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి సహకారం ఉంటుంది." అని హామీ ఇచ్చారు. క్రియేటివ్ ఎకానమీ ప్రతినిధులు త్వరలోనే రాజధాని అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ఫిల్మ్, టెలివిజన్, థియేటర్ కార్యకలాపాలను విస్తృతంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. భారతదేశంలో సినీసాంకేతిక, వినోద రంగాన్ని ఒకే గొడుగు కిందికి తెచ్చేందుకు ఎఫ్‌టీపీసీచేస్తున్న కృషిని మంత్రి దుర్గేష్ కొనియాడారు. మంత్రిని కలిసిన వారిలో ఎఫ్‌టీపీసీ ఇండియా ప్రెసిడెంట్ చైతన్య జంగా, సెక్రటరీ వర్మ పాకలపాటి, సఖిశక్తి వెల్ఫేర్ ఫౌండేషన్ (పాన్ ఇండియా) ప్రెసిడెంట్ జయ పటేరియా, శ్రీనివాస్, రమేష్, ఈశ్వర్ తదితర ప్రతినిధులు ఉన్నారు.

## పొగాకు కొనుగోళ్లకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మద్దతు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** పొగాకు కొనుగోళ్లకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మద్దతిచ్చేందుకు అంగీకరించిందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఉమ్మడిగా రూ.188 కోట్లు భరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది.ధరల లోటు భర్తీ కింద పొగాకు రైతులకు కిలో పొగాకు రూ.20 ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.94 మిలియన్ కేజీల పొగాకు కొనుగోళ్లకు మద్దతిచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.పొగాకు బ్రైట్ రకం కిలో రూ.240, మీడియం రకం పొగాకు రూ.190, లో గ్రేడ్ పొగాకు రూ.110 మేర తగ్గకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.పొగాకు రైతులను ఆదుకునేందుకు కేంద్రంతో నిత్యం సీఎం చంద్రబాబు సంప్రదింపులు జరిపారు.రాష్ట్ర ప్రభుత్వం.౦౦డు రోజుల క్రితం సీఎం చంద్రబాబును కలిసిన కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, డైరెక్టర్. సీఎం సూచనల మేరకు పొగాకు రైతులను ఆదుకునేందుకు సహకరించాలని కోరుతూ రాష్ట్రంలోని కేంద్ర ప్రతినిధులు.బయ్యర్లతో చర్చలు జరిపారు.

### వారం - వర్జ్యం

28-07-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
చతుర్దశి సా.6.17,
పూర్వాషాఢ మ.1.09
వర్జ్యం : రా.9.58-రా.11.44
దు.ఉ.8.21-ఉ.9.13,
2)రా.11.50-రా.12.42
రాహుకాలం - మ.3.00-4.30

### వార్తాఫలం

**మేషం:** బంధువుల నుండి ఆహ్వానాలు అందుతాయి. అవకాశాలు అప్రయత్నంగా లాభిస్తాయి. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**వృషభం:** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. దేవాలయ సందర్శనం చేసుకుంటారు.

**మిథునం:** ముఖ్యమైన విషయాలలో తొందరపాటు వద్దు. భూముల క్రయ విక్రయాలతో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చెప్పదగినది.

**కర్కాటకం:** పెట్టుబడులకు అనుకూల కాలం. సంఘోద్ధరణకు మీ వంతు సహాయాన్ని అందిస్తారు. ఆస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి.

**సింహం:** ఇంటి యందు శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. సంతాన విద్య విషయంలో బాధ్యతతో వ్యవహరిస్తారు.

**కన్య :** వ్యవహారాలలో ఇతరుల జోక్యాన్ని ఆదిలోనే తుంచివేయండి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్న అవసరాలకు డబ్బు అందుతుంది.

**తుల:** ఆలోచనలు ఫలిస్తాయి. కావు అనుకున్న మొండి పనులలో చలనం ఏర్పడుతుంది. కోపతాపాలకు దూరంగా వుండండి.

**వృశ్చికం:** అందరిలో ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుంది. సాంకేతిక రంగంలోనివారికి అనుకూలంగా ఉంటుంది.వస్త్రలాభం.

**ధనుస్సు:** వివాదాస్పద అంశాలు ఎదురయినప్పుడు సమాధానాలు ఇవ్వక మౌనం వహించండి. ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుంది.

**మకరం:** అన్ని విషయాలు నిబంధనలకు అనుగుణంగా జరగవని లౌక్యం అవసరమని గుర్తించి వ్యవహరించడం వలన లాభపడతారు.

**కుంభం:** మొండి ధైర్యంతో ఒకానొక ముఖ్య నిర్ణయం తీసుకుని అమలు చేస్తారు. దాని తాలూకు ఫలితాలు భవిష్యత్తులో అందుతాయి.

**మీనం:** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. నూతన ఒప్పందాలలో నిదానం అవసరం. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## అబ్దుల్ కలాంకు సిఎం, డి.సిఎం నివాళి



**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నివాళి అర్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ దేశానికి శాస్త్ర, సాంకేతిక పరంగా అబ్దుల్ కలాం ఎన్నో విజయాలను అందించారని సిఎం చంద్రబాబు కొనియాడారు. దేశానికి శాస్త్ర, సాంకేతికపరమైన ఎన్నో విజయాలను అందించి, మిస్సైల్ మ్యాన్‌గా గుర్తింపు పొందిన భారతరత్న ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా నివాళి అర్పిస్తున్నాను అంటూ సిఎం పోస్ట్ చేశారు. తన నిరాడంబరత, నిజాయితీ, మానవతా దృక్పథం వంటి విశిష్ట లక్షణాలతో ప్రజల రాష్ట్రపతిగా కలాం పిలువబడ్డారు. ఆ మహనీయుని వర్ధంతి సందర్భంగా స్మృతికి నివాళి అర్పించారు. డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఒక జాతి భవిష్యత్తును తీర్చిదిద్దుతూనే ఉన్న ఒక దార్శనికతను వదిలి వెళ్లారని డిప్యూటీ సిఎం పవన్ 'ఎక్స్' ఖాతాలో అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా, భారతరత్న డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాంకు వినయపూర్వక నివాళి అర్పించారు. ఆయనను భారత క్షిపణి మానవుడు ఇస్రో, డిఆర్‌డిఒ ద్వారా భారతదేశ అంతరిక్ష, రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసిన ప్రముఖ శాస్త్రవేత్త, భారతదేశ 11వ రాష్ట్రపతి, స్ఫూర్తిదాయకమైన ఉపాధ్యాయుడు, ఆధునిక భారతదేశపు గొప్ప జాతి నిర్మాతలలో ఒకరు అంటూ పవన్ కల్యాణ్ కొనియాడారు. ఆధునిక భారతదేశపు గొప్ప జాతి నిర్మాతలలో ఎపిజె ఒకరని పవన్ అన్నారు.

## సిఆర్‌పిఎఫ్ జవాన్లకు డి.సిఎం శుభాకాంక్షలు



**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** సిఆర్‌పిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన ధైర్యవంతులైన జవాన్లకు డి.సిఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలియజేశారు. "దేశం చూసే ప్రతి శాంతియుత సూర్యోదయం.. చీకటి వేళల్లోనూ మెలకువగా ఉండే జవాన్ల ధైర్యంతో భద్రంగా ఉందన్నారు. వారి అచంచలమైన ధైర్యం, సాటిలేని క్రమశిక్షణ, నిస్వార్థ సేవ భారతదేశ అంతర్గత భద్రతకు ఒక శాశ్వతమైన స్తంభంగా నిలిచాయి. ఉగ్రవాదంతో పోరాడటంలో, వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కోవడంలో, ప్రజాస్వామ్య సంస్థలను పరిరక్షించడంలో, ప్రకృతి వైపరీత్యాలకు స్పందించడంలో, లేదా సంక్షోభ సమయాల్లో పౌరులను రక్షించడంలో అయినా సిఆర్‌పిఎఫ్ ఎల్లప్పుడూ అసాధారణ శౌర్యంతో దేశం పట్ల అచంచలమైన నిబద్ధతతో ముందు వరుసలో నిలిచింది. ప్రతి యూనిఫాం త్యాగానికి ప్రతీక. ప్రతి మిషన్ స్వార్థానికి అతీతమైన కర్తవ్యాన్ని ప్రతిబింబిస్తోంది. ప్రతి ధైర్యసాహసాల చర్య దేశ విశ్వాసాన్ని, ఐక్యతను బలపరుస్తోంది. ధైర్యవంతులైన సిఆర్‌పిఎఫ్ సిబ్బంది కుటుంబాలకు వందనం. వారి నిశ్శబ్ద త్యాగాలు, స్థిరమైన మద్దతు ప్రతి సిఆర్‌పిఎఫ్ యోధుని సంకల్పాన్ని బలపరుస్తాయి" అని ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

## ముర్రం శివాని బలవన్మరణం తీవ్ర విషాదంలోకి నెట్టేసింది: సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ముర్రం శివాని తనువు చాలించడం తీవ్ర విషాదంలోకి నెట్టేసిందని సిఎం చంద్రబాబు తెలిపారు. మెగా పిటిఎం వేదికపై ఉత్సాహంగా మాట్లాడిన శివాని బలవన్మరణం ఆవేదన కలిగించిందని 'ఎక్స్' వేదికగా అన్నారు. 'ఆరోజు తన చదువు, ఉన్నత లక్ష్యాలపై శివాని చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏమైనా తన కలలు నిజం కాకుండానే విద్యార్థిని దూరమవడం కలచివేస్తోంది. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించారు సమస్యలు, కష్టాలు వచ్చినా విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవరూ ఒత్తిడి, నిరాశ, నిస్పృహలకు లోనుకావొద్దని కోరుతున్నా. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధ, ఆవేదనను మీ కుటుంబసభ్యులు, స్నేహితులతో పంచుకోండి. ఒత్తిడిని అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని తెలియజేస్తున్నా' అని సిఎం చంద్రబాబు అన్నారు. శివాని మృతి పట్ల దిగ్భ్రాంతికి లోనవుతున్నట్లు చంద్రబాబు తెలిపారు.

## శివానీ మృతిపై విచారణ జరిపించాలి: సిపిఎం

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రంపచోడవరం మండలం ఇర్లపల్లి కొత్త కాలనీకి చెందిన గిరిజన విద్యార్థిని ముర్రం శివానీ (15) అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని కలిగించిందని సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. శివానీ మృతి అత్యంత బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నిన్నటివరకు ముఖ్యమంత్రితో సహా అందరి చేత ప్రశంసలు పొంది, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిన ఒక విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం అనేక అనుమానాలకు, ప్రశ్నలకు తావిస్తోంది. చిన్నారిని ఆత్మహత్యకు పురికొల్పిన పరిస్థితులు ఏమిటి? ఆమె ఎదుర్కొన్న మానసిక ఒత్తిడికి కారణాలు ఏమిటి? అనే అంశాలపై సమగ్రంగా, నిష్పాక్షికంగా ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శివానీ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఆ కుటుంబానికి తక్షణమే రూ. 25 లక్షల పరిహారం అందించాలనీ వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

## శివానీ మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలి: సిపిఐ

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** గిరిజన విద్యార్థిని ముర్రం శివానీ (15) మరణంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించి, ఆత్మహత్యకు గల కారణాలను వెలికితీయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. విద్యార్థిని ముర్రం శివానీ అకస్మాత్తుగా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి, మరణించడం కలచివేసింది. శివానీ మృతిపట్ల ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ముర్రం శివానీ మరణం ఒక ప్రశ్నగా మిగిలిపోకూడదు. శివానీని ఆత్మహత్యకు పురిగొల్పిన పరిస్థితులు, మానసిక సంఘర్షణకు గల కారణాలను కనుగొనేలా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి, నిజానిజాలు వెలికితీయాలని డిమాండ్ చేశారు.

## సెప్టెంబర్‌లో జిఎన్‌యం సప్లిమెంటరీ పరీక్షలు

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని జిఎన్‌యం విద్యార్థులకు సెప్టెంబర్ నెలలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ బోర్డు ఆధ్వర్యంలో జరుగనున్న ఈపరీక్షలకు అర్హులైన విద్యార్థులు సంబందిత ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల ప్రిన్సిపాళ్ళ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, పరీక్షల షెడ్యూల్ పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ సూచించారు.

# డిఎస్సీ ఆరోపణలపై చర్చకు సిద్ధం

- వైసిపి హయాంలో లిక్కర్, భూకుంభకోణాలపై కూడా చర్చిద్దాం
- అభివృద్ధి - సంక్షేమం మా సిద్ధాంతం, విధ్వంసం, బూతులు గొడ్డలిపార్టీ విధానం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరుశాతం విజయమే లక్ష్యంగా కేడర్ పనిచేయాలి
- పెనమలూరు నియోజకవర్గ టిడిపి కార్యకర్తల సమావేశంలో మంత్రి నారా లోకేష్





**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** డిఎస్సీపై గొడ్డలి పార్టీ అధినేత చేస్తున్న ఆరోపణలపై చర్చకు తాను సిద్ధం అని తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ జగన్‌కు సవాల్ విసిరారు. కంకిపాడు ఆయాన్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో నారా లోకేష్ మాట్లాడుతూ డిఎస్సీపై ఆరోపణలతోపాటు వైసిపి హయాంలో లిక్కర్ భూ కుంభకోణాలపై కూడా చర్చకు తాను సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. 2లక్షల టీచర్ పోస్టులు భర్తీచేసిన చరిత్ర టిడిపిది అని, ఐదేళ్ల వైసిపి హయాంలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేని నీచ చరిత్ర జగన్‌ది అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను అమలుచేసి అత్యంత పారదర్శకంగా డిఎస్సీ నిర్వహిస్తే బురద జల్లుతున్నారు, 150రోజుల్లో విజయవంతంగా డిఎస్సీ నిర్వహిస్తే 150కేసులు వేసి అడ్డుకోవాలని చూశారు, వారు వేసిన కేసులన్నీ న్యాయస్థానాలు కొట్టివేయడం మా చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా ముందుకు తీసుకెళ్తున్నామని, వీటన్నింటినీ పార్టీ కేడర్ ప్రజల్లోకి తీసుకెళ్లాలని లోకేష్ కోరారు. ఇంటింటికీ తెలుగుదేశం (డోర్ టు డోర్) కార్యక్రమం ద్వారా పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను పట్టుదల, క్రమశిక్షణతో అమలుచేయాలని కోరుతున్నా. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, గొడ్డలి పార్టీ విధ్వంసం, ఫేక్ ప్రచారాలను ప్రజలకు వివరించాలి. టిడిపి, బిజెపి, జనసేన కార్యకర్తల మధ్య ఐక్యత చాలా అవసరం. నాయకులు, కార్యకర్తలంతా రాష్ట్రంలోని ప్రతి గడప తొక్కాలి అని పార్టీ శ్రేణులకు మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

**బిళ్ల సత్యనారాయణను పరామర్శించిన మంత్రి లోకేష్**

పెనమలూరు మండలం గోసాలలోని వేణుగోపాలస్వామి నగర్‌లో నివాసం ఉంటున్న టిడిపి సీనియర్ కార్యకర్త బిళ్ల సత్యనారాయణను పరామర్శించారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీలో అంకితభావంతో బిళ్ల సత్యనారాయణ పనిచేస్తున్నారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమానికి పసుపు రంగు చొక్కా ధరించి, తన ద్విచక్ర వాహనంపై టిడిపి జెండాతో హాజరవుతూ గుర్తింపుపొందారు. గత మూడేళ్లుగా కిడ్నీ వైఫల్యంతో బాధపడుతున్నారు. చిన్న కిరాణషాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయనకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె అనారోగ్య సమస్యల కారణంగా మరణించగా చిన్న కుమార్తె ఇటీవల భర్తను కోల్పోయి తన పిల్లలతో కలిసి తల్లిదండ్రుల వద్ద నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లిన మంత్రి నారా లోకేష్, బిళ్ల సత్యనారాయణ, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బిళ్ల సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితిని, కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ బాధ్యత తాను తీసుకుంటానని, అన్ని విధాల అండగా ఉంటానని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

# డిఎస్సీపై గొడ్డలి పార్టీ అబద్ధాలు

- సమైక్యాంధ్ర, నవ్యాంధ్రలో ఉపాధ్యాయ ఉద్యోగాల సృష్టికర్త చంద్రబాబు
- 9 డిఎస్సీలతో 1.80 లక్షల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ ఘనత బాబుదే
- డిఎస్సీ ఎందుకు పెట్టలేదో వైసిపి నేతలు జగన్‌నే అడగాలి
- డిఎస్సీపై బొత్స కామెంట్లు వెనక్కు తీసుకోవాలి: మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయనగరం, జులై 27 ప్రభాతవార్త:** గొడ్డలి పార్టీ అవాస్తవాలతో కూటమి ప్రభుత్వాన్ని బద్నాం చేస్తూ, యువతలో అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విమర్శించారు. డిఎస్సీపై వైసిపి నేతల ఆరోపణలు, మంగళవారం తలపెట్టిన ధర్నా నేపథ్యంలో మంత్రి సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ సమైక్యాంధ్రలోనూ, నవ్యాంధ్రలోనూ ఉపాధ్యాయ ఉద్యోగాల సృష్టికర్త అంటే చంద్రబాబు ఒక్కరే అని ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 9 డిఎస్సీలతో 1.80 లక్షలకు పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశారని మంత్రి కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మెగా డిఎస్సీపై తొలి సంతకం పెట్టి ఆరు నెలల్లోనే 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిన ఘనత కూడా చంద్రబాబుకే దక్కిందన్నారు. డిఎస్సీపై వైసిపి ప్రభుత్వం 230కి పైగా కేసులు వేసినా ప్రభుత్వం ఆన్సర్ షీట్లు, ఫలితాలు, ఎంపిక అన్ని విషయాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచి తన పారదర్శకత నిరూపించుకుందన్నారు. గత ప్రభుత్వం 8 వేల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క డిఎస్సీ కూడా నిర్వహించలేక నిరుద్యోగులు, యువతను మోసం చేసిందని దుయ్యబట్టారు. ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ నిర్వహించని జగన్‌ను వైసిపి నేతలు ఎందుకు? ప్రశ్నించడం లేదని మంత్రి వైసిపి నేతలకు చురకలు అంటించారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు వస్తున్నాయని, ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల విద్య ఏ స్థాయిలో ఉందో చెప్పేందుకు నిదర్శనం అన్నారు.

**బొత్స కామెంట్లకు మంత్రి కొండపల్లి చురకలు:** డిఎస్సీపై బొత్స కామెంట్లకు మంత్రి కొండపల్లి చురకలు అంటించారు. గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన బొత్స గౌరవ ప్రదంగా తన స్థాయికి తగినట్టుగా మాట్లాడాలని మంత్రి కొండపల్లి హితవు పలికారు. వోక్స్ వ్యాగన్ లావాదేవీలతో బొత్స రాష్ట్రానికి పెద్ద మచ్చ తేవడంతోనే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు మహారాష్ట్రకు వెళ్లిందని విమర్శించారు. గత డిఎస్సీలో విజయనగరం జిల్లాలో 583 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చాయని, డిఎస్సీ పరీక్ష ఎంత పారదర్శకంగా జరిగిందో బొత్స ఆ ఉపాధ్యాయులను అడిగితే చెపుతారన్నారు. బొత్స తక్షణమే డిఎస్సీపై చేసిన కామెంట్లను వెనక్కు తీసుకోవాలని మంగళవారం వైసిపి ధర్నా చేస్తే ఉపాధ్యాయులు, నిరుద్యోగులు వాళ్లనే ఛీ కొడతారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో ఒక్క డిఎస్సీ పరీక్ష కూడా ఎందుకు నిర్వహించలేదన్న ప్రశ్నకు బొత్స ఏమని సమాధానం చెపుతారని మంత్రి ప్రశ్నించారు.

## ఎసిలో 1000 'మీ మార్ట్స్'

- ఎన్‌సిసిఎఫ్‌తో పౌరసరఫరాల శాఖ కీలక ఒప్పందం



మంత్రి నాదెండ్ల సమక్షంలో కేంద్ర ప్రభుత్వ నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్‌తో పౌర సరఫరాల శాఖ ఎంఒయు చేసుకున్న దృశ్యం

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజలకు నాణ్యమైన నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించేందుకు ఎపి ప్రభుత్వం కీలక కార్యచరణకు ఉపక్రమించింది. కేంద్ర ప్రభుత్వ నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్‌తో ఎపి పౌర సరఫరాల శాఖ కీలక అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుంది. ఢిల్లీలో పౌర సరఫరాల కమిషనర్ కన్నబాబు ఎన్‌సిసిఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అనీస్ జోసెఫ్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,000 'మీ మార్ట్స్' ఏర్పాటు చేయనున్నారు. తొలి దశలో పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఈ సేవలను ప్రారంభించనున్నారు. రేషన్ దుకాణాల ద్వారానే 'మీ మార్ట్స్' సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మార్ట్స్‌లో 70రకాల నాణ్యమైన వినియోగ వస్తువులు పోటీ ధరలకు విక్రయించనున్నారు. ప్రజలకు నాణ్యమైన వస్తువులను సరసమైన ధరల్లో అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,000 'మీ మార్ట్స్' ఏర్పాటు ద్వారా వినియోగదారులకు మరింత ప్రయోజనం చేకూరనుంది. ఈ సమాచారాన్ని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తన 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు.

## కృష్ణా జలాల్లో వాటాపై సుప్రీంలో విచారణ

- కర్ణాటక విజ్ఞప్తిని తిరస్కరించిన ధర్మాసనం

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జలాల్లో వాటాకు సంబంధించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేస్తూ ఎపి ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం కేసును పరిశీలించింది. సుదీర్ఘ విచారణ చేయాల్సి ఉన్నందున ఈ కేసును ప్రత్యేక బెంచ్ ముందు విచారణకు నివేదిస్తామని వెల్లడించింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ మొదటి వారానికి వాయిదా వేసింది. ఈలోగా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేయాలంటూ కర్ణాటక ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కృష్ణా నదీ జలాల వాటాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ట్రిబ్యునల్ తీర్పును కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఎపి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పైనే ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

# రాష్ట్రం, ప్రజల గురించే సిఎం చంద్రబాబు తపన

- కుటుంబం గురించి ఆలోచించరు.. అభివృద్ధికి చర్యలు
- ప్రభుత్వం ప్రజల ఇంటి గడప తొక్కుతోంది
- ప్రజలు కూటమి ప్రభుత్వంతో చేయి కలపాలి
- సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి



రామకుప్పం మండలం ననియాలతో మహిళలనుద్దేశించి ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి

**కుప్పం, జులై 27 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబు నాయుడు నిత్యం రా ష్ట్రం, రాష్ట్ర ప్రజల గురించే తపన పడుతుంటారని కుటుంబం గురించి ఆలోచించరని సిఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నాలుగు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా సోమవారం నారా భువనేశ్వరి రామకుప్పం మండలం కావలి మడుగులో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం ప్రారంభించారు. ననియాల, పిఎంకె తాండా, ప ంద్యాలమడుగు, రామకుప్పం గ్రామాల్లో పర్యటించి మహిళలు, ప్రజల నుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న సమయంలో సిఎం చంద్రబాబు విజన్ 2020తో ఐటి రంగాన్ని అభివృద్ధి చేశారన్నారు. నేడు రాష్ట్ర విభజన అనంతరం ప్రతి నియోజకవర్గం అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. వైజాగ్ ఐటి హబ్‌గా, అనంతపురం ఆటో మొబైల్ హబ్‌గా రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు. కుప్పానికి సైతం ముప్పై పరిశ్రమలు తీసుకువచ్చారన్నారు. 732కి.మీ.ల దూరంలో ఉన్న కృష్ణాజలాలను రూ.3600 కోట్ల ఖర్చుతో కుప్పానికి తెచ్చారని పేర్కొన్నారు. నదుల అనుసంధానంతో అన్ని ప్రాంతాలకు సాగు, తాగునీరు అందిస్తున్నారన్నారు.


**వైఎస్సార్సీ పాలనలో నోరు తెరవలేని దుస్థితి:** ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో ప్రజలు నోరుతెరవలేని దుస్థితి నెలకొనడంతో పాటు ఎవరు ఉంటారో ఎవరు పోతారో తెలియని పరిస్థితి ఉండేదని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ఐదేళ్లలో అరాచకాలు చేశారని ఈ విషయం ప్రజలు గుర్తించే సిఎం చంద్రబాబుపై విశ్వాసంతో గెలిపించారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సిఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు ఎన్టీఆర్ భరోసా, దీపం 2, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, తల్లికివందనం పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు అన్నక్యాంటీన్లు ప్రారంభించాన్నారు. తాను కష్టపడతానని సంపద సృష్టించి ప్రజలకు పంచుతానని సిఎం చంద్రబాబు పేర్కొంటుంటారన్నారు.

**ప్రజలు ప్రభుత్వంతో చేయి కలపాలి:** ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రజల ఇంటి గడప తొక్కుతోందని ప్రజలు కూడా ప్రభుత్వంతో చేయి కలపాలని నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. నలభై సంవత్సరాలుగా సిఎం చంద్రబాబుకు ఓట్లేసి నాలుగుసార్లు ముఖ్యమంత్రిని చేసిన కుప్పం ప్రజలకు తాను చంద్రబాబు భార్యగా మరువనని పేర్కొన్నారు. కుప్పం ప్రజలంటే సిఎం చంద్రబాబుకు ఎంతో అభిమానం అన్నారు. కుప్పాన్ని మరింత అభివృద్ధి చేసి టూరిజం చిత్రపటంలో కుప్పానికి స్థానం కల్పిస్తారని పేర్కొన్నారు. అంతకుముందు గ్రామాల్లో నారా భువనేశ్వరికి మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. నారాయణపురం తాండాలో దివంగత ఎన్టీఆర్ విగ్రహాన్ని నారా భువనేశ్వరి ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, సిఎం పిఎ శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, నేతలు పట్రా నారాయణ, కృష్ణానాయక్, మనోహర్, రఫీ, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మైనారిటీ మోర్చా కార్యవర్గ సమావేశం

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని మతాలు ఒకటిగా ఉండాలని అన్నారు. రామజన్మ భూమి అంశాన్ని హిందూ- ముస్లిం కోణంలో చూడొద్దని మాధవ్ పేర్కొన్నారు. మత సమభావన అనేది మా సిద్ధాంతమని, వివక్ష లేని పాలన అందిస్తున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు.

## 15 మంది బాధితులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు



**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** అనారోగ్య సమస్యలతో ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ తీసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి వచ్చిన సిఎంఆర్ఎఫ్ అర్జీలను స్వయంగా పరిశీలించి ప్రత్యేక సాయం అందేలా చూశారు. సోమవారం మధ్యాహ్నం మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులను శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావు 15 మంది బాధితులకు రూ.12.78 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ క్లిష్ట సమయంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయానికి, తమ సమస్యలను గుర్తించి స్పందించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# పిహెచ్‌సిల పనితీరుకు 'ఆరోగ్య ఫలితాలే' ప్రామాణికం: మంత్రి సత్యకుమార్

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు మదింపులో కూటమి ప్రభుత్వం సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఎంతమంది రోగులకు సేవలు అందించారు? ఎన్ని పరీక్షలు చేశారు? ఎన్ని ప్రసవాలు నిర్వహించారు? అనే లెక్కలను మాత్రమే కాకుండా అందించిన వైద్య సేవల వల్ల ప్రజల ఆరోగ్యంలో ఎంత మార్పు వచ్చింది? మాతా శిశు మరణాలు తగ్గాయా? రక్తపోటు, మధుమేహ రోగులకు నిరంతర చికిత్స అందుతోందా? లేదా? సేవలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారా? అనే ఫలితాల ఆధారంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును గుర్తించనున్నారు.

ఇందుకోసం మొత్తం 21 కీలక పనితీరు సూచికలతో కొత్త ర్యాంకింగ్, గ్రేడింగ్ విధానాన్ని ప్రభుత్వం రూపొందించింది. సంజీవని. మాతృత్వ, క్షేమ కార్యక్రమాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును అనుసంధానిస్తూ గ్రామస్థాయి వైద్య వ్యవస్థను మరింత జవాబుదారీగా, ఫలితాల ఆధారితంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దడమే ఈ కొత్త ర్యాంకింగ్ విధానం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

**ఐదు అంశాల పరిమితికి స్వస్తి**

ప్రస్తుతం 5 అంశాల ఆధారంగానే వైద్యారోగ్య శాఖ ర్యాంకులను ప్రకటిస్తోంది. ఓపీ విధానంలో రోగుల సంఖ్య, ఆసుపత్రిలో చేరినవారు, ల్యాబ్ పరీక్షలు, ప్రసవాలు, గర్భనిరోధక సాధనాల వాడకం వంటి ఐదు అంశాల ఆధారంగానే పిహెచ్‌సిల పనితీరును అంచనా వేసేవారు. ఈ విధానంలో సేవల సంఖ్య మాత్రమే తెలుస్తోందని, వ్యాధుల నివారణలో సాధించిన పురోగతి, మాతా శిశు ఆరోగ్య ఫలితాలు, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ, రోగులకు నిరంతర చికిత్స వంటి కీలక అంశాలు ప్రతిబింబించడం లేదని అధికారుల పునస్సమీక్షలో తేలింది.

ఈ విధానం అమలు, ఫలితాలపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జారీ చేసిన ఆదేశాల మేరకు అధికారులు పునస్సమీక్ష జరిపారు. సేవలు మెరుగుపడాలంటే 21 కొలమానాల ఆధారంగా ర్యాంకులను ప్రకటించాల్సిన అవసరం ఉందని మంత్రికి నివేదించారు. వీటికి మంత్రి ఆమోదం తెలుపుతూ గ్రామీణులకు వైద్య సేవలు అందించడంలో కీలకంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు ఈ కొత్త ర్యాంకింగ్ విధానంతో మరింత మెరుగుపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

పిహెచ్‌సిల్లో వైద్య సేవలు పొందిన ప్రజలు ఐవిఆర్ఎస్ ద్వారా తెలియజేసే అభిప్రాయాన్ని కూడా ర్యాంకింగ్‌లో భాగం చేశారు. "నెలనెలా ర్యాంకులు ప్రకటించడం ద్వారా వెనుకబడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వెంటనే గుర్తించి లోపాలను సరిదిద్దుతాం. ఈ కొత్త ర్యాంకింగ్ విధానాన్ని అమలు ప్రక్రియను ప్రారంభించాం" అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ తెలిపారు.

వార్త


తెలివిగల వ్యక్తి తన ఆర్థిక విషయాలను, మానసిక సంఘర్షణలను, గృహసంబంధమైన విషయాలను ఎప్పుడూ రహస్యంగానే ఉంచుతాడు.

- శామ్యూల్ జాన్సన్

# ‘జై యువ’తకు సెల్యూట్!


ఎవరు అన్నా అనకున్నా ఇప్పుడు భారతీయ యువతను అభినందించాల్సిన పరిణామాలే తారసపడుతున్నాయి. ఓ పక్కజీవితాల్లో వెలుగులు నింపాల్సిన ప్రభుత్వాలు ఇన్నాళ్లూ వారి వారి సొంత ఎజెండాలతో కాలక్షేపం చేసేస్తాయి. కొత్త తరపు ఆలోచనలను ఎవరైనా, ఎప్పుడైనా స్వాగతించవలసిందే. యువత తమ భవిత కోసం రోడ్డెక్కితే వారిని ఏలిన వారికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్నారన్న భావనతో విదేశీ నిధులు వస్తున్నాయనో, వారి వెనుక ఉండి ఎవరో నడిపిస్తున్నారనో ఒకవర్గం సామాజిక మాధ్యమాల్లో ఊదరగొడుతున్నాయి. అంటే ప్రశ్నించే వారు ఉండకూడదనేది వారి ఆంతర్యమా!? ప్రశ్నిస్తే తప్పా? మరెందుకలా ఉద్యమకారులపై బురద జల్లి యువత గొంతు నొక్కాలన్న ప్రయ్నత్న మంచిది కాదేమో? ఉద్యమకారుల్లో గత రాజకీయ నేపథ్యం ఉండడం నేరమా? వాళ్ళకి సిద్ధాంతాలు ఉండవా? ఉండకూడదా? అయినా యువ చైతన్యాన్ని ఎవరూ ఆపలేకపోయారు. నిజానికి అతి చిన్న వయసులోనే ఈ తరం యువత పరిణితి చెందారు. ఎన్నో విషయాలపై అవగాహన పెంచుకొని పట్టుసాధిస్తున్నారు. వాళ్లల్లో మేధాశక్తికి కొదువ లేదు. వారికి అనుభవం తక్కువని అనుకోవాలి తప్ప కొత్త తరంలో మానసిక పరివర్తనను ఏమాత్రం తక్కువ చేయలేం. వీధుల్లోకి వచ్చిన యువత ఆగ్రహం ఒక్క పరీక్ష గురించో, ఒక్క మంత్రి రాజీనామా గురించో కాదు. అది చాలా కాలంగా విద్యావ్యవస్థపై పేరుకుపోయిన అసంతృప్తి. తమ చదువుకు విలువ ఉందో లేదో? ఉద్యోగం వస్తుందో రాదో? భవిష్యత్తు ఎలా ఉంటుంది? అనే ఆందోళన. కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో జరిగిన ‘నీట్’ ఉద్యమాన్ని ప్రభుత్వం గుర్తించి వారి ఆకాంక్షలపై సానుకూలంగా స్పందించడం, తమకు తమ భవితవ్యమే తప్ప ఈ దేశ రాజకీయాలతో సంబంధం లేదని చెప్పడంలో యువత విజ్ఞత చెప్పుకోదగినది. అందుకే యువత వైఖరితో యావత్తు భారత దేశం ఊపిరిపీల్చుకున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద యువదేశం భారత్ . 2026 నాటికి భారత జనాభాలో 65 మంది 35 ఏళ్లలోపు వారు. 15-29 ఏళ్లమధ్య ఉన్న యువత 25కోట్లకు పైగా ఉంది. ప్రపంచంలోని ప్రతి 5గురు యువకుల్లో ఒకరు భారతీయుడు. దీన్నే ‘యూత్ బుల్జ్ లేదా డెమోగ్రాఫిక్ డివిడెండ్’ అంటారు. యువత ఎక్కువ, వృద్ధులు తక్కువ ఉన్నప్పుడు పని చేసే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ఉత్పత్తి, పొదుపు, పెట్టుబడి పెరుగుతాయి. 2026-2047 వరకు ఇదే భారత్ వికసిత్ భారత్‌గా మారేందుకు స్వర్ణావకాశం. జపాన్, చైనా, యూరప్ వృద్ధుల దేశాలుగా మారుతున్నాయి. 2030 నాటికి ప్రపంచానికి 12 కోట్ల మంది పనివారు కావాలి. ఆ ఖాళీని భారత యువత మాత్రమే భర్తీ చేయగలదు. భారత యువత ప్రపంచంలోనే అత్యంత ధైర్యవంతులు, ఆశావాదులు, టెక్ సావీ.వారికి సరైన విద్య, నైపుణ్యం, అవకాశం ఇస్తే వారు ‘వికసిత్ భారత్’ని నిర్మించడమే కాదు, ప్రపంచాన్నే నడిపిస్తారు. ప్రతి ఏడాది కోటికి పైగా యువత డిగ్రీలు పూర్తి చేసి ఉద్యోగ మార్కెట్లోకి వస్తున్నారు. 2023-24లో సుమారు 1.1 కోట్ల మంది, 2024-25లో దాదాపు 1.2 కోట్ల మంది గ్రాడ్యుయేట్లు బయటకు వచ్చారు. కానీ వారందరికీ ఉద్యోగాల వేటలో తలపండిపోతోంది ఫలితం శూన్యం. 2000 నుంచి 2010 మధ్య దేశంలో ప్రతి ఏడాది సగటున రెండున్నర కోట్లమంది పిల్లలు జన్మించారు. ఆ తరం ఇప్పుడుఉపాధి కోసం బయటకు వస్తోంది. రాబోయే మరో 15 నుంచి 20 సంవత్సరాల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ఆర్థికవేత్తలు దీనినే “డెమోగ్రాఫిక్ డివిడెండ్“లేదా ‘యూత్ బల్జ్’ అంటారు. ఇది ఏ దేశానికైనా ఒక్కసారి మాత్రమే దక్కే అవకాశం. 2050 నాటికి ఈ అవకాశం క్రమేపీ ముగుస్తుంది.అంటే మరో పాతికేళ్లే భారత్ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ప్రతి ఏడాదిసంక్షేమ పథకాల కోసం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, తయారీరంగం, చిన్న పరిశ్రమలపై కూడా భారీ పెట్టుబడులు పెట్టాల్సిన సమయం వచ్చింది. యువత ఉచితాలు కోరుకోవడం లేదు. భారత్ ప్రపంచంలోనే అగ్రశ్రేణి ఆర్థికశక్తిగా నిలిపేయువతమనకు సొంతం.‘జెన్ జీ’ ఉద్యమ స్పందనతో యువశక్తిని సరైన దారిలో నడిపించి దేశభవితలో వారిని అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక ప్రత్యేక సందర్భంలో అభిప్రాయపడ్డారు. ‘జై జవాన్’, ‘జై కిసాన్’ లతో ముందుకుకెళ్తున్న కాంగ్రెస్ పార్టీ ‘జై యువ’ నినాదాన్ని కలుపుకొనిముందుకెళ్తున్నట్లు ప్రకటించారు. అందరికీ విద్య అందుబాటులోకి వచ్చినందున 21ఏళ్ల వయసుకే ఐఎఎస్, ఐపిఎస్‌లు అవుతున్నారు. అదేదారిలో యువతను పార్లమెంట్ తదితర చట్టసభల్లో భాగస్వాములు అయ్యేందుకు వీలుగాఎన్నికల్లో పోటీ చేసే వయసును తగ్గించే అంశంపైచర్చ పూర్తిస్థాయిలో కొనసాగాలని అభిలషించారు. అసెంబ్లీ, లోక్‌సభకు పోటీచేసే వయసు 21 సంవత్సరాలకు, రాజ్యసభ, శాసనమండలికి పోటీ చేసే వయసు 25 సంవత్సరాలకు తగ్గించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. యువతకు ఉద్యమాలతో పనిలేకుండా వారి ఆకాంక్షలను నెరవేర్చగలిగితే వారిలో అసంతృప్తి దూరమవుతుంది. యువతకు రాజకీయ నాయకత్వ అవకాశాలు ఇవ్వడమే కాదు ప్రజాసేవపట్ల నిబద్ధత ఉన్న వారికే ఆ అవకాశం దక్కేటట్లు చూస్తేనే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష. అనేకరంగాల్లో యువత నిర్మాణాత్మక హోదాల్లో తమను తాము నిరూపించుకున్న యువతకు పాలనలో భాగస్వామ్యం కల్పించడంలోనూ ఎవరికీ ఏ అభ్యంతరం ఉండదు. యువశక్తిని గుర్తించిననాడే వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేరి వికసిత్ భారత్‌కు కొత్తదారి గోచరమవుతుంది.

నిన్నటి తప్పుల గురించి కాని, రేపు రాబోయే కష్టం గురించి కాని దిగులుపడడమే అతి గొప్ప కాలహరణం.



మహాత్మా గాంధీ

మనం ఎప్పుడూ ఏదో ఒకటి ఆశిస్తూనే ఉంటాం. ఆశ నెరవేరినా, నెరవేరకపోయినా మనిషిలో ఆశ చావదు. జీవితమే ఆశల వల.



సెసిల్

# ప్రజావాక్కు

## వేగవంతమైన న్యాయ ప్రక్రియ అవసరం

**పోటీ పరీక్షలు** లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేస్తాయి.అలాంటి పరీక్షల్లోప్రశ్నపత్రాల లీకేజీ జరగడంవల్ల నిజాయితీగా శ్రమించిన అభ్యర్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల విచారణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలన్న నిర్ణయం ఎంతో స్వాగతించదగ్గది. ఇలాంటి కేసుల్లో వేగవంతమైన విచారణ నిందితులకు త్వరగా శిక్షపడేలా చేయడమే కాకుండా, పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది.చాలా సందర్భాల్లో దర్యాప్తు, న్యాయ ప్రక్రియలు సంవత్సరాలపాటు సాగుతుంటాయి. దీనివల్ల పరీక్షలురాసిన అర్హులైన అభ్యర్థులు తీవ్రమానసిక ఒత్తిడికి గురవుతారు. వారి విద్య,ఉద్యోగ అవకాశాలు ఆలస్యమవుతాయి. మరోవైపు నేరస్థులకు చట్టంపై భయం తగ్గే ప్రమాదం కూడా ఉంటుంది. అందువల్ల వేగవంతమైన న్యాయ ప్రక్రియ అవసరం. పరీక్షా నిర్వహణలో అత్యాధునిక భద్రతా వ్యవస్థలు, డిజిటల్ పర్యవేక్షణ, ప్రశ్నపత్రా ల రవాణా, నిల్వ ప్రక్రియల్లో కట్టుదిట్టమైన రక్షణ చర్యలు అమలు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## హెల్త్ కార్డులు ఎవరికోసం?

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ హెల్త్‌కార్డులు అందజేయనున్నామని ఈ మేరకు ఉద్యోగులు తమ వివరాలను అప్లోడ్ చేయాలని ప్రకటన చేయడంతో రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులందరూ ఈ విధానం ద్వారా తమకు హెల్త్‌కార్డులు అవసరం లేదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.డిఎలు పిఆర్‌సిలు అడిగితే హెల్త్ కార్డులు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం చేతులు దులుపుకోవడంతో ఉద్యోగ ఉపాధ్యాయులు కంగుతింటున్నారు.

- బి. దేవయ్య, హైదరాబాద్

## కూలీల రేట్లు నియంత్రించాలి

సన్న చిన్నకారు రైతుల వ్యవసాయ పనుల దృశ్య, సామాన్య ధరలు, ఆర్థికవ్యవస్థ,కూలీల రేట్లు అమాంతం వందలు వందలుగా విపరీతంగా పెరగడంతో రైతులకు పెనుభారంగా మారుతుంది. గ్రామంలో కమిటీలు వేసి ధరలను నియంత్రించాలి లేదంటే వ్యవసాయం చేసి వృథా. కూలీ రేట్లు తగ్గించి రైతులను ఆదుకోవాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## ప్రజాస్వామ్యం గెలిచింది

**బొద్దింకల** దెబ్బకు 56 ఇంచిల బాహుబలి దిగివచ్చింది. ఈ దేశాన్ని మత రాజ్యంగా చేయాలనుకున్న వారికి చెంప దెబ్బ.‘తమకున్న మతవాద బలంతో ఈదేశాన్ని రామరాజ్యంగా చెయ్యాలని పలుమార్లు ఊకదంపుడు మాటలు పలికే 56 ఇంచిల బాహుబలి బొద్దింకల దెబ్బకు దిగి రాక తప్పలేదు. బలవంతుమైన పాము చలి చీమల చేత చచ్చనట్లు మాకు తిరుగులేదు, మేము చెప్పిందే వేదం అనే రీతిలో నడుస్తున్న, ఎదురు తిరిగినవారిపై దేశద్రోహం కేసులు అంటూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న బీజేపీ ప్రభుత్వం చివరికి దేశ యువతకు తలవంచక తప్పలేదు.నెహ్రూ ప్రాజెక్టులు కడితే, మోడీ దొంగబాబాల ఆశ్రమాలు, బాలరాముని గుళ్ళు, పటేల్ విగ్రహాలు కట్టారు. నెహ్రూ శాస్త్రీయ విద్య విద్యార్థులకు నేర్పితే, మోడీఇతిహాసాలు, పుక్కిటి పురాణాలు, అశాస్త్రీయ వాస్తు, జ్యోతిష్యాలు, మంత్ర తంత్రాలు, చేతబడులు, గాయత్రీమంత్రాలు,పాఠ్యాంశాలుగా పెట్టాడు.సైన్స్ కాంగ్రెస్ సదస్సులను మంత్రగాళ్ల సభలుగా మార్చారు.అహంకారంతో ఏదైనా చేస్తాం అనుకునే వాళ్లకు ఇది ఒక గొప్ప గుణపాఠం. ఇప్పటికైనా ప్రభుత్వాల తీరు మారాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## ఉద్యోగాల కోత

**ఇప్పటివరకు** ఇంజనీరింగ్ విద్య చదివిన వారందరూ అధిక జీతాలకు ఆశపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎగబడి దేశ విదేశాలలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. కొందరికి ఉద్యోగాలు దొరకక ప్రయివేటు సంస్థలలోను చిన్నదో పెద్దదో ఎంతోకొంత జీతానికి పని చేస్తున్నారు.పెద్దపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఈమధ్య తమ సీనియర్ ఉద్యోగులను వేలసంఖ్యలో తొలగిస్తున్నారు. కొత్తగా జాయిన్ అయిన వాళ్ల కూడా ఎప్పుడు తమ ఉద్యోగాలు ఊడుతాయోననే భయపడుతున్నారు. నైపుణ్యం గలవారే ఎక్కువ కాలం ఉంటున్నారు. ఉద్యోగాలు కల్పోతున్నవారికి ప్రత్యామ్నాయం ఏమిటి?

- ఎం. నాగరాజు, కరీంనగర్‌జిల్లా

## స్పెషల్ ప్రమోషన్లు ఇవ్వాలి

**తెలంగాణా** రాష్ట్రంలో ఉన్న వివిధ శాఖల వికలాంగుల ఉద్యోగులకు స్పెషల్ డిపార్టుమెంటు ప్రమోషన్స్ ఇవ్వాలి. ఉన్నత అర్హత, డాక్టరేట్ పట్టభద్రుల వికలాంగులకు స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలి. వీరికి తప్పకుండా జి. ఓ 34 వర్తింపజేయాలి.దివ్యాంగులైన ఉన్నత ఉద్యోగులకు ప్రమోషన్స్ కల్పిస్తే వారికి కూడా గౌరవం దక్కుతుంది.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# సర్టిఫికెట్లు కాదు, విద్యార్థులకు నైపుణ్యం ముఖ్యం

*విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో కలిసి పాఠ్యాంశాలను రూపొందించాలి. శిక్షణను మార్కుల కోసం చేసే కార్యక్రమంగా కాకుండా, ఉద్యోగానికి సిద్ధం చేసే ప్రక్రియగా మార్చాలి. పరిశ్ర మలు కూడా శిక్షణను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలి. సమాజం డిగ్రీని గౌరవించినంతగా నైపుణ్యాన్నీ గౌరవించడం నేర్చుకోవాలి. భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే మరిన్ని విశ్వవిద్యాలయాలు నిర్మించడం ఒక్కటేసరిపోదు. మరిన్ని డిగ్రీలు ఇవ్వడం కూడా సరిపోదు. విశ్వవిద్యాలయాలు సర్టిఫికెట్లు ముద్రించే కేంద్రాల నుంచి మానవ మూలధనాన్ని తీర్చిదిద్దే కేంద్రాలుగా మారాలి. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడాన్ని నిర్ణయించేది విశ్వవిద్యాలయాలు ఎన్ని డిగ్రీలు ఇచ్చాయన్నది కాదు, ఎన్ని సమస్యలను పరిష్కరించగల మనుషులను తీర్చిదిద్దాయన్నదే.*

డి.వి.బి శ్రీహరిన్

ఒకప్పుడు విద్య ఉద్యోగానికి మార్గం. నేడు విద్య ఉద్యోగానికి హామీ కాదు. ఇదే ఇరవై ఒకటో శతాబ్దపు అతి పెద్ద సామాజిక, ఆర్థిక వైరుధ్యం. ప్రతి సంవత్సరం లక్ష లాది మంది యువత డిగ్రీలు, పీజీలు, వృత్తిపరమైన అర్హ తలు సంపాదించి ఉద్యోగ విపణిలోకి ప్రవేశిస్తున్నారు.అయినప్పటికీ నిరుద్యోగం తగ్గడం లేదు. అదే సమయంలో పరిశ్రమలు మాత్రం ‘పనికి సిద్ధంగా ఉన్న నైపుణ్యం కలిగిన యువత దొరకడం లేదు’ అని వాపోతున్నాయి. ఒకవైపు సర్టిఫికెట్లు పెరుగుతుంటే, మరోవైపు సామర్థ్యం కొరత కొనసాగుతోంది. సమస్య ఉద్యోగాల్లో లేదు. సమస్య విద్యలో లేదు, సమస్య ఈ రెండింటి మధ్య తెగిపోయిన సంబంధంలో ఉంది. ప్రపంచ ఆర్థికవ్యవస్థ నైపుణ్యాలను కోరుతున్న వేళ, మన విద్యా వ్యవస్థ ఇంకా సర్టిఫికెట్లను ఉత్పత్తి చేస్తోంది. ఈ వైరుధ్యాన్ని అర్థం చేసుకోవాలంటే ముందు భారత ఉన్నత విద్య విస్తరణను చూడాలి. ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏఐఎస్‌హెచ్‌ఈ) ప్రకారం దేశంలో 4.3 కోట్లకు పైగా విద్యార్థులు ఉన్నత విద్యలో ఉన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఉన్నత విద్యా వ్యవస్థల్లో భారత్ ఒకటి. స్వాతంత్ర్యం తర్వాత విద్యను ప్రజలకు చేరువ చేయడంలో ఇది గొప్ప విజయమే. ఇది విద్యఅందుబాటులోకి వచ్చిందనే విజయాన్ని సూచిస్తుంది. కానీ అదే విద్య ఆర్థికవ్యవస్థకు అవసరమైన నైపుణ్యాలుగా మారకపోవడమే అసలు ఆందోళన. అందుకే విద్యా విస్తరణ, ఉద్యోగ యోగ్యత విస్తరణగా మారలేదు. ఇండియా స్కిల్స్ రిపోర్టు ప్రకారం సుమారు సగం మంది గ్రాడ్యుయేట్లు మాత్రమే పరిశ్రమలకు వెంటనే ఉపయోగపడే స్థాయిలో ఉన్నారు. అంటే సమస్య చదువుకున్న వారి సంఖ్యలోలేదు. వారు సంపాదించిన విద్య, ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన సామర్థ్యంగా మారకపోవడంలో ఉంది. ఇక్కడే డిగ్రీల ద్రవ్యోల్బణం అనే భావన ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ద్రవ్యోల్బణంలో కరెన్సీ కొనుగోలు శక్తి తగ్గినట్లే, డిగ్రీలు విపరీతంగా పెరిగినప్పుడు వాటి ప్రత్యేకత కూడా తగ్గుతుంది.ఒకప్పుడు ఇంటర్ లేదా డిప్లొమాతో లభించిన ఉద్యోగానికి ఇప్పుడు డిగ్రీ అవసరమవుతోంది. నిన్న డిగ్రీ సరిపోతే, నేడు పీజీ కోరుతున్నారు. ఉద్యోగ స్వభావంఅంతగా మారకపోయినా, విద్యార్హతలు మాత్రం పెరుగుతున్నాయి. డిగ్రీలు జ్ఞానాన్ని కొలిచే సాధనంగా కాకుండా, అభ్యర్థులను వడపోసే సాధనంగా మారుతున్నాయి. ఆర్థిక శాస్త్రంలో 2001 నోబెల్ బహుమతి గ్రహీత మైకేల్ స్పెన్స్ ఈ పరిస్థితిని దాదాపు అర్థశతాబ్దం క్రితమే వివరించాడు. ఉద్యోగం ఇవ్వబోయే సంస్థకు అభ్యర్థి నిజంగా ఎంత సమర్థుడో ముందుగానే తెలుసుకోవడం సాధ్యం కాదు. అందుకే అది డిగ్రీని ఒక సంకేతంగా ఉపయోగిస్తుంది. మంచి డిగ్రీ అంటే నేర్చుకునే సామర్థ్యం, క్రమశిక్షణ, పట్టుదల ఉన్న వ్యక్తి అని భావిస్తుంది. కానీ అదే డిగ్రీ లక్షల మందికి వచ్చినప్పుడు ఆ సంకేతం బలహీనపడుతుంది. అప్పుడు మరింత ఉన్నత విద్యార్హతలను కోరడం ప్రారంభమవుతుంది. ఇదే డిగ్రీల ద్రవ్యోల్బణానికి మూల కారణం.సమస్య విద్యార్థుల్లోలేదు. విద్యను ఎంపిక ప్రమాణంగా ఉపయోగించే వ్యవస్థలోఉంది. ఆర్థిక శాస్త్రంలో 1992 నోబెల్ బహుమతి గ్రహీత గ్యారీ బెకర్ విద్యను మానవ మూలధనంగా అభివర్ణించాడు. యంత్రాల్లో పెట్టుబడి పెడితే ఉత్పత్తి పెరిగినట్లే, విద్యపై పెట్టుబడి పెడితే మనిషి ఉత్పాదకత పెరగాలి. కానీ విద్య సామర్థ్యాన్ని పెంచకుండా కేవ



లం సర్టిఫికెట్‌ను మాత్రమే ఇస్తే, అది మానవ మూల ధనంగా మారదు. నేడు భారత్ ఎదుర్కొంటున్న అసలు సమస్య ఇదే. మనం విద్యలోపెట్టు బడి పెడుతున్నాం, కానీ ఉత్పాదకతలో అదే స్థాయి పెరు గుదల కనిపించడం లేదు. డిగ్రీల సంఖ్య పెరుగుతోంది. కానీ సమస్యలను పరిష్కరించే సామర్థ్యం అదే వేగంతో పెరగడం లేదు. అందుకే విద్య విస్తరిస్తున్నా, ఆర్థిక వ్యవస్థకు అవసరమైన మానవ మూలధనం అదే వేగంతో పెరగడం లేదు. ఇది కేవలం విద్యావ్యవస్థ వైఫల్యం కాదు. ఇది సమాజం నిర్మించుకున్న ఒక ఆలోచనా విధాన ఫలితం. దశాబ్దాలుగా భారతీయ కుటుంబాల్లో ‘మంచి డిగ్రీ అంటే మంచి ఉద్యోగం’ అనే సమీకరణ బలంగా స్థిరపడింది.పాఠ శాలలు మార్కుల కోసం, కళాశాలలు డిగ్రీల కోసం, విద్యా ర్థులు ఉద్యోగాల కోసం పరుగు తీశారు. కానీ ప్రపంచఆర్థిక వ్యవస్థ అంతలోనే మారిపోయింది. నేడు ఉద్యోగదాత అడుగుతున్న ప్రశ్న ‘ఏ డిగ్రీ చేశావు?’ కాదు. ‘ఏం చేయగలవు?’ అన్నది. ఈ మార్పును మరింత వేగవంతం చేసింది కృత్రి మ మేధ. గత పారిశ్రామిక విప్లవాలు శారీరక శ్రమను భర్తీ చేశాయి. కానీ కృత్రిమ మేధ విశ్లేషణ, సమాచార ప్రాసెసింగ్, పునరావృత మేధోపరమైన పనులను కూడా స్వీకరిస్తోంది. అందువల్ల పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించడం కంటే, సమస్యలను కొత్త కోణంలో చూడడం, వేగంగా నేర్చుకోవడం, సృజనాత్మకంగా ఆలోచించడం, విభిన్న రంగాల జ్ఞానాన్ని అనుసంధానించడం వంటిసామర్థ్యాలే ఎక్కువ విలువ పొందుతున్నాయి. ప్రపంచ ఆర్థిక నివేదిక విడుదల చేసిన ఫ్యూచర్ ఆఫ్‌జాబ్స్ రిపోర్టు-2025 ఈ మార్పును స్పష్టంగా ప్రతిబింబించింది. 2030నాటికి ఉద్యోగాలకు అవసరమైన ప్రధాన నైపుణ్యాల్లో దాదాపు 39శాతంమార్పు వస్తుందని ఆ నివేదిక అంచనా వేసింది. అదే సమయంలో 17 కోట్ల కొత్త ఉద్యోగాలు ఏర్పడగా, 9.2 కోట్ల ఉద్యోగాలు కనుమరుగయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ గణాంకాలు ఉద్యోగాల సంక్షోభాన్ని కాదు, నైపుణ్యాల సంక్షోభాన్ని సూచిస్తున్నాయి. ప్రపంచం ఇప్పుడు డిగ్రీల ఆధారంగాకాదు, నైపుణ్యాల ఆధారంగా మానవ వనరులను అంచనా వేయడం ప్రారంభించింది. భారత్‌కు ఈమార్పు మరింత కీలకం. ప్రతి సంవత్సరం ఒక కోటినుంచి 1.2కోట్ల మంది యువత ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నారు. ఇదే మన జనాభా ప్రయోజనం. కానీ నైపుణ్యాలుగా మారని విద్య ఈజనాభా ప్రయోజనాన్ని నిరుద్యోగ భారంగా మార్చేప్రమాదం ఉంది. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాలకు వేల సంఖ్యలో ఇంజినీర్లు, పీజీలు దరఖాస్తు చేస్తుండగా, మరోవైపు పరిశ్రమలు శిక్షణ పొందిన వెల్డర్లు, యంత్ర నిర్వహణ నిపుణులు, డేటా విశ్లేషకులు, సైబర్ భద్రత నిపుణులు, కృత్రిమ మేధ ఇంజినీర్ల కోసం వెతుకుతున్నాయి. చదువుకున్న నిరుద్యోగం, నైపుణ్యాల కొరత ఒకేసారి కనిపించడం కంటే పెద్ద హెచ్చరిక ఇంకేముంటుంది? విద్య జ్ఞానాన్ని ఇస్తుంది. నైపుణ్యం ఆ జ్ఞానాన్ని ఆర్థిక విలువగా మారుస్తుంది. ఈ రెండింటిమధ్య సంబంధం తెగిపోయినప్పుడు డిగ్రీల ద్రవ్యోల్బణం ప్రారంభమవుతుంది. అందుకే సంస్కరణలు కూడా విద్యార్థులతో మొదలై విద్యార్థుల దగ్గరే ముగియ కూడదు. విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో కలిసి పాఠ్యాంశాలను రూపొందించాలి. శిక్షణను మార్కుల కోసం చేసే కార్యక్రమంగా కాకుండా, ఉద్యోగానికి సిద్ధం చేసే ప్రక్రియగా మార్చాలి. పరిశ్రమలు కూడా శిక్షణను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలి. సమాజం డిగ్రీని గౌరవించినంతగా నైపుణ్యాన్నీ గౌరవించడం నేర్చుకోవాలి. భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే మరిన్ని విశ్వవిద్యాలయాలు నిర్మించ డం ఒక్కటేసరిపోదు. మరిన్ని డిగ్రీలు ఇవ్వడం కూడా సరి పోదు. విశ్వవిద్యాలయాలు సర్టిఫికెట్లు ముద్రించే కేంద్రా ల నుంచి మానవ మూలధనాన్ని తీర్చిదిద్దే కేంద్రాలుగా మారాలి. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడాన్ని నిర్ణయించేది విశ్వవిద్యాలయాలు ఎన్ని డిగ్రీలు ఇచ్చాయన్నది కాదు, ఎన్ని సమస్యలను పరిష్కరించగల మనుషులను తీర్చిదిద్దాయన్నదే. ●

# డిజిటల్ కరెన్సీతో ఆర్థిక వ్యవస్థకు మరింత భద్రత

సి.హెచ్.ప్రతాప్

సాంకేతిక విప్లవం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను వేగంగా రూపాంతరం చెందిస్తోంది. ఒకప్పుడు వస్తు మార్పిడి విధానం నుంచి నాణేలు, కాగితపు నోట్లు,బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ చెల్లింపుల వరకు అభివృద్ధి చెందినద్రవ్య వ్యవస్థ ఇప్పుడు కేంద్ర బ్యాంకు డిజిటల్ కరెన్సీ యుగంలోకి అడుగుపెట్టింది. ఈ మార్పులో భాగంగానే భారతీయ రిజర్వ్ బ్యాంకు డిజిటల్ రూపాయిని ప్రవేశపెట్టి దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారంచుట్టింది. డిజిటల్ రూపాయి అనేది మనం వినియోగించే కాగితపు నోట్లకు డిజిటల్ రూపం. ఇది సాధారణ డిజిటల్ చెల్లింపు విధానాలైన యూపీఐ లేదా మొబైల్ వాలెట్లతో సమానం కాదు. యూపీఐలో ఒక బ్యాంకు ఖాతా నుంచి మరొక ఖాతాకు నిధులు బదిలీ అవుతాయి. అయితే డిజిటల్ రూపాయి విషయంలో డబ్బు స్వరూపమే డిజిటల్‌గా ఉంటుంది. ఇది నేరుగా ఆర్‌బీఐ జారీచేసే చట్టబద్ధమైన అధికారిక కరెన్సీ కావడంతో భౌతిక నగదుకు సమానమైన విశ్వసనీయతను కలిగి ఉంటుంది. డిజిటల్ రూపాయి వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. కరెన్సీనోట్ల ముద్రణ,రవాణా, భద్రత, నిర్వహణ వంటి వ్యయాలు తగ్గుతాయి. లావాదేవీలు వేగంగా, సులభంగా పూర్తవడంతో సమయం ఆదా అవుతుంది. నగదు వినియోగం తగ్గడంవల్ల నకిలీ నోట్ల సమస్యను నియంత్రించడంతో పాటు ఆర్థికవ్యవస్థలో పారదర్శకత పెరుగుతుంది. చిన్న మొత్తాల చెల్లింపుల నుంచి పెద్ద లావాదేవీల వరకు దీన్ని వినియోగించే అవకాశం ఉంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల కోసం హోల్‌సేల్ డిజిటల్ రూపాయి, సాధారణ ప్రజల కోసం రిటైల్ డిజిటల్ రూపాయిని ఆర్‌బీఐ దశలవారీగా ప్రవేశపెడుతోంది. డిజిటల్ రూపాయి వ్యాపార రంగానికి కూడా మేలు చేస్తుంది. నగదు నిర్వహణ ఖర్చుతగ్గడం, తక్షణ చెల్లింపులు, మెరుగైన నగదు ప్రవాహం వంటి ప్రయోజనాలు లభిస్తాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పన్నుల వసూళ్లు, ఆర్థిక లావాదేవీలలో పారదర్శకత పెరగడానికి కూడా ఇది తోడ్పడుతుంది. భవిష్యత్తులో అంతర్జాతీయ చెల్లింపులను మరింత వేగవంతంగా, తక్కువ వ్యయంతో నిర్వహించే అవకాశాలను కూడా ఇది విస్తరించగలదు. అదేవిధంగా, డిజిటల్ రూపాయి డిజిటల్ ఇండియా, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ వంటి జాతీయ లక్ష్యాలకు మరింత బలం చేకూరుస్తుంది. బ్యాంకింగ్ సేవలు పూర్తిగా అందని ప్రాంతాల్లో కూడా డిజిటల్ లావాదేవీలను విస్తరించే అవకాశాన్ని కల్పిస్తుంది. విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు వేగంగా,పారదర్శకంగా అందించడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. అయితే డిజిటల్ కరెన్సీ విజయవంతం కావాలంటే కొన్ని సవాళ్లనుఅధిగమించాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్‌మౌలిక సదుపాయాల విస్తరణ, సైబర్ భద్రత బలోపేతం,ప్రజల్లో డిజిటల్ అక్షరాస్యత పెంపు,వినియోగదారుల గోప్యత పరిరక్షణ వంటి అంశాలకు అధికప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా వృద్ధులు, గ్రామీణ ప్రజలు, సాంకేతిక పరిజ్ఞానంపై పరిమిత అవగాహన ఉన్నవర్గాలకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. డిజిటల్ రూపాయిని బిట్‌కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీలతో పోల్చడం సరైందికాదు. క్రిప్టోకరెన్సీలు మార్కెట్ ఆధారంగా విలువ మారే ప్రైవేట్ డిజిటల్ ఆస్తులు కాగా, డిజిటల్ రూపాయి భారతీయ రిజర్వ్ బ్యాంకు జారీ చేసే అధికారిక చట్టబద్ధకరెన్సీ. ప్రపంచంలోని అనేకదేశాలు కేంద్రబ్యాంకు డిజిటల్ కరెన్సీలను అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో,భారత దేశం కూడా ఈ రంగంలో ముందంజలో నిలుస్తోంది.డిజిటల్ కరెన్సీ సాంకేతిక ఆవిష్కరణ మాత్రమే కాదు, భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది. సమర్థవంతమైన నియంత్రణ, అత్యున్నత భద్రతా ప్రమాణాలు, బలోపేతమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, ప్రజల విశ్వాసం కలిసి నడిస్తే డిజిటల్ రూపాయి భారత ఆర్థిక వ్యవస్థను మరింత ఆధునికంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనంగా నిలుస్తుంది. ●

# బాధ్యత కలిగిన యువతతోనే దేశ భవిష్యత్తు

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దేశంలో వివిధ వైద్య కళాశాలలలో వైద్య కోర్సులలో ప్రవేశం కోసం నిర్వహించే అర్హత పరీక్షలో జరిగిన ప్రశ్నాపత్రం పరీక్ష కంటే ముందుగానే బయటికి రావడం గత కొంతకాలం నుండి పెద్ద దుమారాన్నే రేపింది. ఈ క్రమంలో అభ్యర్థుల నుండి మొదలైన నిరసనలు క్రమక్రమంగా అధికమై దేశంలో యువతరం వరకు వ్యాప్తి చెంది పరీక్ష లీక్ తీరుపై వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తం కావడం ప్రభుత్వాన్నీ ఆలోచనలో పడవేయడం, యువత చేసిన నిరసనలో భాగంగా ఆ శాఖను నిర్వహిస్తున్న కేంద్ర మంత్రితప్పని పరిస్థితుల్లో యువత కోరుకున్న విధంగానే రాజీనామా చేయవలసిన పరిస్థితి రావడం ఇదంతా ఒక ఎత్తు అయితే, యువత జరిపి నిరసనతో ప్రభుత్వమే దిగి రావడం యువత అనుకుంటే సాధించలేనిది ఏమీ లేదనే ఇలాంటి విషయం ఎల్లప్పుడు ప్రతి ఒక్కరు గుర్తించుకొనే విధంగా మిగిలిపోవడంతో ఇకపై అవినీతికి అక్రమాలకు పాల్పడుతున్న వారి తీరు మారాల్సిన అవసరం ఉంటుంది. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలచేత ఎన్నుకోబడిన నాయకులు కూడా యువతను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయాలు చేయాల్సిన అవసరం ఉంటుందని పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తుండడం విశేషం. పరీక్ష విధానంలో కూడా పారదర్శకత కలిగిన విధానంతో సరికొత్త సంస్కరణలు రావాల్సిన అవసరం ఉంది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ సందర్భంగా నెలకొన్న పరిస్థితులను గమనిస్తే భారతదేశంలో నవతరం నిరంతరం దేశ పరిణామాలపై స్పందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు గోచరిస్తుంది. ప్రధానంగా ప్రభుత్వాలు విధానపరమైన కఠినమైన చర్యలు తీసుకోకపోవడం, జాగ్రత్తలు పాటించకపోవడం వలన అవినీతి అక్రమాలు లాంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నాయనే విషయాలు ఎంతో కాలం నుండి చదువుకున్న యువతలో ఎంతో కొంత అశాంతికి అలజడికి కారణం అవుతున్నాయి. ఈ అంశంపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువత పార్టీలకతీతంగా తొలిసారిగా బయటికి వచ్చి నీట్ ప్రవేశ ప్రశ్నాపత్రం లీక్ బాధ్యులైన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని అంతేకాకుండా దేశంలో ఎలాంటి అవినీతి అక్రమాలు జరిగినా మొదట ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వంలోని సంబంధిత శాఖ మంత్రులు బాధ్యత వహించాలని డిమాండ్ చేసింది. అయితే ప్రస్తుతం ఆధునిక సాంకేతిక యుగంలో దేశంలోని యువత మధ్య కమ్యూనికేషన్ వ్యవస్థ సందేశాల పురోగతి అతివేగంగా జరగడంతో చాలామంది తొలిసారిగా యువతను మేల్కొలిపే విధంగా గ్రూపులను రూపొందించుకుని సమస్యలపై స్పందించేందుకు నిర్భయంగా యువతరం నేడు ప్రభుత్వాలను నేరుగా ప్రశ్నిస్తున్నది అంటే ప్రభుత్వాలు ఎంతో కొంత యువతరం ఆలోచనలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టవలసిన ఆవశ్యకత ఉంది. ఈ విధంగా దేశంలోని యువతరానికి జరు



గుతున్న నష్టాన్ని ప్రశ్నించడానికి మాత్రమే కాకుండా ఎన్నుకున్న ప్రభుత్వాల అజెండా అమలు విధానాల పైన కూడా రాబోవు కాలంలో యువత ప్రశ్నించేందుకు వెనుకాడదేమో. ఏ విషయంలోనైనా సమాజానికి భంగం వాటిల్లే క్రమంలో అందుకు సంబంధించిన వారు ఎవరైనా జవాబుదారీతనంగాఉండాల్సి వస్తుంది అనేచర్చ జరుగుతుంది. నేటి యువత రేపటి భారత దేశ భవిష్యత్తుకు పునాదులు అలాంటి యువత భారతదేశ సమైక్యతను దేశభక్తి సమగ్రతతోపాటుజాతీయ వాదాన్ని బలంగా వినిపిస్తున్నారు. అలాంటి యువతరం భారతదేశం ఉన్నతికి భద్రతకు వెన్నంటి ఉంటారు అనేది అక్షరసత్యం. అందుకు ప్రభుత్వాలు కూడా దేశ భవిష్యత్తులో కీలకంగా మారనున్న యువత సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కాలయాపన చేయకూడదనే విషయంపై అన్ని రాజకీయ పార్టీల్లో చర్చ జరగాల్సిన అవసరం ఉంది. విద్యావంతులు చదువుకున్న వారు భారత దేశంలో ఎక్కువ అవుతున్నారు. దేశంలో ఎలాంటి అంశాల్లోనైనా లోపాలు కనపడితే ప్రశ్నించేందుకు నేటితరం యువత సిద్ధంగా ఉంటుందని, లోపాలను సవరించే వరకు జవాబుదారీతనం వచ్చేంతవరకు నిరసన వ్యక్తం అవుతుందని, తలచుకుంటే సాధించేందుకు యువతరానికి ఏది అడ్డు లేదని చెప్పే రీతిలో యువతరం దేశవ్యాప్తంగా చేసిన శాంతియుత నిరసన విధానాలు చెప్పకనే చెప్తున్నాయి. నేటితరం యువతరం ప్రశ్నించే విషయాలను నిజానిజాలను విశ్లేషించుకోవాలి, నిర్ధారణ చేసుకోవాలి. సరైన విధానం ఉంటే దాన్ని తప్పనిసరిగా అమలు చేసే విధంగా సమస్య కఠినతరం కాకుండా యువతరాన్ని కూడా కలుపుకుపోతూ వారి అభిప్రాయాన్ని కూడా స్వాగతించాల్సిన అవసరం కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాలకు ఉండాల్సిందేమో. ఈ క్రమంలో దేశ పరిస్థితుల విషయాలపై యువత మేల్కొని అప్రమత్తంగా ఉంటుందని పాలకులు అందించే విధానాలను నిరంతరం గమనిస్తూ సమాధానం కొరకు నిరంతరం ప్రశ్నిస్తామంటూ ముందుకు వస్తున్న యువతరానికి పాతతరం అనుభవాల సారం కూడా భవిష్యత్ భారత దేశ యువతకు దిశా నిర్దేశం ఆధికృత మార్గదర్శకం అవుతాయని భావించే వారు లేకపోలేదు. యువత ఐక్యత రాగానికి సంబంధించి ప్రభుత్వ ప్రజాపాలనలో ఎటువంటి లోపాలు జరిగినా సంబంధిత పరిపాలనా ప్రతినిధులు బాధ్యత వహించవలసి ఉంటుందనే సందేశం దేశవ్యాప్తంగా వ్యాప్తి చెందింది. దేశ సమగ్రతకు దేశ భద్రతకు ఎటువంటి విఘాతం కలగకుండా యువత మంచి ఆలోచన విధానాలు న్యాయ సమ్మతమైనవి అయితే పార్టీలకు రాజకీయాలకతీతంగా యువత ప్రశ్నిస్తే దానికి తప్పనిసరిగా జవాబుఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉంటుందేమో. రాబోవు కాలంలో ఎలాంటి ప్రభుత్వాలు వచ్చినా యువతకు నష్టం చేసే ప్రతి అంశాన్ని జాగ్రత్తతో ఆచితూచి ఆలోచించి ముందుగానే సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తారేమో. ఏదేమైనప్పటికీ భారతదేశ భవిష్యత్తుకు యువతరం పాత్ర అత్యంత కీలకమైనది. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత పారదర్శకమైన పాలన విధానాలు అనుసరించడమే కాకుండా ప్రతి అంశంలో జవాబుదారీతనాన్ని ప్రదర్శించడంతో పాటు అడపాదడపా తలెత్తుతున్న సమస్యలపై యువత చేస్తున్న నిరసనలపై స్పందించి ఆచితూచి సమయానుకూలంగాసరైన సమయంలో వివరణ ఇచ్చేందుకు తరచూ ప్రయత్నించి సఫలం కావడం ఒకఎత్తు. దేశభక్తి భారతదేశ జాతీయ సమైక్యత సమగ్రతకు భంగం కలగకుండా వ్యవహరిస్తున్న తీరు మరొక ఎత్తుకావడం దేశ భవిష్యత్తుకు శుభపరిణామమే. ●

# మీ గుండె 'లయ' తప్పుతోందా?



దేశంలో 80 లక్షల మందికి ఇదే సమస్య

ఛాతీలో దడ, ఆయాసాన్ని తేలిగ్గా తీసుకోకండి..

వృద్ధాప్యంలో అధికరక్తపోటు ఉంటే ప్రమాదమే

**న్యూఢిల్లీ,జూలై 27:** గుండె వేగంగా కొట్టుకోవడం, ఛాతీలో దడ, లేదా కారణం లేకుండా ఆయాసం రావడం వంటి లక్షణాలను చాలామంది తేలిగ్గా తీసుకుంటారు. కానీ, ఇవి ఏట్రియల్ ఫిబ్రిలేషన్ అనే ఏఎఫ్ అని పిలిచే తీవ్రమైన గుండె జబ్బుకు సంకేతాలు కావచ్చు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణమైన ఈ గుండె లయ రుగ్మత, నివారించదగిన పక్షవాతానికి ఒక ప్రధాన కారణంగా మారుతోంది. గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ అధ్యయనం ప్రకారం, భారతదేశంలో సుమారు 80 లక్షల మంది ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌తో జీవిస్తున్నారు. వృద్ధాప్యం, ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలు పెరగడంతో ఈ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డ్యూక్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ క్రిస్టోఫర్ గ్రాంగర్ ప్రకారం, గుండె పై గదుల్లో అస్తవ్యస్తమైన ఎలక్ట్రికల్ సంకేతాలు ఏర్పడినప్పుడు ఏట్రియల్ ఫిబ్రిలేషన్ సంభవిస్తుంది. దీనివల్ల గుండె పై గదులు ఒక క్రమపద్ధతిలో కాకుండా అస్తవ్యస్తంగా, వేగంగా కొట్టుకుంటాయని ఆయన వివరించారు. కొంతమందిలో గుండె దడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, త్వరగా అలసిపోవడం వంటి లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. అయితే చాలా మందిలో ఇది సైలెంట్ ఏఎఫ్‌గా ఉంటుంది. అంటే, ఎలాంటి లక్షణాలు బయటకు కనిపించవు. తీవ్రమైన సమస్యలు ఎదురయ్యే వరకు ఈ వ్యాధి ఉన్నట్లు కూడా తెలియదు. అసాధారణ గుండె లయను గుర్తించే స్మార్ట్‌వాచ్‌ల ద్వారా కూడా ఈ పరిస్థితిని ముందుగా పసిగట్టే అవకాశం ఉందని డాక్టర్ గ్రాంగర్ తెలిపారు. ఏట్రియల్ ఫిబ్రిలేషన్ వల్ల ఎదురయ్యే అతిపెద్ద ప్రమాదం పక్షవాతం. గుండె గదులు సరిగా సంకోచించనప్పుడు, రక్తం అక్కడే నిలిచిపోయి గడ్డకట్టే అవకాశం ఉంది. ఈ రక్తం గడ్డకట్టిన ముక్క మెదడుకు ప్రయాణించి రక్తనాళాలను అడ్డుకుంటే, ఇస్కీమిక్ స్ట్రోక్ (పక్షవాతం) వస్తుంది. ఏట్రియల్ ఫిబ్రిలేషన్ వల్ల పక్షవాతం వచ్చే ప్రమాదం ఐదు రెట్లు పెరుగుతుందని, ప్రతి ఐదు పక్షవాతం కేసుల్లో ఒకటి దీనితో సంబంధం కలిగి ఉంటుందని డాక్టర్ గ్రాంగర్ తెలిపారు. ఈ రకమైన స్ట్రోక్స్ చాలా తీవ్రంగా ఉండి, శాశ్వత అంగవైకల్యానికి దారితీస్తాయి. ఏఎఫ్ సంబంధిత పక్షవాతాన్ని నివారించడానికి యాంటీకాగ్యులెంట్లు అంటే రక్తాన్ని పలుచనచేసే మందులు అత్యంత ప్రభావవంతమైన మార్గం. ఈ మందులు వాడటం ద్వారా ఏఎఫ్ వల్ల వచ్చే పక్షవాతాలలో 70 శాతం వరకు నివారించవచ్చని డాక్టర్ గ్రాంగర్ పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో గుండె లయను నియంత్రించే మందులు లేదా కాథెటర్ అబ్లేషన్ అనే ప్రక్రియ ద్వారా కూడా చికిత్స అందిస్తారు. వయసు, జన్యుపరమైన కారణాలు ప్రమాదాన్ని పెంచినప్పటికీ, జీవనశైలి మార్పుల ద్వారా దీనిని నివారించవచ్చు లేదా ఆలస్యం చేయవచ్చు. రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవడం, ఆరోగ్యకరమైన బరువును పాటించడం, క్రమం తప్పని వ్యాయామం, ధూమపానానికి దూరంగా ఉండటం, ఆల్కహాల్ పరిమితం చేయడం వంటివి చాలా ముఖ్యం. పక్షవాతం వచ్చిన తర్వాత చికిత్సకు అయ్యే భారీ ఖర్చుతో పోలిస్తే, ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌ను ముందుగా గుర్తించి చికిత్స తీసుకోవడం ఎంతో మేలని నిపుణులు సూచిస్తున్నారు.

## ఇక 'జీహాద్' ఒక్కటే మార్గం

### ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ సంచలన ప్రకటన



**టెహ్రాన్, జూలై 27:** ఇజ్రాయెల్‌పై పోరాటం సాగిస్తున్న లెబనాన్‌లో హెజ్బొల్లా సాయుధ గ్రూప్‌నకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఇరాన్ సుప్రీంలీడర్ మొజ్తబా ఖమేనీ పునరుద్ఘాటించారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక దాడులు, కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోతేనే అమెరికాతో ఇరాన్ ఘర్షణ ముగుస్తుందని ఆయన స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్‌పై ఇప్పుడు జీహాద్, ప్రతిఘటన తప్ప మరో మార్గం లేదని మొజ్తబా తేల్చిచెప్పారు. హెజ్బొల్లా సెక్రటరీ జనరల్ షేక్ నయీమ్ ఖాసిమ్, గ్రూప్ యోధులను ఉద్దేశించి ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. హెజ్బొల్లా దృఢవైఖరిని ప్రశంసిస్తూ వారిని రక్షించుకోవడం ఇరాన్‌కు ఒక వ్యూహాత్మక బాధ్యత అని ఆయన నొక్కి చెప్పారు. అమెరికాతో ఇరాన్ యుద్ధం ముగియడానికి ఒప్పందం కుదరాలంటే, లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను ఎటువంటి షరతులు లేకుండా వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇరాన్‌కు తమ విధేయతను ప్రకటిస్తూ హెజ్బొల్లా రాసిన లేఖకు సమాధానంగా ఇరాన్ సుప్రీం లీడర్ నుంచి ఈ స్పందన వచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్‌లకు వ్యతిరేకంగా పోరాటానికి 'జీహాద్, ప్రతిఘటన తప్ప వేరే మార్గం లేదు' అని ఆయన పేర్కొ న్నారు. తాత్కాలిక శాంతి ఒప్పందాన్ని అమెరికా, ఇరాన్‌లు ఉల్లంఘించడంతో మరోసారి పశ్చిమాసియాలో పరిస్థితులు ఉద్రిక్తంగామారాయి. 'ప్రజల ప్రాణాలను తీసి, భవిష్యత్తు తరాలను నాశనం చేస్తున్న అమెరికా ప్రభుత్వం, జియోనిస్టులు(ఇజ్రాయెల్) అణచివేత, నిరంకుశత్వం, దుర్మార్గాలతో ప్రపంచ దేశాలు విసిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో 'జీహాద్', ప్రతిఘటన తప్ప మనకు వేరే మార్గం లేదు' అని మొజ్తబా ఖమేనీ ప్రకటించారు. ఇజ్రాయెల్ దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాడే గ్రూపులకు హెజ్బొల్లా ఒక కొండలా ముందుండి నడిపిస్తుందని, ఈ తిరుగులేని పోరాటం ప్రపంచంలోనే స్వేచ్ఛను కోరుకునే దేశాలకు స్ఫూర్తిదాయక సందేశంగా మారిందని ఆయన ప్రశంసించారు.

## పాట్నాలో ఎకె47 ఉపయోగించిన కానిస్టేబుల్ సస్పెన్షన్



**పాట్నా,జులై 27:** నీట్ పరీక్ష అక్రమాలపై బిహార్‌లో జరిగిన విద్యార్థుల నిరసనల సందర్భంగా ఏకే47తో కాల్పులు జరిపిన పోలీసు అధికారిని సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై రాజ్యసభ ఎంపీ మనోజ్ కుమార్ ఝా సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. జులై 25న నిర్వహించిన బిహార్ బంద్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. పలు చోట్ల పోలీసులు, నిరసనకారులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. లాఠీచార్జ్, టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లను పోలీసులు వినియోగించారు. సివాన్‌లో జరిగిన కాల్పుల్లో ముగ్గురు గాయపడగా వారిలో 15 ఏళ్ల మహ్మద్ ఆరిఫ్ మెడలో బుల్లెట్ తగిలింది. శస్త్రచికిత్స ద్వారా బుల్లెట్‌ను తొలగించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా స్పందిస్తూ ఢిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్స్, బిహార్‌లో ఏకే47 వినియోగించడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. మరోవైపు ఘటనపై శాఖాపరమైన విచారణ ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు. ఆయుధ వినియోగం నిబంధనలకు అనుగుణంగానే జరిగిందా లేదా అనే అంశాన్ని విచారణలో తేల్చనున్నట్లు తెలిపారు.



## పార్లమెంటులో ధర్మేంద్ర ప్రధాన్‌కు ఘనస్వాగతం

### జైరామ్ రమేష్ వ్యాఖ్యలకు ప్రధాన్ కౌంటర్

**న్యూఢిల్లీ,జులై 27:** నీట్ పేపర్ లీకేజీ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌కు సోమవారం పార్లమెంటులో ఘన స్వాగతం లభించింది. చిరునవ్వుతూ కారు దిగిన ధర్మేంద్ర ప్రధాన్, అందరికీ అభివాదం చేస్తూ లోపలికి వెళ్లారు. పలువురు అధికార పక్ష ఎంపీలు ఆయనకు సంఘీభావం తెలుపుతూ శాలువా కప్పి, సంప్రదాయ టోపీతో సత్కరించారు. ఎలాంటి ఆరోపణలు లేకపోయినా ఒక మంత్రి స్వచ్ఛందంగా రాజీనామా చేయడం ఇదే మొదటిసారని ఒక ఎంపీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పార్లమెంట్ కారిడార్‌లో కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్, ధర్మేంద్ర ప్రధాన్‌ను ఉద్దేశించి "అప్పుడప్పుడు ఇలా జరుగుతుంటుంది" అని వ్యాఖ్యానించారు. దీనికి ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, "ఏమీ జరగలేదు. నేను వీధి పోరాటాల నుంచి వచ్చిన యోధుడిని, ఏసీ గదుల్లో కూర్చునే కార్యకర్తను కాదు" అని కౌంటర్ ఇచ్చారు.

## ఆ 'సిట్'లో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను చేర్చండి

### యుపి సర్కార్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు

### రెండు వారాల్లో స్టేటస్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశం

**న్యూఢిల్లీ, జులై 27:**అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఆరోపణల సంబంధిత కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. కేసు దర్యాప్తు పారదర్శకంగా, సమగ్రంగా చేపట్టేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)లో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను తప్పనిసరిగా చేర్చాలని ఉత్తర్వులిచ్చింది. అలాగే దర్యాప్తు పురోగతిపై కూడా రెండు వారాల్లోగా స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని సిట్‌ను ఆదేశిస్తూ డెడ్‌లైన్ విధించింది న్యాయస్థానం. ఈ కేసు విచారణ కోసం ఐజీ కిరణ్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటుచేసినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కేసు విచారణ వేగంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది ఆలయానికి వచ్చిన విరాళాల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరారు. అయితే.. ప్రస్తుతం తాము దర్యాప్తును పూర్తి చేయడంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నామని న్యాయస్థానం పేర్కొంది. ఈ నేపథ్యంలో సదరు వివరాలను వెలువరించడంపై ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. సిట్ సమర్పించే నివేదికను పరిశీలించాకే తదుపరిచర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. తదుపరి విచారణ వాయిదా వేసింది.

## సిజెపి నేతలకు సొమ్ములెక్కడినుంచి వచ్చాయి?

### సుప్రీం న్యాయవాది మహేష్ జెత్మలానీ

**న్యూఢిల్లీ,జులై 27:** నిరవధిక ఆందోళన నిర్వహించిన సిజెపి నేతలకు సొమ్ములు ఎక్కడినుంచవ ఇచ్చాయో ఆరద్యప్తు చేయించాలని సీనియర్ న్యాయవాది స్పందించారు. సిజెపీ నేతల సంబరాలపార్టీలపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మహేశ్ జెత్మలానీ స్పందించారు. సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టి పలు విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకా వేడుకల తీరును న్యాయవాది మహేశ్ జెత్మలానీ విమర్శించారు. హోటల్‌లో పార్టీ చేసుకోవడానికి నిధులు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. నిజంగానా సీజేపీ నాయకత్వం హోటల్‌లో విజయోత్సవం జరుపుకుంటోందా, ఢిల్లీలో రోజుల తరబడి హింసాకాండ జరిగిన తర్వాత ఈ యువ కార్యకర్తలమని చెప్పుకునే వారు డ్యాన్సులు చేస్తున్నారు అని ఆయన మండిపడ్డారు. అలాగే ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఆందోళనల వెనుక ఉన్న ఆర్థిక వనరులపైనా జెత్మలానీ ప్రశ్నలు లేవనెత్తారు. ఢిల్లీ ఆందోళనల సమయంలో సీజేపీ నేతలు, కార్యకర్తల ప్రయాణం, ఆహారం,వసతి, లాజిస్టిక్స్ వంటి వాటికి నిధులు ఎక్కడ నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీని అట్టుడికించిన వారికి ఆర్థిక సహాయం ఎవరు చేశా రంటూ ప్రశ్నలు సంధించారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన కొద్దిసేపటికే ఈ పార్టీ జరిగినట్లు తెలుస్తోంది.

## నిరసనకారులపై ఎఫ్ఐఆర్‌లను ఇప్పటికీ ఎత్తివేయలేదు

### సిజెపి ప్రతినిధి సౌరవ్‌దాస్ నిరసన

**న్యూఢిల్లీ,జులై 27:** నీట్ పేపర్ లీకేజీ, పరీక్షల అక్రమాలపై తాము చేపట్టిన ఆందోళన విరమణ సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సోమవారం ఆరోపించింది. ఢిల్లీ వెలుపల నిరసనకారులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, వివిధ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయాలని డిమాండ్ చేసింది. సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, అసోం, పశ్చిమ బెంగాల్, బీహార్ వంటి రాష్ట్రాల్లో విద్యార్థులు,నిరసనకారులను లక్ష్యంగా చేసుకుని అరెస్టులు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. బీజేపీ లేదా ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో నిరసనకారులపై ఎలాంటి శిక్షార్హమైన చర్యలు తీసుకోబోమని కేంద్రం హామీ ఇచ్చిన నేపథ్యంలోనే మేము మా దేశవ్యాప్త ఆందోళనను విరమించుకున్నాం. ప్రస్తుతం వస్తున్న నివేదికలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకుని, అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేసేలాచూడాలని కోరారు. మంగళవారం లోగా లిఖితపూర్వక హామీ ఇస్తామన్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఒకవేళ హామీలను గౌరవించకపోతేతదుపరి కార్యాచరణ చేపట్టాల్సి వస్తుం దని హెచ్చరించారు.అయితే, ఢిల్లీలో నమోదైన సుమారు 15 ఎఫ్ఐఆర్‌ల ఉపసంహారణపై ఉన్నతాధికారుల నుంచి అధికారిక ఆదేశాలు వచ్చాకే తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## జెన్జీ సిజెపి ఉద్యమానికి పొరుగుదేశాల్లోను ప్రశంసలు



**న్యూఢిల్లీ,జులై 27:** భారత జెన్‌జీ తమ బలహీనతలనే బలంగా మార్చుకుంది. పరీక్షా పత్రాల లీకేజీపై వారు చేసిన వినూత్న ఉద్యమం, కేంద్ర ప్రభుత్వాన్ని కదిలించి ఏకంగా విద్యాశాఖ మంత్రి రాజీనామాకు దారితీసింది. ఈ ఉద్యమ ప్రభావం కేవలం దేశానికే పరిమితం కాలేదు. సరిహద్దులు దాటి పాకిస్థాన్, శ్రీలంక, నేపాల్ వంటి పొరుగు దేశాల యువతను సైతం ఆకర్షించి, వారి నుంచి ప్రశంసలు అందుకుంటోంది. కాక్రోచ్ జనతా పార్టీ సీజేపీ పేరుతో మొదలైన ఈ ఉద్యమంలో మీమ్స్ మేనిఫెస్టోలుగా, రీల్స్ నియామక సాధనాలుగా మారాయి. పోలీసుల చర్యలకు సంబంధించిన షార్ట్ వీడియోలు ఆధారాలుగా నిలిచాయి. ఈ వినూత్న పోరాట పటిమ ఇప్పుడు పొరుగు దేశాల్లో హాట్ టాపిక్‌గా మారింది. భారత జెన్‌జీ ఉద్యమంపై పాకిస్థాన్ నుంచి అనూహ్యమైన స్పందన వస్తోంది. అక్కడి యువత భారత యువతరం ధైర్యాన్ని, ఐక్యతను చూసి ముగ్ధులవుతున్నారు. మీరు ఇలాగే అద్భుతమైన పనులు చేస్తుంటే, మేం మిమ్మల్ని ఎలా ద్వేషించగలం బహుశా ప్రేమలో పడతామేమోనని ఒక పాకిస్థానీ యువతి చెప్పడం విశేషం. కులం, మతం వంటి విభేదాలను పక్కనపెట్టి భారత విద్యార్థులు ఏకతాటిపై నిలవడాన్ని వారు ప్రత్యేకంగా ప్రశంసిస్తున్నారు. ఈ ఉద్యమానికి పాకిస్థాన్ నిధులు ఇస్తోందని కొందరు అంటున్నారు. మా దేశాన్ని నడుపుకోవడానికే మా దగ్గర డబ్బు లేదు. ఇక మీకెలా ఇస్తామని బిలాల్ హాసన్ అనే కంటెంట్ క్రియేటర్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 2022లో ఆర్థిక సంక్షోభంపై పోరాడి ప్రభుత్వాన్ని గద్దె దింపిన శ్రీలంక యువతకు, భారత జెన్‌జీ ఉద్యమం తమ పోరాటాన్ని గుర్తు చేస్తోంది. అక్కడి కార్టూనిస్టులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు భారత యువతకు మద్దతుగా పోస్టులు పెడుతున్నారు. ముంబైలో పోలీసు వ్యాన్‌ను ఒక యువతి ఒంటరిగా అడ్డుకున్న ఫొటోను, చైనాలోని చారిత్రక ట్యాంక్ మ్యాన్ ఫొటోతో పోలుస్తూ ప్రశంసిస్తున్నారు. నేపాల్ యువత కూడా భారత విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకుం టోంది. విద్యార్థులు రోడ్లపైకి రావడం చూస్తుంటే గుండె తరుక్కు పోతోంది. మీ పోరాటం సరైనదే. మీ లక్ష్యం ఏమిటో ఎప్పుడూ మర్చిపోవద్దని నేపాల్‌కు చెందిన ఓ కంటెంట్ క్రియేటర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నాడు.

## విద్యార్థులపై అణిచివేత ఇంకా ఆగలేదు

### మోడీజీ క్షమాపణలు చెప్పాల్సిందే: రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,జులై 27:**దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణిని అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ మండిపడ్డారు. విద్యార్థులపై కాల్పులు, లాఠీఛార్జీలు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. బీహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే47తో కాల్పులు జరిపారని, వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారనే వార్తలు వస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులందరికీ ప్రధాని మోదీ బహి రంగంగా క్షమాపణ చెప్పాలన్నారు.

## పిఓకెలో జాక్ లాంగ్ మార్చ్..పరిస్థితులు ఉద్రిక్తం

**ముజఫరాబాద్,జులై 27:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. పాక్ అధికారులతో చర్చలు విఫలమవడంతో జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) రావల్‌కోట్ నుంచి ముజఫరాబాద్ వరకు లాంగ్ మార్చ్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శాంతియుత నిరసనకారులపై బలప్రయోగం చేయవద్దని యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ యూకేపీఎన్‌పీ పాకిస్థాన్ ప్రభుత్వాన్ని కోరింది. మీర్‌పూర్ డివిజన్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీలు రావల్‌కోట్‌లో కలుసుకున్నాయి. ఈ ర్యాలీని అడ్డుకునేందుకు పాక్‌ప్రభుత్వం రేంజర్స్, ఫ్రంటియర్ కానిస్టేబులరీ (ఎఫ్‌సీ),పంజాబ్ కానిస్టేబులరీ (పీసీ)దళాలను అదనంగా మోహరించినట్లు సమాచారం.

## అమిత్ షా వివరణ కోరుతూ పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన

**న్యూఢిల్లీ,జులై 27:** పార్లమెంట్‌లో సోమవారం మరోసారి అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర ప్రతిష్ఠంభన నెలకొన్నాయి. జూలై 20న ఢిల్లీలో జరిగిన ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా సభలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల కార్యకలాపాలను అడుకున్నాయి.ఈ మేరకు రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేపార్లమెంట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రతిపక్ష పార్టీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పటికే నిర్ణయించిన చర్చల్లో పాల్గొనకుండా, ఢిల్లీలో కాక్‌రోచ్ జనతా పార్టీ చేపట్టిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పోలీసులు అతిగా వ్యవహరించారనే ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి సభలో ప్రకటన చేయాలని పట్టుబట్టాయి.

సోమవారం ఉదయం 11 గంటలకు పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన వెంటనే ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో ఆందోళనకు దిగారు. దీంతో లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా సభా కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ప్రతిపక్ష సభ్యులను హెచ్చరించారు. తీవ్ర గందరగోళం నెలకొనడంతో లోక్‌సభ, రాజ్యసభలను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు.పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026ను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టాం. అన్ని రాజకీయ పార్టీలు చర్చలో పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించాలని కోరుతున్నామని రిజిజు చెప్పారు. పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలను కట్టడి చేసేందుకు కఠినమైన చట్టాన్ని రూపొందిస్తున్నామని, ఇలాంటి కీలక బిల్లుపై చర్చకు దూరంగా ఉండి సభలో గందరగోళం సృష్టించడం ప్రజలకు మంచి సందేశం కాదని ఆయన స్పష్టం చేశారు.



## మత మార్పిడితో ఎస్సీ హోదా రద్దు

### మరోమారు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

### రివ్యూ పిటిషన్ కొట్టేసిన ధర్మాసనం

**న్యూఢిల్లీ, జులై 27:** షెడ్యూల్డ్ కుల వర్గానికి చెందిన వ్యక్తి హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతం కాకుండా వేరే మతంలోకి మారినప్పుడు, మతమార్పిడి జరిగిన క్షణం నుంచే షెడ్యూల్డ్‌కుల హోదాను కోల్పోతారని పేర్కొన్న సుప్రీంకోర్టు తీర్పును సమీక్షి ంచాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రికార్డులో ఎటువంటి లోపం కనిపించడం లేదని పేర్కొంటూ, జస్టిస్‌లు ప్రశాంత్ కుమార్ మిశ్రా, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం మార్చి 24 నాటి తీర్పుకు వ్యతిరేకంగా దాఖలైన పిటి షన్‌ను కొట్టివేసింది."సమీక్షా పిటిషన్‌పై మౌఖిక విచారణ కోరుతూ దాఖలు చేసిన దరఖాస్తును తిరస్కరించడమైనది. తాము సమీక్షా పిటిషన్‌ను పరిశీలించి, సమీక్షించాలని కోరిన మార్చి 24, 2026 నాటితీర్పును కూడా పరిశీలించాము. రికార్డులో ఎటువంటి లోపం స్పష్టంగా కనిపించడం లేదు. అందువల్ల, సమీక్షా పిటిషన్‌ను కొట్టివేస్తున్నామ్మ అని సమీక్షా పిటిషన్‌పై జులై 15న జారీ చేసిన తన ఉత్తర్వులో సుప్రీంకోర్టు పేర్కొంది. మార్చి 24న, ఒక కీలకమైన తీర్పులో, షెడ్యూల్డ్ కుల వర్గానికి చెందిన వ్యక్తి హిందూ, సిక్కు లేదా బౌద్ధమతం కాకుండా వేరే మతంలోకి మారినప్పుడు, పుట్టుకతో సంబంధం లేకుండా మతం మారిన క్షణం నుంచే షెడ్యూల్డ్ కుల హోదాను కోల్పోతారని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. షెడ్యూల్డ్ కుల వర్గానికి చెందిన వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన వెంటనే తన షెడ్యూల్డ్ కుల హోదాను "తక్షణమే మరియు పూర్తిగ్గా కోల్పోతారని పేర్కొన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వును ఇదిసమర్థించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 342లోని క్లాజ్ (1) ప్రకారం, భారత రాష్ట్రపతి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంతాల (యూటీలు)కోసం 'షెడ్యూల్డ్ తెగల్లు'గా గుర్తించబడిన తెగలు, గిరిజన వర్గాలను గుర్తిస్తూ 1950నాటిరాజ్యాంగ (షెడ్యూల్డ్‌తెగలు) ఉత్తర్వును జారీ చేశారని సుప్రీంకోర్టు పేర్కొంది.

## నిరసనకారులపై బలప్రయోగాన్ని సమర్థించలేం: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జులై 27:** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో పోలీసులు బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. శాంతియుతంగా, చట్టబద్ధంగా జరిగే నిరసనల్లో పాల్గొనడం ప్రతి పౌరుడికీ రాజ్యాంగం కల్పించిన హక్కు అని స్పష్టంచేసింది. కేవలం ఆందోళన జరుగుతోందనే కారణంతో లాఠీచార్జ్‌కు దిగడం సరికాదని పేర్కొంది. పోలీసులు హద్దులు మీరి వ్యవహరించి ఉంటే స్వతంత్రంగా దర్యాప్తు జరగాలని సూచించింది. విద్యార్థులు, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన 'సంసద్ చల్లో' నిరసన సందర్భంగా జరిగిన పోలీసు చర్యలపై దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం విచారించింది. దేశవ్యాప్తంగా నిరసనల సమయంలో పోలీసులు అనుసరించాల్సి న విధానంలో ఏకరూపత అవసరమని అభిప్రాయపడింది. నిరసన జరిగిందనే కారణంతో బలప్రయోగం చేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా గాయపడిన పోలీసుల కుటుంబాల తరఫున వాదించేందుకు వచ్చిన న్యాయవాదికి కూడా కోర్టు అనుమతి ఇచ్చింది. విద్యార్థులకైనా, పోలీసులకైనా గాయాలు కావడం సమానంగా ఆందోళనకరమేనని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ వ్యాఖ్యానించారు. నిరసనలను ఎదుర్కొనే పోలీసులకు హెల్మెట్లు వంటి రక్షణ పరికరాలు ఎందుకు అందించలేదని రాష్ట్రాలను ప్రశ్నించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని పిటిషన్లను మంగళవారం కలిపి విచారించనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది.

## 'ఇ20 పెట్రోల్ష్‌'తో లబ్ధి ఆరోపణలు, బాంబే హైకోర్టును ఆశ్రయించిన గడ్కరీ

**ముంబై, జులై 27:** తన పేరును 'ఇ20 పెట్రోల్ష్ కార్యక్రమంతో ముడిపెడుతూ సోషల్ మీడియాలో ప్రచారమైన పోస్టులు, డీప్‌ఫేక్ వీడియోలపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ న్యాయపోరాటానికి దిగారు. తనతోపాటు కుటుంబసభ్యులు ఇ20 విధానం వల్ల లబ్ధిపొందినట్లు తప్పుడు ప్రచారం చేశారని ఆరోపిస్తూ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై మెటాతోపాటు ఇతర సోషల్ మీడియా వేదికలు, గుర్తుతెలియని వ్యక్తులపై సివిల్ దావా వేయడానికి హైకోర్టు అనుమతిచ్చింది. ఇ20 ఇథనాల్ కార్యక్రమంవల్ల తన కుటుంబం లాభపడిందంటూ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం జరిగిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. వాస్తవానికి ఇథనాల్ మిశ్రమ ఇంధన విధానాన్ని కేంద్ర పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ అమలు చేస్తోందని వివరించారు. ఈ పోస్టులు డీప్‌ఫేక్ కంటెంట్ ముంబైలో కూడా అందుబాటులో ఉండటంతో బాంబే హైకోర్టుకు ఈ కేసును విచారించే అధికారం ఉందని గడ్కరీ తరఫు న్యాయవాది వాదించారు. ఈ వాదనలు విన్న జస్టిస్ అభయ్ అహూజా.. సివిల్ సూట్ దాఖలు చేసేందుకు అనుమతి మంజూరు చేశారు.

# సంక్షిప్త వార్తలు

## ఉక్రెయిన్‌ను వదలం..తగిన బుద్ధి చెబుతాం: ఇరాన్



**టెహ్రాన్, జులై 27:** కాస్పియన్ సముద్రంలో తమ వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ జరిపిన దాడిలో ఒక నావికుడు మరణించగా, మరొకరు గాయపడినట్లు ఇరాన్ తెలిపింది. ఈ ఘటనపై టెహ్రాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. తమ దేశ ప్రయోజనాలు, ఆస్తులను కాపాడుకునేందుకు ఎలాంటి చర్యకైనా వెనకాడబోమని స్పష్టంచేసింది. ఈ దాడికి కారణమైన ఉక్రెయిన్ తగిన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. యుద్ధం మరింత విస్తరించకుండా ఉండాలంటే కీవ్‌ను కట్టడి చేయాలని ఐరోపా దేశాలను ఇరాన్ డిమాండ్ చేసింది.

## చెరువులో పడి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

**జైపూర్, జులై 27:** రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అక్కడి ఓ చెరువులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతదేహాలు లభ్యమవడం తీవ్ర కలకలం రేపుతోంది. అయితే వారంతా ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రామ్‌దేవ్రా పోలీసు స్టేషన్ పరిధిలోని లోహార్కి గ్రామంలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. నీటిలోకి దూకిన నలుగురిలో జస్రాజ్ అనే వ్యక్తి కేకలు వేయడం గమనించి కుటుంబసభ్యులు, స్థానికులు వెంటనే అక్కడకు పరుగెత్తుకెళ్లారు. కానీ చెరువు దగ్గరికి చేరుకునే సరికే వారంతా నీటిలో మునిగిపోయారు.



## అమెరికాలో కాల్పులు, ముగ్గురి మృతి

**వాషింగ్టన్, జులై 27:** అమెరికాలోని సియాటెల్‌లో తుపాకీ సంస్కృతి పడగవిప్పింది. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన స్పేస్ నీడిల్ సమీపంలో జరుగుతున్న వార్షిక ఫుడ్ ఫెస్టివల్ దగ్గర దుం దగులు సామూ హిక కాల్పులకు తెగబడటంతో ముగ్గురు ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా పోలీసులు ఒక దుండగుడిని అరెస్టు చేశారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఈ సామూ హిక కాల్పుల ఘటన జరిగింది. వందలాదిగా ఉన్న ఫుడ్‌స్టాళ్లు, లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌తో కళకళ లాడుతున్న సియాటెల్‌లో అకస్మాత్తుగా తుపాకీ మోతలు వినిపించాయి.

## తాహిర్ హుస్సేన్‌కు శిక్షపై తీర్పును రిజర్వ్ చేసిన కోర్టు



**న్యూఢిల్లీ, జులై 27:** 2020 ఈశాన్య ఢిల్లీ అల్లర్ల సమయంలో ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) అధికారి అంకిత్ శర్మ హత్య కేసులో దోషులుగా తేలిన మాజీ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్, మరో నలుగురికి విధించాల్సిన శిక్షా పరిమాణంపై ఢిల్లీ కోర్టు సోమవారం తన తీర్పును రిజర్వ్ చేసింది. శిక్షకు సంబంధించిన అంశంపై ప్రాసిక్యూషన్, డిఫెన్స్ తరఫు వాదనలు వివరంగా విన్న తర్వాత జులై 31న తీర్పును వెల్లడిస్తామని కర్కర్‌డూమా కోర్టు అదనపు సెషన్స్ జడ్జి(ఎఎస్‌జె) ప్రవీణ్ సింగ్ తెలిపారు. శర్మ హత్యను 'పక్కాని', 'క్రూరమైన' హత్యగా అభివర్ణిస్తూ, గరిష్ట శిక్షను కోరుతూ ఢిల్లీ పోలీసులు మరణశిక్ష విధించాలని కోర్టును అభ్యర్థించారు.

## రూ.25వేల వరకూ భారత్ కరెన్సీకి నేపాల్‌లో అనుమతి



**ఖాట్మండు,జులై 27:** భారత కరెన్సీ వినియోగంపై నేపాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు పదేళ్లుగా కొనసాగుతున్న ఆంక్షలను సడలిస్తూ, రూ.200, రూ. 500 విలువైన భారత కరెన్సీ నోట్లను దేశంలోకి తీసుకురావడానికి, తీసుకెళ్లడానికి అనుమతించింది. భారతీయులు, నేపాలీ పౌరులు ఇరుదేశాల మధ్య ప్రయాణించేటప్పుడు రూ.25వేల పరిమితికి లోబడి ఈ నోట్ల ను తమ వెంట ఉంచుకోవచ్చని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో 2016లో భారత్ చేపట్టిన నోట్ల రద్దు అనంతరం విధించిన నిబంధనలకు తెరపడినట్లయింది.

## బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి ఒక టెరాబైట్ డేటా చోరీ

**ముంబయి,జులై 27:** దేశంలోని ప్రముఖ ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడాలో భారీ సైబర్ దాడి జరిగినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. బ్యాంక్ వ్యవస్థలోకి చొరబడ్డామని ప్రకటించిన ఓ హ్యాకర్ దాదాపు ఒక టెరాబైట్ కీలక డేటాను డార్క్‌వెబ్‌లో ఉచితంగా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నాడు. ఇందులో ఖాతాదారుల ఆధార్ నంబర్లు, పేర్లు, రుణాల వివరాలు, సేవింగ్స్, కరెంట్ ఖాతాల సమాచారం, నెట్‌బ్యాంకింగ్, ఎన్ఆర్ఐ, కార్పొరేట్ బ్యాంకింగ్‌కు సంబంధించిన రికార్డులు ఉన్నాయని చెబుతున్నాడు. ఈ డేటా లీక్‌కు సంబంధించిన కొన్ని నమూనా పత్రాలను కూడా హ్యాకర్లు ఆన్‌లైన్‌లో విడుదల చేశారు.



## గురుపౌర్ణమిన 155మందితో సమగ్రయోగా

**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** పతంజలి సేవా కార్యకర్తల ఆధ్వర్యంలో 'డయాబెటిస్ రహిత తిరుపతి మిషన్' ప్రారంభిస్తున్నట్లు పతంజలి యోగపీఠ్, హరిద్వార్ కేంద్ర సమన్వయకర్త స్వామి రితేదేవ్ జీ ప్రకటించారు. సమగ్ర యోగా విధానాల ద్వారా తిరుపతిని మధుమేహ రహిత నగరంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ప్రీడయాబెటిస్, డయాబెటిస్‌తో బాధపడుతున్న వారు ప్రత్యేక యోగా శిబిరంలో నమోదు చేసుకుని వ్యాధి నియంత్రణ, నివారణకు యోగాను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ జిల్లా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యోదయ పాఠశాల ప్రాంగణంలో ఘనంగా గురుపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎస్ఎస్ కుటుంబ ప్రబోధన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ రాజు మాట్లాడుతూ భారతదేశం తన కుటుంబ విలువలు, సామాజిక వ్యవస్థను పరిరక్షించి బలోపేతం చేయడం ద్వారా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. పతంజలి యోగపీఠ్, హరిద్వార్ కేంద్ర సమన్వయకర్త స్వామి రితేదేవ్ జీ మాట్లాడుతూ యోగా ప్రచారంలో తిరుపతి జిల్లా విశేష పురోగతి సాధిస్తోందని ప్రశంసించారు. జిల్లాలో 155 మంది యోగా ఉపాధ్యాయులు విజయవంతంగా శిక్షణ అందించి, వారికి కార్యక్రమంలో ధ్రువ పత్రాలు ప్రదానం చేసినందుకు అభినందనలు తెలిపారు. పతంజలి యోగా రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్ రాజ్ పురోహిత్, జిల్లా అధ్యక్షుడు హరి, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధిక, ఉపాధ్యక్షురాలు ఉమ, భారత్ స్వాభిమాన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండ్ల సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారమే ధ్యేయం

- 'డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి'లో శివశంకర్ లోతేటి



**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** వినియోగదారుల విద్యుత్ సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నామని, ఆ దిశగా చొరవ తీసుకుంటున్నట్లు ఎస్పిడిసిఎల్ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. పలువురు వినియోగదారులు మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో జాప్యం, ఓల్టేజ్ సమస్యలు, విద్యుత్ స్తంభాల మార్పిడి తదితర సమస్యలను సిఎండి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా మాల్యవంతం గ్రామానికి చెందిన కైలాజ మాట్లాడుతూ తమ పొలంలో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఐదు రోజుల్లోనే తమ సమస్యకు పరిష్కారం లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ధన్యవాదాలు తెలియజేశారు. ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సిఎండి కార్యక్రమం జరిగింది. సిఎండి శివ శంకర్ లోతేటి మాట్లాడుతూ వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేవిధంగా సంబంధిత సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అదేవిధంగా విద్యుత్ బిల్లుల ఆన్లైన్ చెల్లింపుల పట్ల వినియోగదారులకు సంస్థ అధికారులు, సిబ్బంది స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు 1912,1800 425 155333కు కాల్ చేయడంగాని వాట్సాప్ నంబరు 91333 31912కు వాట్ చేయడం, ఎస్పిడిసిఎల్ వాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు. డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, జె.రమణా దేవి, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, ఎన్.శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, భాస్కర్ రెడ్డి, జగదీష్, లత, పిఆర్ఓ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

### రూఫ్ టాప్ సోలార్ పనులు



## ఆగస్టు నెలాఖరులోగా లక్ష్యాన్ని చేరుకోవాలి

- ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్పిడిసిఎల్ పరిధిలో రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. కార్పొరేట్ కార్యాలయం నుండి సోమవారం సంస్థ పరిధిలోని తొమ్మిది జిల్లాల అధికారులు, కాంట్రాక్టర్లతో సిఎండి శివశంకర్ లోతేటి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్య సాయి జిల్లాల్లోని 2.07 లక్షల ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారుల గృహాలపై సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆయా జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఇతర అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ పనుల పురోగతిని ఆయా జిల్లా నోడల్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తూ, పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది, అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో ఈ యేడాది ఆగస్టు నెలాఖరులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తిచేయని కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సంస్థ పరిధిలోని వివిధ జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు ప్రాధాన్యతనివ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్ కె.ఆదిశేషయ్య, జె.రమణాదేవి, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, ఎన్ శోభ వాలెంటీనా, సిహెచ్ రామచంద్రరావు, కె. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, జగదీష్, భాస్కర్‌రెడ్డి, లత, 9 జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు శేషాద్రి శేఖర్, మోజెస్, ప్రదీప్ కుమార్, సుధాకర్, శ్రీనివాసులు, రాఘవేంద్రం, చంద్రశేఖరరావు, సోమశేఖర్‌రెడ్డి, అమర్‌బాబు, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# సంక్షేమం అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం

**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ళలో సంక్షేమ పథకాలు అమలుతో బాటు రాష్ట్ర అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా కృషి చేశామని తిరుపతి టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి జెబి శ్రీనివాస్ తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలపై ఇంటింటికి టిడిపి కార్యక్రమం తిరుపతి నగరంలోని 50వ డివిజన్ తిమ్మినాయుడు పాలెంలో సోమవారం ఉదయం ప్రారంభమైంది. పార్లమెంటర్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్‌తో కలిసి జెబి శ్రీనివాస్ ప్రజలతో మమేకమయ్యారు.



ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్న పథకాల గురించి వివరించడంతో బాటు వారికి అందిన పథకాలపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ బిజీ కృష్ణ యాదవ్, యూనిట్ ఇన్‌చార్జ్ ఖాయం వెంకటరత్నం, డివిజన్ అధ్యక్షుడు దండు విజయ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, తాతయ్యగుంట ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జులు పులిగోరు మురళీకృష్ణ, ఆర్సీ మునికృష్ణ, వూకా విజయ్ కుమార్, దంపూరి భాస్కర్ యాదవ్, మునిశేఖర్ రాయల్, టిడిపి నాయకులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## బొండా ఉమా వివాదం... త్రిసభ్య కమిటీ ఏర్పాటు

### నేడు వివరణ తీసుకోనున్న పల్లా, నిమ్మల

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమమహేశ్వరరావు(ఉమా) నుంచి మంత్రి రామానాయుడు, పల్లా శ్రీనివాస్ వివరణ తీసుకోనున్నారు. మాజీ మంత్రి ముద్రగడ్డ పద్మనాభం సంస్మరణ సభలో బొండా ఉమా, వైఎస్సార్సీపీ నేత అంబటి రాంబాబు తదితరులతో కలిసి వేదిక పంచుకున్నారు. 2019లో టిడిపి ఓటమిపై సంచలన వ్యాఖ్యలు చేసారు. ఈ అంశం వివాదాస్పదంగా మారింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే బోండా ఉమ, అంబటి రాంబాబు వ్యవహారంపై త్రిసభ్య కమిటీని టటిడిపి ఎపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఏర్పాటు చేసారు. పల్లాతో కలిపి మంత్రి నిమ్మల, కిలారు రాజేష్‌లతో త్రిసభ్య కమిటీ మంగళవారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయానికి రావాలని బోండా ఉమకు పిలుపు పంపింది. చంద్రబాబు ఆదేశాలతో బొండా ఉమా నుంచి నుంచి మంత్రి రామానాయుడు, పల్లా శ్రీనివాస్ వివరణ తీసుకోనున్నారు. వైఎస్సార్సీపీ నేతలతో వేదిక పంచుకోవడంపై నేతలకు బొండా ఉమా వివరణ ఇవ్వనున్నారు. ఉమా నుంచి వివరణ తీసుకొని నివేదికను చంద్రబాబుకు సమర్పించనున్నారు. గతంలో వైఎస్సార్సీపీ నేతలతో టిడిపి నేతలు వేదిక పంచుకోవటాన్ని అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. ఘటనలు పునరావృతం కాకూడదని గతంలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## ఇఎస్ఐ ఆస్పత్రి అప్‌గ్రేడేషన్ చేయండి

- కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయకు ఎంపిలు కేశినేని చిన్ని, మాగుంట లేఖ

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ ఇఎస్ఐ ఆస్పత్రి అప్‌గ్రేడేషన్ చేయాలని లోక్‌సభ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖమంత్రి మన్సుఖ్ మాండవీయకు లేఖ రాశారు. ఇఎస్ఐసి మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేయాలని కేశినేని చిన్ని కేంద్రానికి తన లేఖలో విజ్ఞప్తి చేసారు. గుణదలలో ఇఎస్ఐ ఆస్పత్రిని 300 పడకల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలని ఎంపి విజ్ఞప్తి చేశారు. విజయవాడ ఇఎస్ఐ ప్రాంగణంలోనే నూతనంగా ఇఎస్ఐసి మెడికల్ కాలేజీ మంజూరుకు అవకాశాలు ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత ఆసుపత్రి ఆవరణలోనే 25 ఎకరాల భూమి అందుబాటులో ఉందని, అదనపు భూమి అవసరం లేకుండానే నిర్మించవచ్చని ఎంపి కేశినేని చిన్ని స్పష్టం చేశారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు సహా 8 జిల్లాల్లోని 2.88 లక్షల మంది కార్మికులు, 10 లక్షల మంది వారి కుటుంబ సభ్యులకు ఆధునిక వైద్యం అందుబాటులోకి వస్తుందని ఎంపి కేశినేని చిన్ని లేఖలో పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రిని కలిసి విజయవాడ ఎంపి కేశినేని చిన్ని, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి లేఖను అందజేశారు.

## తిరుమల సమాచారం



### విశ్వప్రియతీర్థస్వామికి టిటిడి పెద్దమర్యాద

**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆషాడమాసంలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసిన ఉడిపి అడ్మార్ మఠం పీఠాధిపతి విశ్వప్రియతీర్థస్వామికి టిటిడి పెద్దమర్యాద చేసింది. సోమవారం శిష్యులతో కలసి తిరుమల ఆలయం వద్దకు విచ్చేసిన స్వామికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు సాంప్రదాయంగా స్వాగతం పలికారు. తొలుత ధ్వజ స్తంభానికి నమస్కరించిన స్వామి ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు బహుకరించారు. కలియుగంలో ప్రజలు భక్తిభావంతో మోక్షం పొందాలని అనుగ్రహించారు.

### ఆగస్ట్‌లో రెండు సార్లు గరుడసేవ

**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల్లో రానున్న ఆగస్ట్ నెలలో రెండు సార్లు గరుడసేవ నిర్వహించనున్నారు. సాధారణంగా నెలలో పౌర్ణమిన గరుడసేవ జరుగుతుంది. ఆగస్ట్‌లో 17వ తేదీ సోమవారం గరుడపంచమి పర్వదినాన ఆరోజు రాత్రి మలయప్పస్వామి గరుడుని అధిరోహించి ఆలయ మాఢవీధుల్లో ఊరేగుతారు. అలాగే 28న శ్రావణ పౌర్ణమి సందర్భంగా పౌర్ణమి గరుడ సేవ అత్యంత వైభవంగా జరగనుంది. సర్వాంగ సుందరంగా ముస్తాబైన మలయప్పస్వామి గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించనున్నారు. ఈ అపూర్వ ఆధ్యాత్మిక ఘట్టాన్ని కనులారా తిలకించడానికి లక్షలమంది భక్తులకు టిటిడి పిలుపునిచ్చింది. ఆగస్ట్ 28న జరిగే గరుడసేవ బ్రహ్మోత్సవాల గరుడసేవకు ట్రయల్‌రన్‌గా నిర్వహించనున్నారు.



### కపిలేశ్వరస్వామికి గ్రంధి పవిత్ర సమర్పణ

**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాల్లో సోమవారం గ్రంధి పవిత్ర సమర్పణ కార్యక్రమం జరిగింది. వేదమంత్రోచ్చారణలు, మంగళ వాద్యాల నడుమ అత్యంత శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో కపిలేశ్వరస్వామిని మేల్కొలిపి, పవిత్ర అభిషేకం నిర్వహించారు. ఆలయ ఆగమ సంప్రదాయాల ప్రకారం నిత్యహోమం, గ్రంధి పవిత్ర సమర్పణ, మూలమూర్తులకు విశేష ఉపచారాలు ఘనంగా చేపట్టారు. పవిత్రోత్సవాల ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పరమేశ్వరుని కృపాకటాక్షాలను పొందారు. సాయంత్రం యాగశాలలో ప్రత్యేక పూజలు, హోమం, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# కొండంత వివాదంలో అరకు కాఫీ రుచులు!

### తిరుమలలో జిసిసి రీటైల్ ఔట్‌లెట్‌కు టిటిడి సుముఖత




**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** నిత్యం లక్ష మంది వరకు భక్తులు వస్తున్న తిరుమలలో ఇప్పటికే దుకాణాల ఏర్పాటు కొండంత వివాదం రగులు తుండగా సందట్లో సడేమియా అన్నట్లు టిటిడి బోర్డు పెద్దలు, అధికారులు అరకు కాఫీ రిటైల్ ఔట్‌లెట్ ఏర్పాటుకు సుముఖత చూపడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే తిరుమలలో సిఆర్ఒ ప్రాంతం సమీపంలో, భక్తుల రద్దీ ఉండే ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రెండు మూడు ప్రైవేట్ డెయిరీలతో బాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పాల ఉత్పత్తుల విక్రయాల ఔట్‌లెట్‌లు నడుస్తున్నాయి.

తాజాగా తిరుమలలో భక్తుల కోసం జిసిసి ఔట్‌లెట్ ఏర్పాటుకు స్థలం ఎంపిక, అనుమతులివ్వడం వెనుక పెద్ద చర్చ మొదలైంది. తిరుమలలో ఏ వ్యాపారం అయినా భక్తుల సందడిపైనే ఆధారపడి నడుస్తుంది. అలాంటిది ఇప్పటికే స్థానికంగా వందల సంఖ్యలో టీ కేటిల్ నడుపుతున్న స్థానికులు ఉన్నారు. కొందరు అద్దెలు కూడా చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సమయంలో తిరుమలో జిసిసి ఉత్పత్తుల ఔట్‌లెట్ నిర్వహించుకునే అవకాశం దక్కిందనేది కూడా గుప్పుమంటోంది. టిటిడి మాత్రం ఇదీ ప్రభుత్వ నిర్ణయమని, ప్రభుత్వం ఆదేశాలతోనే మన రాష్ట్రంలో గిరిజనులు పండించే స్వచ్ఛమైన అటవీ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించామని చెబుతున్నారు. అదేగాక దేవదేవుడు తిరుమలేశుని అవసరాల కోసం గిరిజన సహకార సంస్థ (జిసిసి) నుండి వాటిని కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకుంది. దాదాపు రూ.12.97కోట్లతో నాణ్యమైన సరకులు తీసుకునేందుకు అధికారికంగా ఆమోదముద్ర వేశారు. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఈ స్వచ్ఛమైన గిరిజన ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని ఆలోచనతో నిర్ణయం తీసుకోవడం జరిగింది. తిరుమలలో సిఆర్ఒ ప్రాంతంలో జిసిసి రిటైల్ ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఏడాది పాటు నామినేషన్ పద్ధతిలో జిసిసి నుండి సరకులను కొనుగోలు చేసి, మార్కెట్లో దొరికే ఇతర బ్రాండ్లతో పోలిస్తే జిసిసి అందించే ఇన్‌స్టంట్ కాఫీ పొడి ధర కాస్త ఎక్కువ. అయినా టిటిడి బోర్డు దీనికే మొగ్గుచూపింది. జిసిసి సరఫరా చేసే సరుకుల నమూనాలను కూడా తిరుమలలోని డబ్ల్యుఎఫ్ పరిశోధనశాలలో పరీక్షించారు. టిటిడి నిబంధనల మేరకు నాణ్యత ఉన్నట్లు క్వాలిటీ మేనేజర్ ధ్రువీకరించడంతో ఇతర బ్రాండ్ల కంటే జిసిసి ఇన్‌స్టంట్ కాఫీ పొడి ధర కొంత అధికమైనా అందులో కల్తీ లేకపోవడం, జిఐ ట్యాగ్ గుర్తింపుతో అరాబికా కాఫీ కావడంతో టిటిడి బోర్డు పెద్దలు అంగీకారం తెలిపారు. టిటిడి పెద్దల తాజా నిర్ణయంతో తిరుమలకు వచ్చే భక్తులకు జిసిసి ఉత్పత్తులను అందుబాటులో ఉంచేందుకు విక్రయాలకు స్థలాన్ని కేటాయించింది. పిఎసి 2 వద్ద (రెండో న్యూ సత్రం దగ్గర గతంలో దొడ్ల డెయిరీ ఉన్న స్థలంలో) 144 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇనుపషీట్ రూఫింగ్‌తో ఈ ప్రత్యేక దుకాణం అందుబాటులోకి రానుంది. ఇక్కడ గిరిజనులు సేకరించిన స్వచ్ఛమైన తేనె, పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలు తదితర ఉత్పత్తులను భక్తులకు విక్రయిస్తారు.

కేటాయింపు విషయంలో టిటిడి కొన్ని కఠిన నిబంధనలు విధించినట్లు తెలుస్తోంది. తేనె, కుంకుడు కాయల పొడి, ఎండుమిర్చి తదితర వస్తువులను నామినేషన్ పద్ధతిలో తీసుకోవాలని కమిటీ సూచించింది. కుంకుమ పొడి, కారం, పసుపు వంటి వాటిని తగ్గింపు ధరలపైన అందుబాటులోకి తేవాలని చర్చలు జరుగుతున్నాయి.



## అనధికార స్టిక్కర్లపై కొరఢా

**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** యాత్రాస్థలం, విద్యాకేంద్రం తిరుపతి నగరంలో పలు రకాలుగా వాహనాలపై స్టిక్కర్లు వేసుకుని పోలీస్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై తిరుపతి జిల్లా పోలీసులు కొరఢా ఝుళిపించారు. అంబులెన్స్‌లు కూడా రోగులు లేకున్నా రద్దీ ప్రాంతాల్లో, కూడళ్లలో సైరన్‌లు వేసుకుని వాహనాలతో దూసుకెళుతున్న వారిపై కూడా తనిఖీలు చేశారు. ట్రాఫిక్ డిఎస్పీ కొండయ్యానాయుడు ఆధ్వర్యంలో సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది తిరుపతిలోని అనేక ప్రధాన కూడళ్లలో వాహనాలకు ప్రెస్, పోలీస్, జ్యూడీషియల్, ప్రభుత్వ వాహనాలు, ఆన్‌డ్యూటీ గవర్నమెంట్, ఎస్‌పిడిసిఎల్, ఎడ్యుకేషన్, మెడికల్ వంటి తదితర విభాగాలు ఇలా రకరకాల పేరుతో స్టిక్కర్లు వేసుకుని ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి మందుసేవించి తిరుగుతున్నారు. దీనివల్ల నిజమైన ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నట్లు పోలీసులకు అందిన సమాచారం. ఈ సమాచారంతో సోమవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు తిరుపతి ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వాహనాలపై ఉన్న అనధికారిక స్టిక్కర్స్ తీసివేశారు. కౌన్సెలింగ్ ఇచ్చారు.



శ్రీకాళహస్తి పురవీధుల్లో దర్శనం ఇస్తున్న ద్రౌపదీదేవి అమ్మవారు

### ద్రౌపదమ్మ వసంతోత్సవం

**శ్రీకాళహస్తి, జులై 28 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలో ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వసంతోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ద్రౌపదమ్మ ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో వైభవంగా ఊరేగింపు జరిపారు. వధువుగా పట్టణ ప్రజలు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి లక్ష్మయ్య, ఉత్సవాల ఇన్‌చార్జిలు సుబ్రమణ్యం, దుర్గాప్రసాద్, ఆలయ చైర్మన్ ఎంఎస్‌రెడ్డి దఫేదార్ పాల్గొన్నారు.

## మృత్యుంజయునికి విశేషాభిషేకాలు

**శ్రీకాళహస్తి, జులై 28 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాల్లో ఆలయ ఇఒ బికె వెంకటేశులు, భక్తులు విశేషంగా హాజరయ్యారు. తరువాత స్వామి వారికి ప్రత్యేకాలంకారం జరిపారు. వర్షాభావ కారణంగా ఆగస్టు 1న మృత్యుంజస్వామి ఆలయం వద్ద శత సహస్రఘట్టాభిషేకం నిర్వహించుటకు సన్నాహాలు చేపట్టినట్లు ఇఒ వెంకటేశులు తెలిపారు.



# కృత్రిమమేధ సాంకేతికత పరిశోధనపై డిసెంబర్ 4, 5తేదీల్లో అంతర్జాతీయ సదస్సు



**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో డిసెంబర్‌లో 4, 5 తేదీల్లో రెండురోజులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ సంబంధించిన పోస్టర్‌ను సోమవారం వర్సిటీ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ ఆవిష్కరించారు. "కృత్రిమ మేధస్సులో డేటా, హార్డ్‌వేర్ ఫిన్‌టెక్ సమగ్రతతో నూతన సాంకేతిక సరిహద్దుల అభివృద్ధి" అనే అంశంతో ఈ అంతర్జాతీయ సదస్సు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డిఎస్టీ క్యూరీఏఐ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సదస్సు డిసెంబర్ 4, 5 తేదీలలో హైబ్రిడ్ విధానంలో జరగనుంది. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష, ఐసిఎఐఆర్ 2026 కన్వీనర్ ఆచార్య పి. వెంకట కృష్ణ పాల్గొన్నారు. ప్రత్యక్ష వర్చువల్ విధానాల్లో పరిశోధనా పత్రాల ప్రదర్శనకు అవకాశం కల్పించనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, హార్డ్‌వేర్, ఇంటెలిజెంట్ సిస్టమ్స్, ఫిన్‌టెక్ అభివృద్ధి చెందుతున్న అంతరశాఖ పరిశోధనా రంగాల్లో తాజా పరిశోధనలు, సాంకేతిక పరిణామాలు, ఆవిష్కరణలపై చర్చించేందుకు పరిశోధకులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు, పాలసీ మేకర్స్, పారిశ్రామికవేత్తలు విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశ్యం. సదస్సులో ఏఐ డేటా సైన్స్, ఏఐ హార్డ్‌వేర్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్, ఫిన్‌టెక్ అండ్ ఎఐడ్రివెన్ ఫైనాన్షియల్ సిస్టమ్స్, ఎమర్జింగ్ ఇంటర్‌డిసిప్లినరీ ఏరియాస్ అనే నాలుగు ప్రధాన ట్రాక్‌లలో పరిశోధనా పత్రాలను ఆహ్వానిస్తున్నారు.

ఉత్తమ పరిశోధనలకు బెస్ట్ పేపర్ అవార్డు, బెస్ట్ స్టూడెంట్ పేపర్ అవార్డు, బెస్ట్ ఉమెన్ రీసెర్చర్ ప్రజెంటేషన్ అవార్డు, బెస్ట్ ఇండస్ట్రీ ఇన్నోవేషన్ పేపర్ అవార్డులను అందించనున్నారు. పూర్తి పరిశోధనా పత్రాల సమర్పణకు ఆగస్టు 10 గడువుగా నిర్ణయించారు. ఎంపికైన పత్రాల వివరాలను సెప్టెంబర్ 10న తెలియజేస్తారు. కెమెరారెడీ పేపర్ సమర్పణకు సెప్టెంబర్ 30 చివరి తేదీగా నిర్ణయించారు. ఉపకులపతి ఆచార్య వి.ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష దేశ, విదేశాలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు ఆవిష్కర్తలు తమ పరిశోధనా పత్రాలను సమర్పించి సదస్సులో చురుకుగా పాల్గొనాలని కోరారు.

# చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి

• ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సుమన్



సుమన్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఎఇఒ రవీంద్రబాబు

**కాణిపాకం, జూలై 27 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఏపీ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, ప్రముఖ హీరో సుమన్ అన్నారు. ఇటీవల ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సుమన్ సోమవారం జిల్లా ఈడిగ సంఘం నాయకులతో కలిసి ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుమారు 11 భాషల్లో వెయ్యికి పైగా చిత్రాల్లో నటించి 45ఏళ్ళుగా సుదీర్ఘ అనుభవం వున్న తనను ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడం ఆనందంగా వుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రస్తుత రాష్ట్రంలోని చలనచిత్ర నిర్మాతల సౌకర్యార్థం విజయవాడలో రికార్డింగ్, డబ్బింగ్ థియేటర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం వుందన్నారు. అలాగే సినిమా షూటింగ్‌ల కోసం తిరుపతి, తలకోన పరిసర ప్రాంతాల్లో లొకేషన్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం వుందన్నారు. ముఖ్యంగా ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయను తమిళనాడులోని ఊటీ తరహాలో ఉద్యానవనాలను అభివృద్ధి చేస్తే సినిమా షూటింగ్‌లకు ఎంతో అనువుగా వుంటుందన్నారు. అలాగే ప్రభుత్వ లోకేషన్లను చిన్న చిత్రాలు నిర్మించే నిర్మాతలకు ఉచితంగా ఇవ్వడంతో పాటు చలన చిత్రపరిశ్రమకు చెందినవారికి పట్టణాల్లో బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద చిన్నతరహా సినిమా థియేటర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని సుమన్ తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన ఈడిగ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చి వారి అభివృద్ధికి అన్ని రకాలుగా ప్రభుత్వం తోడ్పాటు అందించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు.

# శాకంబరిగా దుర్గమ్మ అనుగ్రహం

• ఇంద్రకీలాద్రిలో శాకంబరి ఉత్సవాలు ప్రారంభం



**ఇంద్రకీలాద్రి, జూలై 27 ప్రభాతవార్త:** శాకంభరీ నమోస్తుతే అంటూ భక్తుల జయజయ నాదాల నడుమ కూరగాయలు, పండ్ల అలంకారంతో దుర్గమ్మ శాకంబరి మాతగా అనుగ్రహించారు. ఇంద్రకీలాద్రిపై వైభవంగా శాకంబరి ఉత్సవాలు సోమవారం ప్రారంభమైనాయి. జగన్మాత, అమ్మవారు ఈ సంవత్సరం పచ్చి వేప సెనగ కాయల దండ, యాలకుల దండ, పుదీనా దండలు మెడలో ధరించి ప్రత్యేక ఆకర్షణగా భక్తులకు దర్శనమిచ్చారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు ఈనెల 29తో ముగుస్తాయని ఇఒ. తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పూజాదికాల్లో ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ. వికె శీనా నాయక్ పాల్గొన్నారు. దేశంలోని పలు ప్రాంతాల నుండి ఈ ఉత్సవానికి భక్తులు తరలివచ్చారు. ఆలయ అలంకరణ, కదంబం ప్రసాదం తయారీ నిమిత్తం సుమారు 45టన్నుల కూరగాయల వినియోగించారు. ప్రధాన ఆలయంలో శ్రీ కనకదుర్గ అమ్మ, మహా మండపంలో ఉత్సవ, ఉపాలయాల్లో దేవతా మూర్తులందరూ హరిత వర్ణంతో విరాజిల్లుతూ భక్తులను అనుగ్రహించారు.

**భక్తులకు కదంబ ప్రసాదం పంపిణీ:** శాకంబరి ఉత్సవాల్లో భక్తులకు ఆయా కూరగాయలతో తయారు చేసిన కదంబం ప్రసాదాన్ని ఇఒ వికె శీనా నాయక్, ప్రధాన అర్చకులు లింగం బొట్ల దుర్గాప్రసాద్ పంపిణీ చేశారు.

**దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తులు:** దుర్గమ్మని సోమవారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సునీత, జస్టిస్ సుజాత దర్శించుకున్నారు. వారికి ఇఒ. శీనా నాయక్ దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**ఆషాఢం సారె తెచ్చిన భక్తులతో రద్దీ:** దుర్గమ్మకి ఆషాఢం సారె తెచ్చిన భక్తజనంతో ఆలయంలో ఆదివారం రద్దీ నెలకొంది. శ్రీ కనకదుర్గమ్మని ఇంటి ఆడపిల్లగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర, సారెలతో ఇంద్ర కీలాద్రికి 13వ రోజు సోమవారం సాయంత్రం గంటల వరకు 27 సారె బృందాలకు చెందిన 14,756 మంది మహిళలు అమ్మకి సారె సమర్పించారు. సాయంత్రం 4 గంటల సమయానికి సుమారు 78 వేల మంది భక్తులు అమ్మని దర్శించుకున్నారు. దుర్గమ్మవారి దర్శనానంతరం 6వ అంతస్తులోని శ్రీ అమ్మవార్లకు సారెను సమర్పించి పూజాదికాలు నిర్వహించారు. క్యూలైన్ దర్శనం మొత్తం సారె భక్తులకు కేటాయించారు.

# ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనులు

# వేగవంతం చేయాలి: టిటిడి అదనపు ఇఒ



**తిరుమల, జూలై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లోపు ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనులను పూర్తి చేయాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆదేశించారు. ఎస్వీ మ్యూజియంలో ఏర్పాటు చేస్తున్న గ్యాలరీలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. మ్యూజియంలోని గ్యాలరీలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం మ్యూజియం బయట పార్కింగ్, మొబైల్ కౌంటర్లు, పాద రక్షకుల భద్రపరచే కేంద్రాల ఏర్పాటు గురించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఆరోగ్యవిభాగం డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ, ఎస్ఇ వేణు గోపాల్, ఎలక్ట్రికల్ డిఇ చంద్రశేఖర్, సివిఎస్ఒ ద్వారా తలారి రవి పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: కోవూరు ఎమ్మెల్యే

**కోవూరు (నెల్లూరు), జూలై 27 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాన్ని సరిదిద్దుకుంటూ అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు 90శాతం పైగా వాగ్దానాలను నెరవేర్చామన్నారు. కూటమి నాయకులు ధైర్యంగా ప్రతి ఇంటికి వెళ్లి మనం చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. ప్రజల్లో ఎవరికైనా సమస్యలు పరిష్కారం కాకపోతే నేరుగా తమ వద్దకు రావచ్చని పేర్కొన్నారు. అర్హులకు సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మలానంద బాబా, ఎంపిడిఒ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపిడిఒ సురేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ జగదీష్, ట్రాన్స్‌కో డిఇ మధుసూదన్‌రెడ్డి, ఎఇ గిరీష్, పెన్నా డెల్టా ఆయకట్టు ఛైర్మన్ రాఘవేంద్రరెడ్డి, జొన్నవాడ దేవస్థానం ఛైర్మన్ అశోక్‌రెడ్డి, పాటూరు నీటి సంఘం అధ్యక్షుడు ఆదాల శివారెడ్డి, ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు లక్ష్మీనరసారెడ్డి, బాల రవి, ఎంపిటిసి టి. పార్వతి, పురుషోత్తం, పెంచలయ్య, వెంకయ్య, వెంకటేశ్వర్లు, శివకృష్ణ, తదితరులు ఉన్నారు.

# నెల్లూరులో జాతరలా సైకిళ్ల పంపిణీ

## - 7 వేల మందికి మంత్రి నారాయణ ఉచిత సైకిళ్లు



**నెల్లూరు(వైద్యం), జులై 27 ప్రభాతవార్త:** వీఆర్సీ గ్రౌండ్ సోమవారం అక్షరాలా జాతరను తలపించింది. వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ట్రంక్ రోడ్డు, వీఆర్సీ గ్రౌండ్ కిక్కిరిసిపోయాయి. 'థాంక్యూ నారాయణ సార్' అంటూ విద్యార్థుల నినాదాలతో ప్రాంగణం మార్మోగింది. నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 7 వేల మంది విద్యార్థులకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుటుంబం సొంత నిధులతో ఉచిత సైకిళ్లు పంపిణీ చేసింది. మొత్తం 10 వేల మంది విద్యార్థులకు రూ.6 కోట్ల వ్యయంతో సైకిళ్లు అందించే కార్యక్రమంలో తొలి విడతగా ఈ పంపిణీ చేపట్టారు.

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ తన జీవిత ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. నేను పేదరికాన్ని పుస్తకాల్లో చదవలేదు.. జీవితంలో అనుభవించాను. గుడిసెలో పుట్టి, హరనాథపురం నుంచి వీఆర్సీ వరకు కాలినడకన వెళ్లి చదివాను. మా నాన్న ప్రైవేట్ బస్సు కండక్టర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషించారు. అప్పుడే బాగా చదివి పేదరికాన్ని జయించాలని నిర్ణయించుకున్నాను అని భావోద్వేగంగా చెప్పారు. ఎన్నికల సమయంలో 80 వేల ఇళ్లు తిరిగినప్పుడు పేద విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తనను కలచివేశాయని, వారికి నాణ్యమైన విద్యను ఆస్తిగా అందిస్తానని అప్పుడే నిర్ణయించుకున్నానని తెలిపారు. తాను చదివిన వీఆర్సీ విద్యాసంస్థను రూ.17 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దామని, ప్రస్తుతం అక్కడ 1,100 మంది నిరుపేద విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. నగరంలోని మరో 14 ప్రభుత్వ హైస్కూళ్లను ఆధునీకరిస్తున్నామని, వక్ఫ్ బోర్డు స్థలంలో రూ.20 కోట్ల సీఎస్ఆర్ నిధులతో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థల మెటీరియల్‌ను ఉచితంగా అందించి, ఆగస్టు 1 నుంచి ఐఐటీ ఫౌండేషన్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను అభినందించిన మంత్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమానికి తన వంతు సహకారం అందిస్తానని ప్రకటించారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పేద పిల్లల భవిష్యత్తు కోసం మంత్రి కుటుంబం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. వేలాది మంది విద్యార్థుల కళ్లల్లో కనిపించిన ఆనందమే ఈ కార్యక్రమం విజయానికి నిదర్శనమన్నారు. మేయర్ దేవరకొండ సుజాత మాట్లాడుతూ ఒకే రోజు 7 వేల సైకిళ్ల పంపిణీ చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. రూరల్ ఎంఎల్ఏ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ అడగ్గానే సైకిళ్ళు నెల్లూరు రూరల్‌కి ఇచ్చిన గొప్ప వ్యక్తి మంత్రి నారాయణ అని కొనియాడారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఈరోజు చాలా సంతోషమైన రోజన్నారు. నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఇది గిన్నిస్ బుక్‌లో నమోదయ్యే స్థాయి కార్యక్రమమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్, మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి, అల్లుళ్ళు పునీత్, గంటా రవితేజ, నారాయణ విద్యాసంస్థల జిఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, సంతపేట ఆంజనేయస్వామి ఆలయ ఛైర్ పర్సన్ విజేతా రెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు, టిడిపి నేతలు జహీర్, బాలాజీ, తిరుమల నాయుడు, కిన్నెర మాల్యాద్రి, మొయినుద్దీన్, కర్తం ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం!

• ఆత్మకూరులో దళితవాడ నుంచి 'ఇంటింటికి టిడిపి' కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి ఆనం



**ఆత్మకూరు (నెల్లూరు), జులై 27 ప్రభాతవార్త:** ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ రెండేళ్ళ విజయాలను ప్రతి ఇంటా తెలిసేలా ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారయణరెడ్డి సోమవారం ఆత్మకూరు పట్టణంలోని ముస్తాపురం దళితవాడలో ఇంటింటికి వెళ్ళి ప్రజలను కలిశారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ళ పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. మంత్రి ఆనంకు స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు. మంత్రి ఆనంతోపాటు ఆనం కుమార్తె లీలా కైవల్యారెడ్డి, సీనియర్ నేత తాళ్ళూరు గిరినాయుడు, ఎన్‌డిఎ కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వ హామీల అమలు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈసందర్భంగా ప్రజలు ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ముస్తాపురంలో 34లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, సిమెంట్ డ్రైన్‌లను మంత్రి ప్రారంభజంచారు. ఈసందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేసిన ప్రతి హామీని ప్రజలకు ఇంటింటికి వెళ్ళి వివరిస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గత రెండేళ్ళుగా రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తూ అభివృద్ధి సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళుతున్నామన్నారు. ఆత్మకూరు మున్సిపాల్టీ, రూరల్ మండల ఆలయాల అభివృద్ధికి రూ.22.40 కోట్ల నిధులు మంజూరు చేశామని, ప్రధాన దేవాలయాలకు రూ.8 కోట్లు సిజిఎఫ్ నిధులు, 18 గ్రామీణ దేవాలయాలకు రూ.90 లక్షలు, 13 శ్రీవాణి భజన మందిరాలకు రూ.4.60కోట్లు కేటాయించినట్లు వివరించారు. రైతుల కోసం అన్నదాత సుఖీభవ పథకం తొలివిడత నిధులను కూటమి ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

'తల్లికివందనం' పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేల ఆర్థికసాయం అందిస్తున్నా మన్నారు. ఆత్మకూరు మున్సిపాల్టీలో ఇప్పటికే రూ.75కోట్లతో రోడ్లు, డ్రైన్‌లు, మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి సోమశిల పైప్‌లైన్ లీకేజీల మరమ్మత్తులకు కోటికిపైగా ఖర్చుచేశామని, శాశ్వత పరిష్కారానికి రూ.26 కోట్లతో 40కొత్త తాగునీటి పథకాలు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. ముస్తాపురం దళిత కాలనీలో నూతన కోదండరామస్వామి దేవాలయాన్ని పవిత్రతకు ప్రతీకగా అన్ని వసతులతో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# శవాలను బైక్‌కు కట్టి సముద్రంలో పడేసి

• జంట హత్యల కేసును ఛేదించిన పోలీసులు • సముద్రపు వేటలో వివాదాలే ప్రధాన కారణం




**విజయవాడ,మచిలీపట్నం, జులై 27 ప్రభాతవార్త:** సముద్రపు వేటలో జరిగిన చిన్నపాటి ఘర్షణ నాలుగు కుటుంబాలను వీధిన పడేసింది. ఇరువురి మధ్య జరిగిన ఈ చిన్నపాటి గొడవ జంట హత్యలకు దారి తీయగా నెల రోజుల అనంతరం పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో దర్యాప్తు చేసి సంఘటన మిస్టరీని ఛేదించారు. నిందితులైన జల్లా నాగరాజు, శంకరపు శ్రీనివాస్, గుడివాడకు చెందిన కటికల కళ్యాణ్, డొక్కుమళ్ళ శ్రీకాంత్, షేక్ జిలాని, అబ్బూరి విజయరత్నంలను అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. మచిలీపట్నం డిఎస్పీ జి. శ్రీనివాసరావుసోమవారం మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు పూర్వాపరాలను వివరించారు. కృష్ణ జిల్లా, కృత్తివెన్ను మండలం, చినగొల్లపాలెం గ్రామంలోని యానాది కుటుంబాలు సముద్రపు వేటనే జీవనంగా సాగిస్తూ ఉంటారు. అదే గ్రామానికి చెందిన శెట్టి సుబ్బన్న (49), ఇతని అల్లుడు గొలుసు అయ్యప్ప (23) సమీపంలోని ఉప్పుటేరు కొత్త కాలువ ద్వారా సముద్రంలోకి వెళ్ళి చేపలు పట్టి విక్రయిస్తూ ఉంటారు. కాగా, గత నెల 27వ తేదీ రాత్రి చేపలవేటకు వెళ్ళిన మామా అల్లుళ్ళు ఇద్దరూ ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు వారిద్దరూ ఉప్పుటేరు కొత్త కాలువలో శవాలుగా పడి ఉండటాన్ని గుర్తించారు. వారిద్దరినీ చంపి వారి బైక్‌కే కట్టి కాలువలో పడవేసిన స్థితిలో ఉండటం సంచలనం సృష్టించింది.

కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, పెడన సీఐ, కంకిపాడు సిఐ, మచిలీపట్నం సీఐ ఆధ్వర్యంలో మూడు బృందాలను ఏర్పాటు చేసి కేసు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. హత్యకు గురైన శెట్టి సుబ్బయ్యకు, అదే గ్రామానికి చెందిన శంకరపు శ్రీనుతో చేపల వేటకు సంబంధించి రెండు నెల రోజుల క్రితం చిన్నపాటి గొడవలు జరిగాయి. అవి మనసులో పెట్టుకున్న శంకరపు శీను, అతడి స్నేహితుడు జల్లా నాగరాజు, వీరిద్దరికీ పాత పరిచయం ఉన్న గుడివాడకు చెందిన కటికల కళ్యాణ్, డొక్కుమళ్ళ శ్రీకాంత్, షేక్ జిలాని, అబ్బూరి విజయరత్నంలతో హత్యకు పథకాన్ని రచించి సముద్రపు వేటకు వెళ్లి వస్తున్న మామా అల్లుళ్ళు సుబ్బయ్య, అయ్యప్పలను దారుణంగా చంపారు. ఇద్దరి శవాలను వారి బైకుకు తాడుతో కట్టి సముద్రంలో పడేశారు.

**సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుల గుర్తింపు:** జంట హత్యల కేసును ఛేదించడంలో పోలీస్ యంత్రాంగం అన్ని రకాలుగా జల్లెడ పట్టినా ఎలాంటి క్లూ దొరకకపోవడంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సెల్ ఫోన్ల ఆధారంగా కేసును ఛేదించారు. ఈ కేసును పరిష్కరించడంలో సహకరించిన పెడన సీఐ నాగేంద్ర ప్రసాద్, కృత్తివెన్ను ఎస్ఐ పైడి బాబు, దర్యాప్తులో పాల్గొన్న కంకిపాడు సిఐ బీబీ రవికుమార్, సీఐ ఏసుబాబు, గూడూరు ఎస్ఐ ప్రకాష్, సాంకేతిక సిబ్బందిని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

# అంతర్రాష్ట్ర జేబుదొంగలు ముఠా అరెస్ట్

**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో పలురకాలుగా నేరాలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర జేబుదొంగలను తిరుమల టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. రాంభగీచ కార్ పార్కింగ్ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం అంతర్రాష్ట్ర నేర ముఠాకు చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

కర్ణాటకకు చెందిన బాలాజీ అకాడే(33), మహారాష్ట్రవాసి అప్పాషా మానే (65), నెల్లూరు జిల్లాకు చెందిన కల్తీ రెడ్డి కీర్తి(31) కలసి తిరుమలకు విచ్చేసే భక్తుల రద్దీని ఆసరాగా చేసుకొని బాలాజీ బస్టాండ్, ఉచిత బస్సులు, ఇతర రద్దీ ప్రాంతాల్లో జేబుదొంగతనాలు, పర్సుల చోరీలు, బ్యాగులు కత్తిరించి నగదు, విలువైన వస్తువులు అపహరిస్తున్నట్లు అంగీకరించారు.

దర్యాప్తులో మహిళా నిందితురాలు నకిలీ టిటిడి గుర్తింపు కార్డు తయారు చేసుకుని తాను టిటిడి ఉద్యోగినినని నమ్మిస్తూ విఐపి దర్శనం, ప్రత్యేక దర్శన టికెట్లు, వసతి గదులు ఏర్పాటు చేస్తానని యాత్రికులను మభ్యపెట్టి, ఫోన్‌పే ద్వారా డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. నిందితుల వద్ద నుండి ఒక దొంగిలించిన పర్సు. రూ.5,100 నగదు, మోటార్ సైకిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, నకిలీ టిటిడి గుర్తింపు కార్డు, మూడు సెల్ ఫోన్లు, కట్టర్, చిన్న కత్తి, బ్లేడ్‌లు, గిల్ట్ నగలు స్వాధీనం చేసుకున్నారు.

# కెనరా బ్యాంక్ ముందు

# దంపతుల ఆత్మహత్యాయత్నం



**కుందుర్పి, జులై 27 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా కుందుర్పి మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మండల పరిధిలోని మందలపల్లి గ్రామానికి చెందిన చంద్రకళ నాగేంద్ర దంపతులిద్దరూ ఒంటిపై డీజిల్ పోసుకొని బ్యాంకు ముందర డీజిల్ పోసుకొని హత్య ప్రయత్నం చేశారు. సకాలంలో రైతులు నిలువరించడం తో ప్రమాదం తప్పింది. చంద్రకళ మాట్లాడుతూ తమ మామ పంట రుణాల అప్పు తీర్చాలంటూ మా అకౌంటు హోల్డ్‌లో ఉంచారన్నారు. ఐదు రోజుల క్రితం తమ పిల్లలవి తల్లికి వందనం డబ్బులు డ్రా చేయడానికి వస్తే బ్యాంక్ అధికారులు నాన్న ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంక్ మేనేజర్‌ని ఎన్నోసార్లు ప్రాధేయపడిన బయటికి వెళ్లాలంటూ దౌర్జన్యం చేస్తున్నారని చంద్రకళ పేర్కొన్నారు.

## ఎపికి సెంట్రల్ రోడ్ ఫండ్ స్కీమ్ కోసం

# రూ.200 కోట్లు నిధుల విడుదల

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపికి సెంట్రల్ రోడ్ ఫండ్ స్కీమ్ కోసం రూ.200 కోట్లు నిధుల విడుదలయ్యాయి. రాష్ట్రంలో వివిధ రోడ్ల నిర్మాణం, నిర్వహణ తదితరంశాలకు సంబంధించి బిల్లు పెండింగ్‌లో ఉన్నాయి. జాతీయ రహదారుల అనుసంధాన అంశాల్లో బిల్లుల చెల్లింపులో జాప్యం నిర్మాణ పనుల ఆలస్యం కావడానికి కారణంగా భావిస్తున్న క్రమంలో పెండింగ్ బిల్లుల చెల్లింపు, న్యాయపరమైన చిక్కుల నివారణకు నిధులు విడుదల చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

# గీతం ఫార్మశీ కళాశాలకు 'ఎ' గ్రేడ్

**విశాఖపట్నం, జులై 27 ప్రభాతవార్త:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరాబాద్ ప్రాంగణాల్లోని 'స్కూల్ ఆఫ్ ఫార్మశీ' కళాశాలలు 2025-26 విద్యా సంవత్సరానికి గాను నేషనల్ ర్యాంకింగ్ మరియు రేటింగ్‌లో అత్యున్నతమైన 'ఎ' గ్రేడ్‌ను సాధించాయి. ఫార్మశీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ), క్వాలిటి కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసిఐ) ఎనఎబిఇటి సంయుక్తంగా నిర్వహించిన మొదటి విడత జాతీయ రేటింగ్ ప్రక్రియలో దేశవ్యాప్తంగా బి.ఫార్మశీ కోర్సును అందిస్తున్న 398సంస్థలను పరిశీలించారు. విద్యా ప్రమాణాలు, పరిశోధనలు, మౌలిక సదుపాయాలు, పాలన మరియు విద్యార్థుల నైపుణ్యాల ఆధారంగా ఈ సమగ్ర-మల్యాంకనం నిర్వహించబడింది. ఈ పోటీలో కేవలం 64 సంస్థలు(16.1) శాతం మాత్రమే అత్యుత్తమ 'ఎ 'గ్రేడ్‌ను దక్కించుకున్నాయి. ఇందులో గీతం విశాఖపట్నం ప్రాంగణం జాతీయ స్థాయిలో 43వ ర్యాంకు సాధించి దేశలోని టాప్ 10.8శాతంలో నిలవగా, హైదరాబాద్ ప్రాంగణం 54వ ర్యాంకుతో టాప్ 13.6 శాతంలో నిలిచిందని గీతం ఐక్యూఎసి సీనియర్ డైరక్టర్ ప్రొఫెసర్ రాజా ప్రభు తెలిపారు. ఈ మైలురాయి గీతం విశ్వవిద్యాలయం బి.ఫార్మశీ, ఎమ్‌ఫార్మశీ విద్యతో పాటు పరిశోధనలకు ఇస్తున్న ప్రాధాన్యతను నిరూపిస్తుండటంతో పాటు నాయకత్వ దూరదృష్టి, అధ్యాపకులు, విద్యార్థులు మరియు సిబ్బంది కృషికి దక్కిన గుర్తింపుగా ఆయన పేర్కొన్నారు.

# సాహిత్య విమర్శపై అరసం నేతృత్వంలో శిక్షణ

**అనంతపురం, జులై 27 ప్రభాతవార్త బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సాహిత్య విమర్శ మీద ఆగస్టు 8, 9 తేదీలలో అనంతపురంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆర్‌డిటి ఎకాలజీ సెంటర్‌లో రెండురోజుల పాఠశాల జరుగుతుందని అరసం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఈశ్వర్ రెడ్డి, తన్నీరు నాగేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధమాన విమర్శకులకు సాహిత్య విమర్శకు సంబంధించిన మెలకువలు నేర్పడం ఈ పాఠశాల ఉద్దేశం. ఈ పాఠశాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి నలభై మంది విద్యార్థులు హాజరవుతారు. ఎన్. వేణుగోపాల్, కె.నాగేశ్వరాచారి, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అధ్యాపకులుగా వ్యవహరిస్తారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, కార్యదర్శులు శరత్ చంద్రజ్యోతిశ్రీ, ఏఎంఆర్ ఆనంద్ అతిథులుగా హాజరవుతారు అని తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం

• 85.28 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తి

• నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు(కలెక్టరేట్), జులై 27 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, గణాంకాలు, తదుపరి చర్యలపై కలెక్టర్ వివరాలు వెల్లడించారు. జూన్ 15 నుంచి జూలై 24 వరకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. జిల్లాలోని మొత్తం 19,74,240 మంది ఓటర్లలో 16,83,557 మంది నుంచి ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించి 85.28శాతం మ్యాపింగ్ పూర్తి చేసినట్లు చెప్పారు. మ్యాపింగ్ పూర్తైన వారిలో 83.5 శాతం మందిని 2002 ఓటర్ల జాబితాతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల వివరాల ఆధారంగా అనుసంధానం చేయడం జరిగిందని, రాష్ట్రంలోనే ఒక విశేషమైన పురోగతిగా పేర్కొన్నారు. మ్యాపింగ్ కాని 1.8 శాతం మంది ఓటర్లకు భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన 12 రకాల అధికారిక గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి సంబంధిత ఈఆర్‌ఓకు సమర్పిస్తే వారి ఓటు హక్కు కొనసాగుతుందని స్పష్టం చేశారు. గత 45 రోజులుగా సెలవులు కూడా తీసుకోకుండా రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసిన సచివాలయ సిబ్బంది, బిఎల్‌ఒలు, తహసీల్దార్లు, ఆర్‌డిఒలు, ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులకు నా ప్రత్యేక అభినందనలు అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో కీలకంగా పనిచేసి విజయవంతం చేసిన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్‌ఓ విజయ్ కుమార్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

# సాగునీటి సమస్య పరిష్కరించండి

• సిఎం చంద్రబాబుకు వల్లభనేని వంశీ లేఖ

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై గన్నవరం వైసిపి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ సిఎం చంద్రబాబుకు లేఖ రాశారు. సాగు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను తక్షణం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి రైతుల సమస్యలను విన్నవించుకున్నామని తెలిపారు. అప్పుడు కూడా సమస్యను పరిష్కరించారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే విధంగా సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. తనను కలిసేందుకు ముఖ్యమంత్రికి ఇబ్బంది అయితే రైతులు మాత్రమే వచ్చి సమస్యను వివరిస్తారని చెప్పారు. సిఎం అనుమతి ఇస్తే తాను కూడా కలుస్తానని వల్లభనేని పేర్కొన్నారు.

# 'ఈచర్' ఢీకొని ముగ్గురు మృతి

• చిత్తూరు జిల్లా శాంతిపురం వద్ద ఘటన

**శాంతిపురం, జులై 27 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో శాంతిపురం మండలం కడపల్లి సమీపంలో సోమవారం ఓ ఈచర్ వాహనం ఢీకొన్న సంఘటనలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. వీరిలో ఐదేళ్ల చిన్నారి సైతం ఉండడం కలచివేసింది. మరో ఐదుమంది తీ వ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. వి.కోట వైపు నుంచి ఈచర్ వాహనం కుప్పం వైపు వెళ్తుండగా కుప్పం వైపు నుంచి టువీలర్‌లో శివపురం గ్రామంకు చెందిన సుందరప్ప (60), మునివెంకటమ్మ (50)లు తమ స్వగ్రామంకు వస్తున్నారు. కడపల్లి వద్ద ఎదురుగా వచ్చిన ఈచర్ వాహనం వీరి టువీలర్‌ను ఢీకొనడంతో వారు మృతి చెందారు.

అదే ఈచర్ వాహనం సమీపంలో ఉన్న నీళ్ల ట్యాంకరును సైతం ఢీకొంది. దీంతో అక్కడే ఉన్న సాత్విక్ (5), నందిని (14), కాంగావళి (20), అక్షయ (22) తీవ్రంగా గాయపడ్డారు. సాత్విక్‌ను చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్‌కు తరలించగా మృతి చెందాడు. మృతదేహాలకు కుప్పం ఏరియా ఆస్పత్రిలో పంచనామా నిర్వహించిన అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

కాగా మృతుల కుటుంబీకుల ఆర్తదానాలు అందర్నీ కలచివేశాయి. డిఎస్పీ పార్థసారథి, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ సంఘటనా స్థలిని పరిశీలించారు. రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈచర్ వాహనం డ్రైవర్ వేగంతో రావడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు.

## టీమిండియా వరుస ఓటములపై..

# గంభీర్, శ్రేయస్ అయ్యర్‌లకు చెక్!



**న్యూఢిల్లీ:** టీమిండియా వరుస ఓటములపై సమీక్ష నిర్వహించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) సిద్ధమైంది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో భారత్ 6 టి20లు, రెండు వన్డేల్లో ఓటమిపాలైంది. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలోఉంచుకొని విదేశాల్లో భారత జట్టు ప్రదర్శన మెరుగయ్యేందుకు చేపట్టాల్సిన మార్పులు, ఆటగాళ్ల ఎంపిక, వ్యూహాలపై వివరంగా చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ వరుస ఓటముల వెనుక గల కారణాలను బిసిసిఐ ఆరా తీయనుంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌లతో అత్యవసర సమావేశం నిర్వహించి వరుస పరాజయాలకు వివరణ కోరాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. భారత జట్టు పేలవ ప్రదర్శనపై భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు అధికారులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. జింబాబ్వేతో ప్రస్తుతం జరుగుతున్న టి20 సిరీస్ ముగిసిన వెంటనే ముంబైలోని ప్రధాన కార్యాలయంలో ఈ ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి టీమిండియా టి20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో పాటు, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, తాత్కాలిక కోచ్ వీవీఎస్ లక్ష్మణ్, సెలెక్టర్లు, బిసిసిఐ అధికారులు హాజరు కానున్నారు. ఈ సమావేశంలో తక్షణ నిర్ణయాలేవి తీసుకోనప్పటికీ గంభీర్, శ్రేయ్యర్ ఇద్దరికీ ఒక గట్టి వార్నింగ్ ఇచ్చే అవకాశం ఉంది. గంభీర్‌కు 2027 వరకు ఒప్పందం ఉన్నందున అతని పదవికి వచ్చే ముప్పు ఏం లేనప్పటికీ, వన్డే, టి20 క్రికెట్‌లో జట్టు ఘోర ప్రదర్శన ఒత్తిడిని పెంచుతోంది. టెస్ట్‌ల్లో భారత ప్రదర్శన మరీ నాసిరకంగా తయారైంది.

పరిస్థితులు ఇలానే కొనసాగితే 2027 వన్డే ప్రపంచకప్‌లో కూడా భారత్ పేలవ ప్రదర్శన కనబర్చే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దాంతోనే గంభీర్‌తో అత్యవసర సమావేశానికి బిసిసిఐ సిద్ధమైనట్లు తెలుస్తోంది. కొత్త టి20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వైఖరిపై కూడా ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉంది. కాకపోతే అతనికి మరికొన్ని సిరీస్‌ల వరకు అవకాశం ఇవ్వవచ్చు. 2026 ఆసియా గేమ్స్‌లో భారత్ గోల్డ్ మెడల్ సాధిస్తే అతనిపై ఉన్న ఒత్తిడి తగ్గనుంది. ఇదే సమయంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కింద పని చేసే సపోర్ట్ స్టాఫ్ భవితవ్యంపై ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు.





## వరల్డ్ కప్ మహిళల పిస్టల్..

# ఈషాకు స్వర్ణం

## మనుకు కాంస్యం

**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ రైఫిల్/పిస్టల్/షాట్‌గన్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత్ డబుల్ పోడియం ఫినిష్‌ను సాధించింది. చైనాలోని హాంగ్‌జౌలో సోమవారం జరిగిన ఈ పోటీల్లో హైదరాబాద్ షూటర్ ఈషా సింగ్ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, ఒలింపిక్ పతక విజేత మను భాకర్ కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ఎనిమిది మంది షూటర్ల ఫైనల్‌లో ఈషా నిలకడైన ప్రదర్శన కనబరిచి, 40 హిట్‌లతో పోడియంపై అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో మను పోరాడి, కీలకమైన షూట్‌ఆఫ్‌లో నెగ్గి, 28 హిట్‌లతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఇద్దరు భారతీయ షూటర్లు ఆకట్టుకున్నారు, మను 586-20న స్కోరుతో అగ్రస్థానంలో నిలవగా, ఈషా 585-18న స్కోరుతో రెండో స్థానంలో నిలిచి ఫైనల్‌లో తమ స్థానాలను సునాయాసంగా ఖరారు చేసుకున్నారు. ఇక మాజీ ఆసియా క్రీడల ఛాంపియన్ రాహి సర్నోబత్ 582 -16న స్కోరుతో పతకాల రౌండ్‌కు అర్హత సాధించడంలో స్వల్ప తేడాతో విఫలమయ్యాడు. సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్ (576-20న) మరియు అభిజ్ఞా అశోక్ పాటిల్ (573-16న) ర్యాంకింగ్ పాయింట్స్ ఓన్లీ (ఆర్‌పీఓ) విభాగం కింద పోటీపడ్డారు. కాగా 21 ఏళ్ల హైదరాబాదీ షూటర్ ఈషా ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉంది. ఈ యేడాది ఆరంభంలో మ్యూనిచ్‌లో జరిగిన ఫైనల్‌లో 43 హిట్స్‌తో సీనియర్, జూనియర్ ప్రపంచ రికార్డులు రెండింటినీ నెలకొల్పి ఆమె చరిత్ర సృష్టించింది. పారిస్ 2024 ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత అయిన ఈషా, ప్రపంచంలోని అగ్రశ్రేణి పిస్టల్ షూటర్లలో ఒకరిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది.

## కామన్వెల్త్ గేమ్స్ మహిళల వెయిట్ లిఫ్టింగ్

# జ్ఞానేశ్వరికి రజతం




**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ 2026 మహిళల 53 కేజీల వెయిట్ లిఫ్టింగ్ ఈవెంట్‌లో భారత క్రీడాకారిణి జ్ఞానేశ్వరి యాదవ్ రికార్డు బ్రేకింగ్ ప్రదర్శనతో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. గ్లాస్గోలో సోమవారం జరిగిన స్నాచ్ విభాగంలో జ్ఞానేశ్వరి తన మూడు ప్రయత్నాలలో 82 కేజీలు, 85 కేజీలు, 88 కేజీలను విజయవంతంగా ఎత్తి, ప్రారంభ విభాగం తర్వాత రెండవ స్థానంలో నిలిచింది. నైజీరియాకు చెందిన ఒనోమే ఒమోలోలా డిడిహ్ 93 కేజీలతో అగ్రస్థానంలో నిలవగా, కెనడాకు చెందిన రెబెకా గ్రౌల్క్స్ 83 కేజీలతో మూడవ స్థానంలో నిలిచింది. జ్ఞానేశ్వరి అదే ఊపును క్లీన్ అండ్ జర్క్‌లో కూడా కొనసాగించి, తొలి ప్రయత్నంలో 103 కేజీలను సునాయాసంగా ఎత్తి, రెండవ ప్రయత్నంలో దానిని 107 కేజీలకు మెరుగుపరుచుకుంది. రజత పతకం కోసం జరిగిన పోరులో, జ్ఞానేశ్వరి అత్యంత కీలకమైన సమయంలో తన చివరి ప్రయత్నంలో 111 కిలోల బరువును విజయవంతంగా ఎత్తి సత్తా చాటింది. ఈ ప్రదర్శన ఆమెకు పోడియంపై స్థానాన్ని సంపాదించి పెట్టడమే కాకుండా, ఒక కొత్త వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శనను, క్లీన్ అండ్ జర్క్‌లో (111 కిలోలు) ఒక కొత్త భారత జాతీయ రికార్డును, మరియు మొత్తం 199 కిలోల (88 కిలోలు + 111 కిలోలు) బరువుతో ఒక కొత్త జాతీయ రికార్డును నెలకొల్పింది.



## హెచ్‌సిఎ డివిజన్ లీగ్ క్రికెట్‌లో

# రాణించిన శ్రేయ్‌సింగ్

**హైదరాబాద్,జులై 27:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఏ డివిజన్, బీ డివిజన్ రెండు రోజుల లీగ్ ఛాంపియన్‌షిప్‌లో తొలి రోజు మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగాయి. బ్యాటర్లు భారీ స్కోర్లు నమోదు చేయగా, పలువురు బౌలర్లు ఐదు, ఆరు వికెట్లతో మెరిశారు. వర్షం కారణంగా కొన్ని మ్యాచ్‌లు ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయ్యాయి. చార్మినార్ 308 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. జట్టులోని బ్యాటర్ శ్రేయ్‌సింగ్ 97 పరుగులతో శతకాన్ని మిస్‌అయినా 8 బౌండరీలు, మూడు సిక్స్‌లు సాధించి శెహభాష్ అనిపించుకున్నాడు. భావేష్ సేథ్ 88 పరుగులు చేశాడు. రిషబ్ బస్లాస్ 6 వికెట్లు పడగొట్టాడు. ప్రత్యర్థి ఈఎంసీసీ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 107/1తో నిలిచింది.ఎ డివిజన్: దయానంద్, స్పోర్టింగ్ ఎలెవన్ విజయాలు రౌండ్ 1 తొలి రోజు మ్యాచ్‌లో ఆర్. దయానంద్ జెమినీ ఫ్రెండ్స్‌పై 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జెమినీ ఫ్రెండ్స్ 124 పరుగులకు ఆలౌటవగా చిరాగ్ యాదవ్ (52), అవేజ్ అహ్మద్ (40) రాణించారు. ఎం. ధీరజ్ రావు 6/29తో చెలరేగాడు. అనంతరం దయానంద్ 125/4తో లక్ష్యాన్ని చేరుకుంది. రవి తేజ అజేయ అర్ధశతకం (50..) సాధించాడు.స్పోర్టింగ్ ఎక్స్ఐ కూడా ఎస్‌బిఐపై ఐదు వికెట్లతో గెలిచింది. ఎస్‌బిఐ 133 పరుగులకు ఆలౌట్ అవగా తనయ్ త్యాగరాజన్ 5/14తో అద్భుత బౌలింగ్ చేశాడు. అనంతరం యశ్ సత్వాలేకర్ (52) అర్ధశతకంతో స్పోర్టింగ్ ఎక్స్ఐ 19.4 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది.బడ్డింగ్ స్టార్ 43 ఓవర్లలో 142/2తో బలమైన స్థితిలో నిలిచింది. జైరామ్ కశ్యప్ (70), విభాన్ ఆదిత్య వర్మ (32 నాటౌట్) రాణించారు.కేంబ్రిడ్జ్ ఎక్స్ఐ 256 పరుగులు చేయగా, ఆశ్లేష్ వామన్ 73, అర్హాన్ సత్వాలేకర్ 59 రాణించారు. ఇంపీరియల్ తొలి రోజు 18 పరుగులు వికెట్ నష్టపోకుండా చేసింది.డెక్కన్ వాండరర్స్ 37 ఓవర్లలో 246/3తో భారీ స్కోరు సాధించింది. నితీష్ రెడ్డి 112 బంతుల్లో 107 పరుగులతో శతకం నమోదు చేయగా, సాయి శరణ్ 68, హర్షిత్ చౌదరి 44 పరుగులు చేశారు.ఉమ్మడి రెండు జిల్లాల జట్లు కూడా తొలి ఇన్నింగ్స్‌లో వరుసగా 117, 230 పరుగులుచేశాయి. ఏఓసీఎవర్‌గ్రీన్, ఎస్‌సీఆర్ఎస్ఏడెక్కన్ క్రానికల్‌మ్యాచ్‌లు తడి మైదానం కారణంగా ఒక్క బంతికూడా పడకుండానే రద్దయ్యాయి.

## కామన్వెల్త్ బాక్సింగ్‌లో..

# క్వార్టర్ ఫైనల్స్‌కు సచిన్

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్‌లో పురుషుల 65 కేజీల బాక్సింగ్ ఈవెంట్‌లో భారత్ బాక్సర్ సచిన్ సివాచ్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. బాక్సింగ్‌ఈవెంట్‌లో 26 యేళ్ల క్రీడాకారుడు, సోమవారం ఇక్కడ స్కాటిష్ ఈవెంట్ క్యాంపస్‌లో జరిగిన పోరులో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, ఇంగ్లాండ్‌కు చెందిన విలియం హెవిట్‌ను 4-1 పాయింట్ల తేడాతో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. హెవిట్ వేసిన రెండు వేగవంతమైన పిడిగుద్దులు ఒకటి కుడి నుంచి, మరొకటి ఎడమ నుంచి పోటీ గమనాన్ని నిర్దేశించాయి. తర్వాత సచిన్ రింగ్‌లో తెలివిగా కదులుతూ ఆంగ్లేయుడిపై దాడికి దిగి తన పంచ్‌లను విజయవంతంగా సంధించాడు. అదే సమయంలో హెవిట్ స్పష్టంగా పంచ్‌లు కొట్టడం కష్టతరం చేశాడు. చివరిలో, సచిన్ పూర్తి నియంత్రణలోఉండి, పక్కలనుండి వరుసగా పదునైన పంచ్‌లు విసురుతూ, పాయింట్ల విషయంలో న్యాయనిర్ణేతలు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చేలా ఒత్తిడి తెచ్చాడు. రెండో రౌండ్‌లో హెవిట్ దూకుడుగా బరిలోకి దిగి, భారత ఆటగాడిని కలవరపెట్టే ప్రయత్నంలో అతనిపైకి దూసుకెళ్లాడు. కానీ సచిన్ సంయమనం కోల్పోకుండా ఆ ఒత్తిడిని తట్టుకుని, తన స్థానాన్ని తిరిగి పొంది, సరైన స్కోరింగ్ ప్రదేశాలను అత్యంత సునాయాసంగా లక్ష్యంగా చేసుకుని విజయం సాధించాడు.

# పాలిమర్ కరెన్సీ నోట్లకు తొలి అడుగు




## రూ.10, రూ.20 నోట్లపై పైలట్ పరీక్షలు

**న్యూఢిల్లీ,జులై 27:** భారతదేశంలో పాలిమర్ కరెన్సీ నోట్ల ప్రవేశానికి కేంద్ర ప్రభుత్వం తొలి అడుగు వేసింది. ఆర్బీఐ ప్రతిపాదించిన మేరకు రూ.10, రూ.20 విలువ కలిగిన తలా 100 కోట్ల పాలిమర్ నోట్లను ప్రయోగాత్మకంగా విడుదల చేయడానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరీ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాలిమర్ నోట్లు ఎలా పనిచేస్తాయో అంచనా వేయడానికి ఈ ప్రయోగాత్మక విడుదల చేపడుతున్నట్లు తెలిపారు. ఫీల్డ్ ట్రయల్స్ విజయవంతమైతేనే దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రవేశపెట్టే అంశంపై నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ నిర్ణయంతో పాలిమర్ నోట్లపై ఆర్‌బిఐ పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించనున్నట్లు గతంలో వెలువడిన వార్తలకు అధికారిక ధృవీకరణ లభించింది. ఆర్‌బిఐ ప్రకారం, పాలిమర్ నోట్లు ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు నోట్ల కంటే ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి. అధిక నగదు లావాదేవీలు జరిగే దేశాల్లో పాలిమర్ నోట్ల జీవితకాలం ఎక్కువగా ఉండటంతో వాటి వినియోగం ప్రయోజనకరమని అంతర్జాతీయ అనుభవాలు సూచిస్తున్నాయని తెలిపింది.అయితే పాలిమర్ నోట్ల ప్రవేశంతో కాగితపు నోట్లను పూర్తిగా రద్దు చేయాలనే ఉద్దేశం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న కాగితపు కరెన్సీతో పాటు పాలిమర్ నోట్లు కూడా చలామణిలో ఉంటాయని, కాగితపు నోట్ల స్థానంలో పూర్తిగా పాలిమర్ నోట్లను తీసుకురావాలనే ప్రతిపాదన లేదని పేర్కొంది.పాలిమర్ నోట్లు డిజిటల్ చెల్లింపులపై ఎలాంటి ప్రభావం చూపుతాయో ఇప్పుడే చెప్పడం సాధ్యం కాదని ఆర్‌బిఐ తెలిపింది. అవి సాధారణ చలామణిలోకి వచ్చిన తర్వాత మాత్రమే దీనిపై సమగ్ర అంచనా వేయవచ్చని పేర్కొంది.భౌతిక కరెన్సీ మరియు డిజిటల్ చెల్లింపులు ఒకదానికొకటి ప్రత్యామ్నాయాలు కాకుండా పరస్పర అనుబంధ వ్యవస్థలని, భవిష్యత్తులో కూడా రెండూ కలిసి కొనసాగుతాయని ఆర్‌బీఐ అభిప్రాయపడింది.

## కోల్ ఇండియా తొలి త్రైమాసిక లాభం రూ.8,852 కోట్లు

**ఒక్కో షేరుకు రూ.5.50 మధ్యంతర డివిడెండ్**



**న్యూఢిల్లీ,జులై 27:** ప్రభుత్వ రంగ బొగ్గు కంపెనీ కోల్ ఇండియా స్వల్ప లాభాల వృద్ధిని నమోదు చేసింది. కంపెనీ నికర లాభం గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే 0.6 శాతం పెరిగి రూ.8,852 కోట్లకు చేరింది. షేర్‌హోల్డర్లకు కంపెనీ ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.5.50 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. డివిడెండ్‌కు అర్హులైన వాటాదారులను నిర్ణయించేందుకు జులై 31ని రికార్డు తేదీగా నిర్ణయించింది. డివిడెండ్ మొత్తాన్ని ఆగస్టు 25, 2026లోపు చెల్లించనున్నట్లు తెలిపింది.తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మొత్తం ఆదాయం 7.8 శాతం పెరిగి రూ.46,255 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.42,919 కోట్లు. ఎబిట్డా 4.1శాతం తగ్గి రూ.12, 069 కోట్లకు పరిమితమైంది. గత యేడాది ఇది రూ.12,588 కోట్లు. ఎబిట్డా మార్జిన్ 29.3 శాతం నుంచి 26.1 శాతానికి తగ్గింది. నికర లాభం 0.6 శాతం పెరిగి రూ.8,852 కోట్లకు చేరింది. ఒక్కో షేరుకు రూ.5.50 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. షేరు స్వల్ప లాభంతో ముగింపుత్రైమాసిక ఫలితాల అనంతరం కోల్ ఇండియా షేరు ధర సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి 0.02 శాతం పెరిగి రూ.427.50 వద్ద స్థిరపడింది. ఇదే సమయంలో ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 0.96 శాతం లాభపడింది. రోజంతా కంపెనీ షేరు రూ.425.75 నుంచి రూ.431.00 మధ్య ట్రేడైంది. ప్రారంభంలో రూ.429.50 వద్ద ప్రారంభమైన షేరు, అంతకుముందు ముగింపు ధర రూ.427.40గా ఉంది.



## నాలుగురెట్లు పెరిగిన బిలియనీర్ టాక్స్ పేయర్లు

**న్యూఢిల్లీ,జులై 27:** దేశంలో యేడాదికి రూ.100 కోట్లకు పైగా ఆదాయం ప్రకటిస్తున్న పన్ను చెల్లింపుదారుల సంఖ్య గత ఐదేళ్లలో గణనీయంగా పెరిగింది. ఈ సంఖ్య దాదాపు నాలుగు రెట్లు పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానంలో ఈ వివరాలు వెల్లడించారు. 2025-26 అసెస్‌మెంట్ సంవత్సరంలో రూ.100 కోట్లకు మించి వార్షిక ఆదాయం ప్రకటించిన వారి సంఖ్య 576కు చేరిందని తెలిపారు. 2021-22లో ఈ సంఖ్య 142 మాత్రమే ఉండేదని చెప్పారు. అంటే ఐదేళ్ల వ్యవధిలో దాదాపు 300 శాతం పెరుగుదల నమోదైందని వివరించారు. 2022-23లో ఈ సంఖ్య 301కు చేరగా, తర్వాత ఏడాది స్వల్పంగా తగ్గి 284గా నమోదైంది. ఆ తర్వాత 2024-25లో 415కు పెరిగి, గత యేడాది 576కు చేరింది.

ఆదాయపు పన్ను చట్టం 2025లో బిలియనీర్ అనే పదానికి ప్రత్యేక నిర్వచనం లేదని కేంద్రం స్పష్టం చేసింది. అందువల్ల ఆదాయపు పన్ను రిటర్నుల్లో రూ.100 కోట్లకు పైగా ఆదాయం ప్రకటించిన వ్యక్తుల వివరాలను మాత్రమే అందించినట్లు పేర్కొంది. ఈ గణాంకాలు పన్ను రిటర్నుల ఆధారంగా సేకరించినవేనని వెల్లడించింది. దేశంలో ఆదాయ అసమానతలపై అడిగిన ప్రశ్నకు కూడా కేంద్రం సమాధానం ఇచ్చింది. హౌస్‌హోల్డ్ కన్సప్షన్ ఎక్స్‌పెండిచర్ సర్వే ప్రకారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదాయ అసమానత తగ్గినట్లు తెలిపింది. అలాగే 15 ఏళ్లు పైబడిన వారి నిరుద్యోగ రేటు 3.1 శాతానికి తగ్గిందని వెల్లడించింది. ఉపాధి కల్పన, ప్రగతిశీల పన్ను విధానం, ఆరోగ్యం, విద్య, గృహ నిర్మాణం, గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా సమ్మిళిత ఆర్థిక వృద్ధికి కృషి జరుగుతున్నట్లు కేంద్రం వివరించింది.

# ఐదు రోజుల నష్టాలకు బ్రేక్




## లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు..

**ముంబయి,జులై 27:** ముడి చమురు ధరల తగ్గుదల, ఐటీ షేర్ల ర్యాలీతో జోష్ దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ఐదు వరుస ట్రేడింగ్ సెషన్ల నష్టాలకు చెక్ పెడుతూ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరలు భారీగా తగ్గడం, భౌగోళిక ఉద్రిక్తతలు సడలడం, తొలి త్రైమాసిక ఫలితాలపై సానుకూల అంచనాలు మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. విదేశీ బ్రోకరేజ్ సంస్థలు ఐటీ రంగ రేటింగ్‌ను 'అండర్‌వెయిట్' నుంచి 'న్యూట్రల్' కు పెంచడంతో ఐటీ షేర్లలో కొనుగోళ్లు పెరిగాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 776.01 పాయింట్లు లాభపడి 76,835.78 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 228.50 పాయింట్లు ఎగిసి 23,995.95 వద్ద స్థిరపడింది. అంతకుముందు వరుసగా ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2.67 శాతం, నిఫ్టీ 2.32 శాతం మేర నష్టపోయాయి. నిఫ్టీ లాభాలకు ఎటర్నల్ 5.61, ఇన్ఫోసిస్ 3.59, బజాజ్ ఫైనాన్స్3.57 ప్రధానంగా దోహదపడ్డాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 1.13 శాతం, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.34 శాతం పెరిగాయి. ఎన్ఎస్ఇలో 2,259 షేర్లు లాభపడగా, 1,071 షేర్లు నష్టపోయాయి. 116 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. కమోడిటీ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీకి సంబంధించిన బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 7.93 డాలర్లు 8.19 శాతం తగ్గి 88.85 డాలర్లకు చేరింది.విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. రూపాయి విలువ గత ముగింపు 96.5300తో పోలిస్తే 95.9425 వద్ద ట్రేడైంది. ఎంసిఎక్స్‌లో ఆగస్టు 5, 2026 డెలివరీకి సంబంధించిన బంగారం ఫ్యూచర్స్ ధర 0.57 శాతం పెరిగి రూ.1,43,925కు చేరుకుంది. అమెరికా 10 యేళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 0.94 శాతం తగ్గి 4.635 శాతానికి చేరింది.ఈ వారంలో వెలువడనున్న ప్రముఖ టెక్నాలజీ కంపెనీల త్రైమాసిక ఫలితాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన సమావేశంపైనా ఇన్వెస్టర్ల ఫోకస్ పెరిగింది. ఫెయిర్‌కెమ్ ఆర్గానిక్స్ త్రైమాసిక లాభాల్లో గణనీయమైన వృద్ధిని నమోదు చేయడంతో షేరు 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.లోధా డెవలపర్స్ సమీకృత నికర లాభం 103.36 శాతం పెరిగి రూ.1,372.1 కోట్లకు చేరడంతో షేరు 5.27 శాతం ఎగిసింది.ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ స్వతంత్ర నికర లాభం 37.03 శాతం పెరిగి రూ.795.95 కోట్లకు చేరడంతో షేరు 5.08 శాతం లాభపడింది. కెనరా బ్యాంక్ తొలి త్రైమాసికంలో నికర లాభం 2.19 శాతం పెరిగి రూ.4,856 కోట్లకు, మొత్తం ఆదాయం 4.26 శాతం పెరిగి రూ.39,684 కోట్లకు చేరడంతో షేరు 1.08 శాతం పెరిగింది.శేషసాయి పేపర్ అండ్ బోర్డ్స్ స్వతంత్ర నికర లాభం 96.89 శాతం పెరిగి రూ.33.59 కోట్లకు చేరడంతో షేరు 3.42 శాతం ఎగిసింది.జెన్ టెక్నాలజీస్ సమీకృత నికర లాభం 27.83 శాతం తగ్గి రూ.34.46 కోట్లకు చేరడంతో షేరు 5 శాతం పడిపోయింది. వేదాంత్ ఫ్యాషన్స్ షేరు 1.19 శాతం, జిందాల్ స్టీల్ షేరు 2.92 శాతం లాభపడ్డాయి. బిర్లా కార్పొరేషన్ సమీకృత నికర లాభం 3.20 శాతం తగ్గడంతో షేరు 5.42 శాతం క్షీణించింది. టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సమీకృత నికర లాభం 27.78 శాతం పెరిగి రూ.426.98 కోట్లకు చేరడంతో షేరు 1.84 శాతం పెరిగింది.ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ నికర లాభం 28.98 శాతం పెరిగి రూ.130.12 కోట్లకు చేరినప్పటికీ షేరు 2.01 శాతం నష్టపోయింది.

## సిఇఓ, సిఎఫ్‌ఓకు జరిమానా




**ముంబయి, జులై 27:** దేశంలోనే ప్రైవేటుబ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశిధర్ జగదీశన్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ శ్రీనివాసన్ వైద్యనాథన్ లపై రూ. 1 లక్ష చొప్పున జరిమానా విధించింది. రిటైల్ అసెట్స్ గ్రూప్ హెడ్ అరవింద్ వోహ్రాపై కూడా ఇదే మొత్తంలో జరిమానా వేసింది. ఈ మేరకు సోమవారం నాడు బ్యాంక్ ఒక ప్రకటన విడుదల చేసింది. మహారాష్ట్ర స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి డిపాజిట్లను సమీకరించే విషయంలో జరిగిన అవకతవకలపై బ్యాంకు అంతర్గత విచారణ చేపట్టింది. 2017, 2021 సంవత్సరాల్లో జరిగిన ఈ డిపాజిట్ల సమీకరణపై స్వతంత్ర డైరెక్టర్లతో కూడిన ప్రత్యేక క్రమశిక్షణా కమిటీ దర్యాప్తు నిర్వహించింది. ఈనెల 23న జరిగిన బోర్డు సమావేశంలో ఈ కమిటీ నివేదికను సమీక్షించారు. సంబంధిత అధికారుల ప్రవ ర్తన వ్యాపార పరిధిని దాటడం కిందకు వస్తుందని, ఇందులో ఎలాంటి దురు ద్దేశం లేదా వ్యక్తిగత లాభం లేదని బోర్డు నిర్ధారణకు వచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించడంలో ఎటువంటి అలసత్వం ఉండకూడదనే ఉద్దేశంతో, కమిటీ సిఫార్సుల మేరకు బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. ముగ్గురు ఉన్నతాధికారులకు జరిమానాతోపాటు హెచ్చరిక లేఖలు జారీచేసింది. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఇతర ఉద్యోగులకు కూడా హెచ్చరిక లేఖలు ఇచ్చింది. విచారణ ఫలితాలను ఆర్‌బీఐకి తెలియజేయాలని బోర్డు ఆదేశించింది.




## టాటా గ్రూప్ ఆదాయం రూ.16.24 లక్షల కోట్లు

## నికర లాభం 52 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ, జులై 27:** టాటా గ్రూప్ సమగ్ర స్థాయిలో మరోసారి బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. గ్రూప్ మొత్తం ఆదాయం 7.8 శాతం పెరిగి రూ.16,24,030 కోట్లకు చేరగా, పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభం 51.9 శాతం పెరిగి రూ.1,70,525 కోట్లకు చేరిందని టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ వెల్లడించారు.టాటాగ్రూప్ సంస్థల హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ వార్షిక నివేదికలో వాటాదారులనుఉద్దేశించి చంద్రశేఖరన్ మాట్లా డారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ రంగంలో పెట్టుబడుల ప్రవాహం మధ్య కూడా టాటా గ్రూప్ అత్యుత్తమ ఆర్థిక ప్రదర్శన కనబర్చిందన్నారు.

టాటాసన్స్ ఆదాయం 9.1 శాతం పెరిగి రూ.42, 367 కోట్లకు, నికరలాభం 21.8 శాతంపెరిగి రూ.31,961 కోట్లకు చేరింద న్నారు. ఒక్కో షేరుకు రూ.1,10,717 తుది డివిడెండ్ చెల్లించాలని బోర్డు సిఫారసు చేసిందని, దీనికి వాటాదారుల ఆమోదం అవసరమని తెలిపారు. సంస్కరణలు, వ్యాపార పునర్వ్యవస్థీకరణ ఫలితంగానే ఈ వృద్ధి సాధ్యమైందని చెప్పారు. ఎలక్ట్రానిక్స్ తయారీలో వేగంగా ఎదుగుతున్నటాటా గ్రూప్ ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యాపారం కేవలం నాలుగేళ్లలోనే రూ.1,31,082 కోట్ల ఆదాయంతో గ్రూప్‌లో నాలుగో అతిపెద్ద సంస్థగా ఎదిగిందన్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# ముర్రం శివాని మృతి అత్యంత విషాదకరం...

- పూర్తి స్థాయి దర్యాప్తు జరిపిస్తాం
- ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం : పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్.



**పోలవరం జిల్లా ప్రతినిధి, జూలై 27 ప్రభాత వార్త.** రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ముర్రం శివాని సోమవారం నాడు బలవన్మరణం అత్యంత బాధాకరమైన సంఘటన అని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి , వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏరియా ఆసుపత్రిలో శివాని మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ ఘటనను సంబంధించిన అన్ని కోణాల్లో పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ నుపుర్ ప్రశాంత్ కుమార్, రంపచోడవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కె. స్వాతి, రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అశ్రఫ్ అలీతో కలిసి శివాని మృతికి సంబంధించిన పరిస్థితులు, ఘటనకు దారితీసిన కారణాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. దర్యాప్తు నివేదిక ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. మంచి భవిష్యత్తు ఉన్న విద్యార్థిని ఈ విధంగా కోల్పోవడం అత్యంత విషాదకరమని పేర్కొన్న కలెక్టర్, శివాని ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని జిల్లా యంత్రాంగం తరఫున ప్రగాఢ సానుభూతి తెలియ చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కూడా తీవ్ర విచారం వ్యక్తం చేసినట్లు కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు.



జిల్లా కలెక్టర్ వెంట గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి జి. శ్రీరామ్ మూర్తి, ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు, డాక్టర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.




తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం | మంగళవారం 28 జూలై 2026 | I


## జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు నిర్వహించిన పోరాటం స్ఫూర్తిదాయకం

### చనిపోయిన 93మంది విద్యార్థులకు ఉద్యమం అంకితం, జగ్గారపు మల్లికార్జున్



**కాకినాడ రూరల్ ,జూలై 27(ప్రభాతవార్త):** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన విద్యార్థుల పోరాటం స్ఫూర్తిదాయకమని, నీట్ పరీక్ష కోసం చనిపోయిన 93 మంది విద్యార్థులకు ఉద్యమం అంకితమిస్తున్నామని జైభీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రముఖ న్యాయవాది జగ్గారపు మల్లిఖార్జున వెల్లడించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మల్లిఖార్జున మాట్లాడుతూ కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ)ఆధ్వర్యంలో ఢిల్లీలో విద్యార్థులు నిర్వహించిన నిరసన కార్యక్రమానికి జైభీమ్ రావ్ భారత్ పార్టీ అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్ ఒక్కరే మద్దతు ఇవ్వడం జరిగిందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో ఏ ఒక్క రాజకీయ నాయకులు మద్దతు ఇవ్వకపోవడం చాలా దారుణం అని, రాష్ట్రంలో జరుగుతున్న నీచ రాజకీయాలను ఆంధ్రప్రదేశ్ యువత గమనిస్తుందన్నారు. కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలోనిర్వహిస్తున్న 30రకాల కేంద్ర పరీక్షలనిర్వహణలో 25 రకాల పరీక్షలను ఎన్.టి.ఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) నిర్వహిస్తుందన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ఆధ్వర్యంలో 2019 నుండీ ఎన్.టి.ఏ నిర్వహించిన పరీక్షల కోసం ఆరు కోట్ల 50లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. కేవలం 221 మంది ఉద్యోగులు ఉన్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సంస్థకు ఇన్ని కోట్ల మంది విద్యార్థులు పరీక్షలు వ్రాసే భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వం తాకట్టు పెట్టడంపై మల్లికార్జున్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

## శ్రమజీవికి కొండంత కష్టం... ఆపన్నహస్తం అందించి ఆదుకుందాం..





**వి.ఆర్.పురం,జూలై 27,ప్రభాతవార్త** మండల కేంద్రం రేఖపల్లి గ్రామానికి చెందిన శ్రమజీవి, నిరుపేద గిరిజన వాయిజ్య కళాకారుడు కొల్లిబోయిన.వీర రాఘవులు కు ఆరోగ్య రీత్య కొండంత కష్టం ఎదురైంది. గత నాలుగు రోజుల క్రితం హఠాత్తుగా అనారోగ్యానికి గురైన వీర రాఘవులు ను కుటుంబ సభ్యులు తొలుత కూనవరం మండలం, కోతులగుట్ట ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుడికి అన్ని వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యాధికారులు బ్రైన్ స్ట్రోక్ లక్షణాలు ఉన్నాయని గుర్తించి, మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రి తీసుకొని వెళ్లాలని, వైద్యం కోసం ఎక్కువ మొత్తంలో ఖర్చు అయ్యే అవకాశం ఉంటుందని తేల్చి చెప్పారు. దీంతో నిరుపేద కుటుంబమైన బాధిత కుటుంబ సభ్యులు రోగిని కార్పొరేట్ ఆసుపత్రులకు తీసుకొని వెళ్ళే ఆర్థిక స్తోమతలేక తెలంగాణ రాష్ట్రం, భద్రాచలం పట్టణంలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు అదే విధంగా తేల్చి చెప్పారు. దీంతో పలువురు దాతల సహకారంతో అక్కడి నుండి రాజమండ్రి రాజానగరం లోని జి.ఎస్.ఎల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడికి వైద్యులు ఐ.సి.యులో చికిత్స అందిస్తున్నారు. వైద్యానికి అధిక మొత్తంలో ఖర్చు అయ్యే అవకాశం ఉంది. రెక్కాడితేగాని డొక్క నిండని బాధిత కుటుంబం దాతల ఆపన్న హస్తం కోసం ఆర్థిస్తుంది. మనసున్న దాతలు బాధితుడి కుమారుడు దుర్గాప్రసాద్ ఫోన్ పే నెంబర్ 7893467035 కు మీకు తోచిన సహాయం చేసి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. బాధితుడు మన కుటుంబ సభ్యుడిగా భావించి, చేయి చేయి కలిపి మనము మనవంతుగా ఆర్థిక సహాయం చేసి ఒ పేదవాడి నిండుప్రాణాన్ని కాపాడుదాం.

**వీరరాఘవులు పట్ల మానవత్వం చాటుకున్న రేఖపల్లి గ్రామస్తులు.....**

అందరితో అన్యోన్యంగా ఉండే తమ గ్రామస్తుడు వీరరాఘవులు పట్ల రేఖపల్లి గ్రామస్తులు మానవత్రం చాటుకున్నారు. సోమవారం గ్రామంలోని యువకులు వీరరాఘవులు వైద్య ఖర్చుల కోసం ఆపన్నహస్తం అందించాల్సిందిగా, గ్రామస్తులను కోరారు. స్పందించిన గ్రామస్తులు తమ తమ స్థాయిలో ఆర్థిక సహాయం చేశారు. రూ.40 వేల రూపాయలు రావటంతో, ఆసుపత్రి వద్ద ఉన్న రోగి కుమారుడు దుర్గాప్రసాద్ కు ఫోన్ పే ద్వారా అందించారు. ఆపదలో ఉన్న ఒ నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన రేఖపల్లి గ్రామస్తుల ఔదార్యాన్ని పలువురు అభినందించారు.

## మోడరన్ విద్యార్థినికి వండర్ బుక్ రికార్డ్స్‌లో స్థానం



**రామచంద్రపురం,జూలై 27 (ప్రభాతవార్త):** మోడరన్ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని షణ్ముయి ప్రతిష్ఠాత్మక వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది.మే 2న రాజమహేంద్రవరంలోని ఆనం కళాక్షేత్రంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొని ఈ ఘనత సాధించింది.కార్యక్రమంలో 200 మంది కళాకారులు నిర్విరామంగా 12 గంటల పాటు అన్నమాచార్యుల 108 సంకీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు.షణ్ముయిని మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు,అకాడమిక్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి, ప్రధానోపాధ్యాయుడు ఎం.చిట్టిబాబు,ఉపాధ్యాయులు అభినందించారు.ఈ సందర్భంగా షణ్ముయి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని డాక్టర్ జి.వి.రావు ఆకాంక్షించారు.

## ఆదిత్యలో ప్రశాంతంగా ఎ.పి.ఈ.ఎ.పి సెట్ - 2026 ఎగ్జామ్స్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై27,ప్రభాతవార్త.** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో ఎ పి ఈ ఎ పి సెట్ -2026 ఆన్లైన్ ఎగ్జామ్స్ ప్రశాంతంగా ముగిసినట్లు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో. ఛాన్సలర్ డా. ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆదిత్య యూనివర్సిటీ క్యాంపస్ లో ఉదయం 9-00 నుంచి 12-00 వరకు నిర్వహించిన 380 గాను 350 మంది హాజరు కాగా 30 మంది హాజరు కాలేదు. అదేవిధంగా మధ్యాహ్నం 2-00 నుండి 5-00 గంటల వరకు నిర్వహించిన 379 మందికి గాను 356 మంది హాజరు కాగా 23 హాజరు కాలేదు.ఈ ఆన్లైన్ ఎగ్జామ్స్ ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆదిత్య యూనివర్సిటీ పూర్తి ఏర్పాట్లను చేసింది.బస్సు ల ద్వారా బ్యాటరీ వెహికల్స్ ద్వారా విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ ఎగ్జామ్స్ కు చీఫ్ సూపరింటెండ్ గా ఆదిత్య ప్రో.వైస్ ఛాన్సలర్ డా. ఆదిరెడ్డి రమేష్ వ్యవహరించగా,డా.పి.శివ సత్యప్రసాద్,ప్రో.టి.శ్రీనివాసులు, ప్రో.వీర ప్రసాద్ కో.ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

## గుడ్ సీడ్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై27,ప్రభాతవార్త.** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సోదరి వైఎస్ విమలారెడ్డి పుట్టినరోజు సందర్భంగా అమలాపురంలో సోమవారం గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు కుంచే రమణారావు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అమలాపురం హరి మనో వికాస కేంద్రంలో వికలాంగ విద్యార్థుల మధ్య పుట్టినరోజు కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు బిస్కెట్లు కేక్లు పంపిణీ చేశారు .అలాగే పట్టణంలోని పేదలకు ఫుడ్ ప్యాకెట్లను గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు అందజేశారు.ఈ కార్యక్రమాలలో మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్, నేలపూడి సుగంధ కుమార్, పందిరి సుబ్బరాజు,నేరేడుమిల్లి శ్రీనివాసరావు,కుంచే అర్జున్, పరమటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజమండ్రిలో రెండు కోవిడ్ కేసులు

**రాజమహేంద్రవరం సిటీ, జూలై 27( ప్రభాతవార్త).** రాజమహేంద్రవరం జిజిహెచ్ లో సోమవారం నిర్వహించిన కోవిడ్ టెస్ట్ లో ఇద్దరు వ్యక్తులకు పాజిటివ్ నిర్ధారణ అయింది. జిజిహెచ్ లో 14 మందికి రాపిడ్ టెస్టులు చేయగా ఇద్దరు వ్యక్తులకు కోవిడ్ లక్షణాలు ఉన్నాయని వైద్యులు తెలిపారు. రాజమహేంద్రవరం శ్రీరంగం పట్నం చెందిన 29 ఏళ్ల మహిళ కు అలాగే రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవలేశ్వరం కి చెందిన 45 సంవత్సరాల మహిళలకు పాజిటివ్ అయింది. ఆర్టీ పి సిఆర్ టెస్ట్ కోసం కాకినాడ పంపించినట్లు తెలిపారు రెండు రోజుల్లో రిపోర్ట్ రానున్నదని వివరించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

### ఈ-ఆటోలతో మెరుగైన పారిశుద్ధ్యంతో

# బాటు పర్యావరణ పరిరక్షణ : మంత్రి కందుల దుర్గేష్

### తూర్పుగోదావరి జిల్లాలో ఘన వ్యర్థాలసేకరణకు స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ద్వారా 44 ఈ-ఆటోల కేటాయింపు



**రాజమహేంద్రవరంఅర్బన్,జూలై 27)ప్రభాత వార్త)** తూర్పు గోదావరి జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలో ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి నుండి చెత్త సేకరణ ప్రక్రియలను పటిష్టం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా 44 విద్యుత్ తో నడిచే ఈ- ఆటోలను మంజూరు చేసింది. ఒక్కొక్కటి 3,18,400 రూపాయలు చొప్పున 1,40,09,600 రూపాయల విలువైన 44 ఇ-ఆటోలు తూర్పు గోదావరి జిల్లాకు మంజూరు అయ్యాయి. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ లతో కలిసి జిల్లాలోని 11 మండలాల పరిధిలోని 37 గ్రామ పంచాయతీలకు ఈ-ఆటోలను పంప పిణీ చేసి జెండా ఊపి వాటిని ప్రాంభించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేలు ఈ ఆటోలను స్వయంగా నడిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ .. రాష్ట్రంలో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం అన్ని గ్రామాలు, పట్టణాల్లో చురుగ్గా సాగుతోందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ప్రతి నెలా మూడో శనివారం పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వివరించారు. 2047 నాటికి కేంద్ర ప్రభుత్వ 'వికసిత్ భారత్' స్ఫూర్తితో స్వర్ణాంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే తూర్పుగోదావరి జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు 1,40,09,600 రూపాయల వ్యయంతో 44 ఈ-ఆటోలను పంపిణీ చేయడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. వీటిని నియోజకవర్గాల వారీగా రాజమహేంద్రవరం రూరల్ కు 12 , రాజానగరం కు 7, మండపేట కు 4, కొవ్వూరుకు 9, నిడదవోలు కు 8, గోపాలపురం కు 4 కేటాయించడం జరిగిందన్నారు. కాలుష్య నివారణతో పాటు ఆటోలు నడిపే కార్మికులకు లాభదాయకంగా ఉండేలా పెట్రోల్, డీజిల్ వాహనాలకు బదులుగా ఈ-ఆటోలను ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేసారు. ఇంటింటి చెత్త సేకరణలో తడి, పొడి మరియు హానికరమైన చెత్తను వేరుచేయడానికి వీలుగా ఈ ఆటోల్లో ఆరు ప్రత్యేక డబ్బాలను సైతం ఏర్పాటు చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన వాహనాలు సరైన నిర్వహణ లేక మూలనపడిన పరిస్థితి తిరిగి తలెత్తకుండా ప్రస్తుత ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. ఈ-ఆటోల నిర్వహణలో ఏవైనా సాంకేతిక లోపాలు తలెత్తితే తక్షణం పరిష్కరించేందుకు కుప్పం నియోజకవర్గంలో 10 మంది టెక్నోక్రాట్లతో కూడిన ప్రత్యేక బృందాన్ని అందుబాటులో ఉంచారని, అవసరమైతే విజయవాడకు చెందిన సాంకేతిక నిపుణుల సేవలను కూడా వినియోగించుకుంటామని వెల్లడించారు. దీనికి తోడు జల వనరుల కాలుష్యాన్ని అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మురుగునీటి శుద్ధి కర్మాగారాలను (స్టూం) పెద్ద ఎత్తున ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజల పూర్తిస్థాయి భాగస్వామ్యంతోనే ఈ స్వచ్ఛతా కార్యక్రమం విజయవంతమవుతుందని, ప్రజలందరూ అవగాహన పెంచుకుని సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి దుర్గేశ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్ భాస్కర్, డిపిఓ వి. శాంతమణి, ఆయా పంచాయితీల అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కత్తిపూడిలో అభివృద్ధి సంక్షేమంపై ఇంటింటా ప్రచారం



**శంఖవరం జూలై 27 ప్రభాతవార్త** రెండేళ్ళ కూటమి ప్రభుత్వ పాలనలో నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం ప్రతి పేద వర్గానికి అందించడం జరుగుతుందని రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్న శివ పేర్కొన్నారు. శంకవరం మండలం కత్తిపూడి లో స్థానిక శాసన సభ్యులు వరుపుల సత్య ప్రభ ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రెండేళ్ల నమ్మకం--సంక్షేమం, అభివృద్ధి 45 రోజుల ఇంటింటి ప్రచారంలో భాగంగా సోమవారం పద్మనాభ నగర్ పాత కొత్తూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించి గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఎన్నికల హామీల మేరకు అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలను స్థానిక ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా వెన్న శివ, జనసేన పార్టీ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ లు మాట్లాడుతూ గత వైసిపి పాలన వల్ల గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను ఎన్డీఏ కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు అపార అనుభవంతో అనేక పరిశ్రమలు, వ్యాపార పెట్టుబడులతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ సమర్థవంతమైన పరిపాలన అందించడం జరుగుతుందని, స్త్రీలకు ఉచిత బస్సు సౌకర్యం, పిల్లల చదువులకు తల్లికి వందనం ద్వారా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ శ్రీశక్తిని బలోపేతం చేయడం జరుగుతుందని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గాబు కృష్ణమూర్తి కేలంగి జనార్ధన్ , కంద గోవిందు, గాబు శివ కంచి పోయిన శ్రీను, సూర్యరావు ఓరుగంటి పెద్ద కాపు , రౌతు శివ నాయుడు సూరిబాబు పిచ్చెట్టి సత్తిబాబు జనసేన నాయకులు కరణం సుబ్రహ్మణ్యం గాబు సుబ్రహ్మణ్యం పోసిన వెంకటేశ్వరరావు నాయకులు పాల్గొన్నారు

## ఉప్పునీటి చెరువులుగా మారిపోతున్న వరి పొలాలు





**అయినవిల్లి జూలై 27 ప్రభాతవార్త** పచ్చని వరి పొలాలతో నిటారుగా పెరిగే కొబ్బరి తోటలతో నిగనిగలాడే కోనసీమ ఉప్పు నీటి చెరువులుగా మారిపోతుంది ప్రభుత్వం అనుసరిస్తున్న వరి వ్యతిరేక విధానం కారణంగా మంచినీటి చెరువుల తవ్వకాల పేరుతో ఉప్పు నీటి గొయ్యిలుగా వరి పొలాలను మార్చి వేస్తున్నారు ప్రతి సోమవారం అమలాపురం కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ఎందరో వరి పండించే రైతులు లబోదిబోమని గగ్గోలు పెట్టి మావరి పొలాలు నష్టపోతున్నామని ఫిర్యాదులు చేసిన వాటికి స్పందన కరువైంది మూడు పంటలు పండి ఎకరానికి 50 బస్తాలు దిగుబడినిచ్చే సారవంతమైన వరి పొలాలు ఉప్పునీటి చెరువుగా మారిపోతున్నాయి మంచి నీటి చెరువులకి అనుమతులు తీసుకుని బోర్ల ద్వారా భూగర్భ జలాలను తోడేస్తున్న భూగర్భ జల వనరుల శాఖ మత్స్యశాఖ పట్టించుకోవట్లేదని రైతులు ఆరోపిస్తున్నారు ఉప్పునీటి చెరువుల ఏర్పాట్లు కారణంగా మంచినీరు ప్రవహించే పంట బోదుల్లోకి ఉప్పునీరు విడుదల చేయటం పక్క వ్యవసాయం చౌడు మారటం నీరు దిగే డ్రైన్లు వెంబడి చెరువుల ఏర్పాటు వల్ల మురుగునీరు సమస్య ఏర్పడటం వరి పండించే రైతులకు ప్రధాన సమస్యగా మారింది బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం నేదునూరు గ్రామంలో మంచినీటి చెరువుల పేరుతో ఉప్పునీటి బోర్లు దిగొట్టి చెరువులు ఏర్పాటు చేస్తే అక్కడ రైతులు ఫిర్యాదు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి దీనిపై విచారణ చేసి చెరువులను ధ్వంసం చేయాలని మురుగునీరు సమస్యను తొలగించాలని రైతులు కోరుతున్నారు

## సీఎం కార్యక్రమంలో పాల్గొన్న పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

### ఇర్లపల్లిలో విషాదం.. కుటుంబ సభ్యులకు క్షమాపణలు చెబుతూ లేఖ రాసిన విద్యార్థిని



**రంపచోడవరం జూలై 27 ప్రభాత వార్త.** పోలవరం జిల్లా రంపచోడవరం మండలం ఇర్లపల్లిలో విషాద ఘటన చోటుచేసుకుంది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శివాని(14) అనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. మూడు రోజుల క్రితం రంపచోడవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'తల్లికి వందనం' మెగా పిటియం కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో కార్యక్రమంలో పాల్గొంది. కార్యక్రమంలో ముఖ్యమంత్రితో మాట్లాడిన విద్యార్థిని.. భవిష్యత్తులో 'షైనింగ్ స్టార్'గా ఎదిగి, ఆయన చేతుల మీదుగా అవార్డు అందుకోవాలనే తన ఆకాంక్షను వ్యక్తం చేసింది. విద్యార్థిని మాటలకు ముఖ్యమంత్రి స్పందించి, ఆమెతో సెల్ఫీ దిగడంతో పాటు భవిష్యత్తులో తనకు నివేదిక ఇవ్వాలని సూచించారు. అయితే కార్యక్రమం జరిగిన కొద్దిరోజులకే శివాని ఆత్మహత్యకు పాల్పడటంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఎంతో చురుగ్గా, ఉత్సాహంగా కనిపించిన విద్యార్థిని ఆకస్మికంగా ఆత్మహత్యకు పాల్పడటంపై స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనకు ముందు విద్యార్థిని కుటుంబ సభ్యులను ఉద్దేశించి లేఖ రాసింది. తల్లిదండ్రుల కోసం ఎంతో చేయాలని భావించినప్పటికీ, తాను అనుకున్న లక్ష్యాలను సాధించలేకపోయానని, తన పరిస్థితి తనకు తీవ్ర భారంగా అనిపిస్తోందని లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది. తల్లిదండ్రులు, అమ్మమ్మ, అన్నయ్యను ఉద్దేశించి పలు విషయాలు ప్రస్తావిస్తూ.. కుటుంబ సభ్యులంతా కలిసిమెలిసి ఉండాలని, ఎవరూ ద్వేషించుకోవద్దని కోరినట్లు సమాచారం. సమాచారం అందుకున్న రంపచోడవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులు, లేఖలో పేర్కొన్న అంశాలపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

### అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు..

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

### ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి





**రాజవొమ్మంగి, జూలై 27, ప్రభాతవార్త** అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు.. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం చిన్నయ్యపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం ఘనంగా జరిగింది. సోమవారం నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం -- సంక్షేమం, అభివృద్ధిపై ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు, గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్ వంటి పథకాల అమలును వివరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జడ్డంగి... చిన్నయ్యపాలెం, సింగంపల్లి రహదారి సమస్యను పరిష్కరించాలని పార్టీ శ్రేణులు, గ్రామస్తులు ఎమ్మెల్యేని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, సీనియర్ నాయకులు గణజాల తాతారావు,జనసేన మండల పార్టీ అధ్యక్షులు బొదిరెడ్డి త్రిమూర్తులు,మాజీ సర్పంచ్ కోపూరి రత్నం , మండల తెలుగు యువత అధ్యక్షులు బారంగి అనుదీప్, అరకు పార్లమెంట్ తెలుగు యువత నాయకులు చెక్కా పండు బాబు , బూత్ ఇంచార్జ్ చవల కుమార్ బాబు, ఎలిసెట్టి అప్పన్న, తోట వీరబాబు, జడ్డంగి తెలుగు మహిళ అధ్యక్షురాలు సాగిన చిన్నమ్ములు, రేలంగి శ్రీను, దబ్బా దివాకర్, గూడెం సీత, పూజారి సత్యవతి, పందిరి చిన్న బ్బాయి, చలుమర్తి బన్ను, ముర్ల వీరబాబు, రెడ్డి వెంకటరమణ, ఎలిసెట్టి భద్రం, మంత్రిప్రగడ రాజారావు, కుంజం ప్రకాశం, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు. జడ్డంగి ఇన్ ఛార్జి ఎస్. ఐ. వెంకట్రావు ఆధ్వర్యంలో ఏ. ఎస్. ఐ. సురేష్ కుమార్, సుబ్బారావు, శాస్త్రి, విజయలక్ష్మి, నాగమణి, అ. పి. ఎస్. పి. విధులను నిర్వహించారు.

## కలియుగ దైవం...ఏడువారాల వెంకన్న..

### నిత్యాన్న పథకానికి రూ,1,లక్ష,విరాళం...







**ఆత్రేయపురం, జూలై 27,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం సోమవారం వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. ఏడు వారాల నోము పూర్తి అయిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజలలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. ధవళేశ్వరం కు చెందిన కూచిభొట్ల సుశీల, వారి కుటుంబ సభ్యులు, నిత్యాన్నప్రసాద పథకానికి రూ 100000/- విరాళం అందజేశారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు లు శ్రీ స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలను, అందజేశారు భక్తులు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.

# 'ఏలేరు'.. పిఠాపురం రైతుల 'కన్నీరు'

### రైతులు, అధికారుల మధ్య వాగ్వివాదం
### రైతులపై కుట్ర చేస్తున్నారంటూ ఆగ్రహం

**పిఠాపురం, జూలై 27 ( ప్రభాతవార్త)** ఏలేరు... పిఠాపురం రైతులకు కన్నీరు పెట్టిస్తోంది. ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, అధికారుల అలసత్వం, కారణంగా సార్వసాగు ఆలస్యం కావడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. శివారువాయకట్టుగా ఉన్న పిఠాపురం నియోజకవర్గానికి ఈ నీరే జీవనాధారం, వరదలు వస్తే పంటలు మునిగిపోవడం, కరువు వస్తే ఎండిపోవడం జరుగు తోంది. ఏలేరు జలాశయంలోని నీటి ఆధారంగా జగ్గంపేట, పెద్దాపురం, తుని, ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాలలో గల 53 వేల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. ఈ జలాశయం నుంచే నిరంతరంగా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ తో పాటు పట్టణ ప్రజలకు తాగునీటిని అందిస్తున్నారు. ఏలేరు జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 24. 11 టిఎంసిలు గా వుంది, ప్రస్తుతం 8.3 టీఎంసీల నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయి. 6.16 టీఎంసీల డెడ్ స్టోరేజ్ కంటే తక్కువ ఉంటే జలాశయం నుంచి మీరు బయటకు వచ్చే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం జూన్ మొదటి వారం నాటికే ఏలేరుజలాశయం నుంచి నీటిని విడుదల చేసేవారు. రైతులు నారుమడు లు వేసి జులై మొదటి వారానికి వరి నాట్లు పూర్తి చేసేవారు. అయితే ఈ పరిస్థితులలో రైతులు నారుమడులు వేసే పరిస్థితులు కనిపించడం లేదు.



ఎన్నికల ముందు ఏలేరు ఆధునీకరణ చేపడుతామని హామీ ఇచ్చిన కూటమి పార్టీ నాయకులు, ఎన్నికలలో గెలిచాక హామీని మరచిపోయారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో సోమవారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఫైవ్ మాన్ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేపెం డెం దొరబాబు, తుమ్మల రామస్వామి బాబు, ఓదూరి కిషోర్, సారథ్యంలో రైతులు, నీటి సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో అధికారులు సాగునీటి విడుదలపై దాటవేతధోరణి అవలంబించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న2027లో ఏలేరు ప్రాజెక్టులో ఐదున్నర టీఎంసీల నీటి నిల్వ ఉండగా పిఠాపురం ఆయకట్టుకు సాగునీరు పుష్కలంగా అందించడం జరిగిందన్నారు. దీంతో సహనం కోల్పోయిన రైతులు, నీటి సంఘాల అధ్యక్షులు మాట్లాడుతూ ఏలేరు కాలువకు అడ్డుగా ఎర్రిపాక సమీపంలో సీసీ రోడ్డు నిర్మించి దిగువకు నీరు రాకుండా చేశారని ఆరోపించారు. నీటి సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ కంచి రామన్న పంతులు డైరీ ప్రకారం కిర్లంపూడి, పెద్దాపురం పిఠాపురం ఆయకట్టుకు వంతుల వారి విధానంలో నీరు అందించాలని డిమాండ్ చేశారు. జగ్గంపేట నియోజకవర్గంలో రామన్న పంతులుడైరీలో లేని అనధికారాయకట్టుకు సాగునీరు అందిస్తున్నారని, దీని కారణంగా శివారు ఆయకట్టుకు మీరు చేరడం లేదని



ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు నీటి సరఫరా పేరుతో మధ్యలో 25 వేల ఎకరాల అనధికార ఆయకట్టుకు నీటి చోరీ చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు సమాధానం చెప్పాలని రైతులు పట్టుపట్టారు,. పిఠాపురం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గం కావడంతో కొంతమంది ప్రజా ప్రతినిధులు, అధికారులు కుమ్మక్కై కుట్ర చేసి రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. జగ్గంపేట, పెద్దాపురం నియోజక వర్గాలకు నీరిచ్చి పిఠాపురం రైతులకు అన్యాయం చేస్తున్నారని, ప్రాజెక్టు ఎస్. ఇ,జి శ్రీనివాస్, ఇ.ఇ, శేషగిరిలపై రైతులు మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ తమకు న్యాయం చేస్తారని ఈ సందర్భంగా రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో మాజీ ఎమ్మెల్యే దొరబాబు, తుమ్మల రామస్వామి బాబు, ఓదురి కిషోర్ కలెక్టర్ తో చర్చించేందుకు వెళ్లారు. జిల్లా కలెక్టర్ హరేంద్రప్రసాద్ తో మాజీ ఎమ్మెల్యే దొరబాబు, తుమ్మల రామస్వామి బాబు, ఓదూరి కిషోర్ కాకినాడలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులు, నాయకులతో సమీక్షించి, ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు.

## ఇల్లు నిర్మించి మా జీవితాలలో
# ఆనందాన్ని నింపారు
### కుడుపూడి శివన్నారాయణ.




**తాళ్ళరేవు, జులై 27 (ప్రభాతవార్త):** అగ్ని ప్రమాదంలో ఇల్లు బూడిదై సర్వం కోల్పోయిన బాధితులకు పక్కా ఇల్లు కట్టించి ఇచ్చి వారి జీవితంలో కొత్త వెలుగులు నింపారు, పి. మల్లవరం మాజీ సర్పంచ్, ముమ్మిడివరం ఎ ఎమ్ సి మాజీ ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ. మండలంలోని పి. మల్లవరం పంచాయతీ రాంజీ నగర్ లో 2023 మే నెలలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదు తాటాకు ఇల్లు దగ్ధమై ఆ కుటుంబాలు వీధిన పడ్డాయి. పరామర్శించడానికి వచ్చిన నేతలు అందరూ మాటలు చెప్పి వెళ్లిపోతే.... శివన్నారాయణ మాత్రం పక్కా భవనాలు నిర్మించి ఇస్తానని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట తప్పకుండా ఆ ఐదు కుటుంబాలకు ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. అగ్ని ప్రమాద బాధితుల్లో ఒక కుటుంబమయిన కోరమ్ రవి, స్వర్ణలత దంపతుల నూతన గృహం పూర్తి కావడంతో శివన్నారాయణ, ఆయన సతీమణి నాగమణితో కలిసి సోమవారం ప్రారంభించారు. తమ ఇంటి నిర్మాణానికి సహకారం అందించిన శివన్నారాయణకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన నాలుగు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామని ఈ సందర్భంగా కుడుపూడి తెలిపారు. రాంజీ నగర్ గ్రామస్తులు తనపై నిరంతరం చూపే ప్రేమాభిమానాలు వెలకట్టలేనివని శివన్నారాయణ ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక చర్చి పాస్టర్, రాంజీ నగర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## రహదారులను మధ్యలో
# తవ్వే అధికారం మీకెవరిచ్చారు?..
### మాజీ సర్పంచి భర్త పై ఎమ్మెల్యే "గిడ్డి" ఆగ్రహం..



**అంబాజీపేట, జులై 27,(ప్రభాతవార్త):** ప్రజలకు ఉపయోగపడుతూ వినియోగంలో ఉన్న రహదారులను మధ్యలో తవ్వే అధికారం మీకెవరిచ్చారని, నిధులు లేకుండా అండర్ డ్రైనేజీ పనులు ఎలా మొదలు పెట్టారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాజీ సర్పంచ్ భర్త పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెం శ్రీ వెంకటేశ్వర స్ట్రీట్ లో సీసీ రోడ్డు మధ్యలో అండర్ డ్రైన్ నిర్మించే నిమిత్తం తవ్వకాల వల్ల స్థానిక నివాసితులు ఇబ్బందులకు గురికావడంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తవ్వేసిన రహదారిని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సోమవారం స్వయంగా పరిశీలించి ఎంపీడీవో బి.మమతను నిలదీశారు. మండల పరిషత్ కు తెలియకుండా పంచాయతీ వారే తవ్వేసారని దీంతోపాటు మాచవరం గ్రామ పంచాయతీ పరిధిలో పలుచోట్ల ఇదే పరిస్థితి ఉందని ఎంపీడీవో ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 2 నాటికి సర్పంచుల పదవీకాలం పూర్తి అవుతుందన్న తొందరలో పంచాయతీలో నిధులు లేకపోయినా అండర్ డ్రైన్లు నిర్మించాలనే ఆత్రంతో బాగున్న రోడ్లు పాడు చేశారని ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో మాజీ సర్పంచ్ భర్త తీరుపై ఫోన్లో మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు లేకుండా రోడ్లు ఇలా ఎందుకు పాడు చేశారని, మీకు ఎవరు అధికారం ఇచ్చారని నిలదీశారు.మీ తొందరపాటు పనుల వలన ప్రజలు నన్ను నిలదీస్తున్నారని, మీ పైన, కాంట్రాక్టర్ పైన చర్యలు తీసుకోమని సిఫార్సు చేస్తానని తీవ్రంగా హెచ్చరించారు. త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక నివాసితులకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ హామీ ఇచ్చారు.

# విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి
### శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమంలో చేతన ఆనంద్



**పెద్దాపురం జూలై 27 (ప్రభాత వార్త )** విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని అర్జున అవార్డు గ్రహీత, జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో నాలుగు సార్లు విజయం సాధించిన బి. చేతన్ ఆనంద్ అన్నారు. పెద్దాపురం రామారావు పేట శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో వివిధ రంగాలలో నైపుణ్యాలను సాధించిన విద్యార్థుల "అభినందన" కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన చేతన్ ఆనంద్ విద్యార్థులను, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఒక్కటే ముఖ్యం కాదని వారు అన్ని రంగాలలోను నైపుణ్యాన్ని సాధించాలని, కనీసం ఏదో ఒక క్రీడను అలవాటుగా ఆడాలని అప్పుడే అన్ని విషయాలలో చురుకుగా వుంటారని పేర్కొంటూ చదువుతో పాటు అన్ని రంగాలలో శిక్షణ ఇస్తున్న శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాల వంటి పాఠశాలలు నేటి తరానికి చాలా అవసరం అని పేర్కొన్నారు. శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాల డైరెక్టర్ శ్రీ విజయ్ ప్రకాష్ మాట్లుడుతూ విద్యార్థులు ఏ రంగంలో రాణించాలన్నా దానికి ముఖ్య కారకులు తల్లిదండ్రులని, విద్యార్థులందరు తమ తల్లిదండ్రులు సూచించిన మార్గంలో ప్రయాణిస్తూ అభివృద్ధి చెందాలని అయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిక అయిన విద్యార్థులు ముఖ్య అతిథి ఆనంద్,విజయ్ ప్రకాష్ గారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, ఒక యోగి ఆత్మకథ వంటి పుస్తకాలతో వివిధ కథల పుస్తకాలు, అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ యమ్.వి.వి.యస్ మూర్తి, ప్రొఫెసర్ సంతానం పాఠశాల అకడమిక్ కోఆర్డినేటర్ ప్రశాంతి, మీడియా కోఆర్డినేటర్, ఉషా చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కు
## ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**పి. గన్నవరం, జూలై 27, ప్రభాతవార్త** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి. గన్నవరం మండలం ప్రభుత్వ వైద్యశాలలో భారతరత్న, మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, "మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా" డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా పి. గన్నవరం నియోజకవర్గం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ వారి విగ్రహానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పి. గన్నవరం ప్రభుత్వ వైద్యశాలకు రూ.2.80 లక్షల విలువైన ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన ఆధునిక వైద్య పరికరాలను అందజేశారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆ పరికరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులను అభినందిస్తూ, ఈ పరికరాల ద్వారా ప్రభుత్వ వైద్యశాలలో మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, జనసైనికులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కు ఘన నివాళులు అర్పించారు.

# జాతీయరహదారిపై త్రుటిలో తప్పిన లారీ ప్రమాదం
### ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని స్థానికుల విజ్ఞప్తి



**రావులపాలెం, జులై 27 (ప్రభాతవార్త) :** రావులపాలెం కళావెంట్రావు జంక్షన్‌లో ఆదివారం అర్ధరాత్రి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. కలకత్తా నుంచి భీమవరం వైపు పైపుల లోడుతో వెళ్తున్న ఏపీ 39 టీఎన్ 3689 నంబర్ లారీ, ఎదురుగా వచ్చిన మరో వాహనం ఒక్కసారిగా క్రాస్ కావడంతో లారీ అదుపుతప్పి హైవే మధ్యలోని డివైడర్‌ను ఢీకొని పైపుల లోడుతోనే రోడ్డుపై తిరగబడింది. ఈ ప్రమాదంలో



డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు కాగా, ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. నిత్యం వందలాది మంది ప్రజలు, వాహనాలు రాకపోకలు సాగించే ప్రాంతంలో అర్ధరాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకున్నప్పటికీ పెద్ద ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. బస్టాండ్ ఇన్ గేట్ ఎదురుగా జంక్షన్ మూసివేతతో తలెత్తుతున్న ఇబ్బందులు కళావెంట్రావు జంక్షన్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసి ఉంటే ఇలాంటి ఘటనలు నివారించవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. బస్టాండ్ ఎదురుగా హైవేలోని క్రాసింగ్‌ను సిమెంట్ దిమ్మలతో మూసివేయడంతో వాహనాలన్నీ కళావెంట్రావు జంక్షన్ వద్దే దాటాల్సి వస్తోందని, దీంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కాలినడకన రోడ్డు దాటే వారికి ఎప్పటికప్పుడు ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న రావులపాలెం సీఐ జి. రమేష్‌బాబు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాలను సర్వీస్ రోడ్డు గుండా మళ్లించారు. అనంతరం లారీని తొలగించి హైవేపై రాకపోకలను సాధారణ స్థితికి తీసుకొచ్చారు.

## అభివృద్ధి, సంక్షేమమే
# కూటమి ప్రభుత్వం లక్ష్యం..
### టిడిపి జిల్లా అధ్యక్షుడు సాయి..
**రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి సంక్షేమంపై కూటమి ప్రభుత్వం ఇంటింటి ప్రచారం..**



**అబాజీపేట, జూలై 27, (ప్రభాతవార్త):** అభివృద్ధి,సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అధ్యక్షులు గుత్తుల సాయి అన్నారు. విధ్వంసం నుండి వికాసం వైపు పరుగులు పెడుతున్న కూటమి ప్రభుత్వం పాలన రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఇంటింటి కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని అంబాజీపేట మండలంలో సోమవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా మండలంలో మూడు క్లస్టర్ల పరిధిలో యూనిట్ యూనిట్ ఇన్చార్జులు, పోలింగ్ బూత్ ఇన్చార్జిలు, కెఎస్‌ఎస్ లు, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శుల ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. అంబాజీపేట క్లస్టర్ 007 ఇన్చార్జి గణపతి వీర రాఘవులు ఆధ్వర్యంలో మాచవరం గ్రామపంచాయతీ పరిధిలోని 110 బూత్ లో జిల్లా పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు గుత్తుల సాయి, గంధం పల్లంరాజు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీని నూరు శాతం అమలు జరిపామని, పింఛన్లు, గృహ నిర్మాణ రుణాలు త్వరలో అందజేస్తామని తెలిపారు. రెండేళ్ల కాలంలో 70 శాతం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామని, మిగిలిన మూడేళ్ల ప్రభుత్వ కాలంలో మరిన్ని అభివృద్ధి,సంక్షేమ పథకాలు చేస్తామని, మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ఐదేళ్లు వైసిపి ప్రభుత్వం అసంబద్ధ నిర్ణయాలతో రాష్ట్రం అధోగతి పాలయ్యిందని గుత్తుల సాయి తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు మాట్లాడుతూ ఇంటింటా కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అందరూ పాల్గొని విజయవంతంగా పూర్తి చేయాల న్నారు.అనంతరం పి గన్నవరంలోని పలు గ్రామాల్లో చేపట్టిన ఇంటింటి ప్రభుత్వం కార్యక్రమంలో సాయితో పాటు పల్లంరాజు పాల్గొన్నారు. అలాగే పుల్లేటికుర్రు క్లస్టర్ 009 ఇంచార్జి దాసరి వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు అరిగెల బలరామమూర్తి, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గూడాల ఫణి, రవణం రాము,డొక్కా నాథ్ బాబు, దొమ్మేటి వెంకట రామారావు, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, పబ్బినీడి రాంబాబు,జోగి కృష్ణ చైతన్య, కొప్పినీడి ఈశ్వరరావు, దొమ్మేటి శ్యామ్, నాగవరపు అన్నవరం, మట్టపర్తి శ్రీనివాసరావు, అడబాల సుబ్బరాజు, నేదునూరి రాజకుమార్, మట్టపర్తి శ్రీనివాసరావు,దుర్గా శ్రీనివాసరావు,అంబటి మణికంఠ,గుత్తుల సురేష్ తదితరులు పాల్గొన్నారు

## ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం
### ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు



**పెద్దాపురం జూలై 27 (ప్రభాత వార్త )** ఇంటింటా కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప డిసిసిబి అధ్యక్షులు తుమ్మల బాబు పిలుపునిచ్చారు. మండలం లోని తిరుపతి గ్రామంలో సోమవారం "ఇంటింటికి కూటమి ప్రభుత్వం" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు పాల్గొని గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, పరిపాలనలో తీసుకొచ్చిన పారదర్శకత గురించి వివరించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత, యువత ఉపాధి వంటి రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.అదే విధంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, పరిపాలనలో చోటుచేసుకున్న లోపాలు, అభివృద్ధి పనులు నిలిచిపోవడం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పడిన ప్రభావాన్ని ప్రజలకు వివరించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందించడం, ప్రజల సొమ్మును ప్రజల అభివృద్ధికే వినియోగించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తోందని నాయకులు పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, రైతుల సంక్షేమం, మహిళల ఆర్థిక సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు విశేష స్పందన వ్యక్తం చేశారు. నాయకులు నేరుగా తమ ఇళ్లకు వచ్చి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తామని తెలిపారు. అలాగే ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హులకూ చేరేలా ప్రజలు భాగస్వాములు కావాలని వాటు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మొయిళ్ల కృష్ణమూర్తి, ఎలిశెట్టి నాని, నూనె రామారావు, కందుల విశ్వేశ్వరరావు, రేలంగి బుజ్జి, కొమ్మిరెడ్డి బుజ్జి, స్థానిక ప్రజాప్రతినిధులు, జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కూటమి కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## టిడిపి ఇంటింటి ప్రచారం ప్రారంభం



**రామచంద్రపురం,జూలై 27 (ప్రభాతవార్త):** కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే 45 రోజుల ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా కూటమి పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ఎన్నికల హామీల మేరకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,తల్లికి వందనం మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు,అన్నదాత సుఖీభవ వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఉండవల్లి శివ,జాస్తి విజయలక్ష్మి, చందమామ వాసు,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## రాజమహేంద్రవరం వద్ద
# జలకళ సంతరించుకున్న గోదావరి

**రాజమహేంద్రవరంఅర్బన్,జూలై27(ప్రభతావార్త)** రాజమహేంద్రవరం వద్ద గోదావరి నది జలకళ సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు భారీగా చేరుతుండటంతో ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం తూర్పు, పశ్చిమ, సెంట్రల్ డెల్టా కాలువలకు సుమారు 15 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు పూర్తిస్థాయిలో విడుదల చేస్తున్నారు. అలాగే బ్యారేజీ ద్వారా సుమారు 1 లక్ష 3 వేల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. వరద ప్రవాహాన్ని నియంత్రించేందుకు ధవళేశ్వరం బ్యారేజీలోని 161 గేట్లను 0.20 మీటర్ల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గోదావరిలో వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో బ్యారేజీ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా చర్యలు చేపడుతున్నారు.

## మత్తు వద్దు - భవిష్యత్తే ముద్దు
## పల్లె సీమల్లో గంజాయిపై ఈగల్ సమరం




**అడ్డతీగల, జూలై 27, ప్రభాతవార్త** ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు అనూప్ జూనియర్ కళాశాలల్లో సోమవారం 'పల్లెబాటలో ఈగల్' కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్, గంజాయి వినియోగం మరియు వాటి దుష్పరిణామాలపై విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. ఐ.జి.పి. శ్రీ ఆకే రవి కృష్ణ, ఐ పి ఎస్ ( ఐ జి పి ఈగల్)ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఆపరేషన్ చైతన్యం, ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్, జాయింట్ ట్రైన్ ఆపరేషన్ మరియు ఆపరేషన్ వజ్ర ప్రహార్ వంటి ఈగల్ చేపడుతున్న వివిధ విభాగాలు, వాటి ప్రాముఖ్యత మరియు ఈగల్ క్లబ్స్ బాధ్యతల గురించి సవివరంగా తెలియజేశారు.గంజాయి మరియు ఇతర డ్రగ్స్ దుర్వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం ఎలా దెబ్బతింటుందో,అలాగే నేరచరిత్ర నమోదు కావడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాలను అధికారుల బృందం ఉదాహరణలతో వివరించింది.గంజాయి సరఫరా లేదా వినియోగానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే 1972టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. దేశానికి యువతే అసలైన బలమని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ స్థిరమైన లక్ష్యాలను ఏర్పరచుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఈగల్ ఇన్స్పెక్టర్ పీ.వీ. సూర్య మోహన్ రావు, అడ్డతీగల సర్కిల్ ఇన్స్పెక్టర్ గజేంద్ర కుమార్, ఎస్ ఐ బి.వినోద్, ఈగల్ టీమ్ సభ్యులు మధు, వీరబాబు, రాజు స్థానిక పోలీస్ సిబ్బంది, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపక బృందం మరియు సుమారు 250 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## 78 లక్షల వ్యయంతో నిర్మించనున్న మొండెపులంక--వాడ్రేవుల్లి గ్రావెల్ రోడ్డుకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శంకుస్థాపన



**పి. గన్నవరం, జూలై 27, (ప్రభాతవార్త )** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, నాగుల్లంక గ్రామపంచాయతీ పరిధిలోని మొండెపులంక--వాడ్రేవుపల్లి గ్రామాల మధ్య వశిష్ట ఎడమ ఏటుగట్టుపై 78 లక్షల వ్యయంతో 4.5 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న గ్రావెల్ రోడ్డుకు పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, మొండెపులంక--వాడ్రేవుపల్లి గ్రామాల ప్రజలు ఈ రహదారి నిర్మాణం కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని. నేడు ఈ రహదారికి శంకుస్థాపన చేయడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు.ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు

# హుస్సేన్ జిందాబాద్ వాక్



**మామిడికుదురు.జూలై 27(ప్రభాతవార్త)** నగరం గ్రామంలోని పంజేషా నుండి పాశర్లపూడి గ్రామంలోని బీబీ ఫాతెమా జహెరా దర్గా వరకు వేలాది మంది ముస్లింలు ఆదివారం రాత్రి హుస్సేన్ జిందాబాద్ వాక్ ను నిర్వహించారు. ఈ పాదయాత్రలో స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది ముస్లింలు పాల్గొన్నారు.దీంతో నగరం నుంచి పాశర్లపూడి వరకు జాతీయ రహదారి 216 కోలాహలంగా మారింది. మొహర్రం సంతాప కార్యక్రమాల్లో భాగంగా ప్రతీ ఏడాది ఇరాక్ లోని నజఫ్ పట్టణం నుంచి కర్బలా వరకు సుమారు 95 కిలోమీటర్లు లక్షలాది మంది ముస్లిం భక్తులు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ (రౌజా)సమాధిని దర్శించుకోవడానికి కాలినడకన వెళ్తారు. అక్కడ జరిగే ఆ పాదయాత్రకు అనుగుణంగా ఇక్కడ కూడా పాదయాత్ర నిర్వహిస్తున్నారు.ఖాసిం మొహమ్మద్ రజా(రజ్వి)పర్యవేక్షణలో ఈ వాక్ జరిగింది.పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఈ వాక్ లో పాల్గొన్నారు. పాదయాత్రలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.పాదయాత్ర చేస్తున్న భక్తులకు స్థానిక భక్త బృందాలవారు దారిపొడఉనా ప్రసాదాలను పంపిణీ చేశారు.పలువురు హిందువులు కూడా ప్రసాదాలను పంచి మత సామరస్యాన్ని చాటుకున్నారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ భీమరాజు పర్యవేక్షణలో నగరం ఎస్ఐ ఎ.పద్మారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## ఓ. టి. పి. చెప్పి మోస పోవద్దు..
## సి. ఐ. సన్యాసినాయుడు


**రాజవొమ్మంగి, జూలై 27, ప్రభాతవార్త** డబ్బులు వస్తాయని ఓ. టి. పి. నెంబర్ చెప్పాలని వచ్చే ఫోన్ కాల్స్ కు స్పందించి మోసపోవద్దని రాజవొమ్మంగి సి. ఐ. సన్యాసినాయుడు ప్రజలకు అవగాహనను కల్పించారు. రాజవొమ్మంగి పంచాయితీ సూరంపాలెం గ్రామంలో సోమవారం సాయంత్రం ఎస్. ఐ. వెంకట్రావు ఆధ్వర్యంలో సి. ఐ. సన్యాసినాయుడు మహిళా చట్టాలు, శక్తి యాప్ పై అవగాహనను కల్పించారు. సైబర్ నేరాలపై వివరించారు. గంజాయి వలన జరిగే దుష్పరిణామాలు తెలిపారు. పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పదంలో ఆంధ్రప్రదేశ్
### ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి



**రాజమహేంద్రవరం అర్బన్, జూలై27(ప్రభాతవార్త)** అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం మెరుగైన పరిపాలన, అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. రూరల్ మండలం హుకుంపేట పంచాయతీ డి-బ్లాక్‌లో సోమవారం నిర్వహించిన "కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాలు -- డోర్ టు డోర్" కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే స్థానికుల సమస్యలను స్వయంగా తెలుసుకొని వాటి వివరాలను టెలిగ్రామ్ బాట్‌లో నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత రెండేళ్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.2,000 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు వెల్లడించారు. హుకుంపేట గ్రామంలో రూ.12 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో ఇప్పటికే అనేక పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ మార్ని వాసుదేవ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్ర వేణుగోపాల్ రాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు మత్స్యేటి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి మజ్జి పద్మావతి, మద్దా మణి, పిల్ల తనుజ, దుద్దుపూడి రమేష్, బొప్పన నానాజీ, పెండ్యాల రామకృష్ణ, గారపాటి నాగేశ్వరరావు, సోమేశ్వరరావు, అల్లూరి నరసింహారాజు, మట్ట శ్రీను, కసిరెడ్డి దుర్గాప్రసాద్, కోటిపల్లి చంద్రశేఖర్, హీరా సింగ్, కొల్లి దుర్గాప్రసాద్, ఇమంది శివరామకృష్ణ, తిరుపతి రాము, చాముండ్రి నాని, బొప్పన నాగేశ్వరరావు, మార్ని దొరబ్బాయి, నిచ్చెనకోళ్ల సత్తిబాబు, బైరెత్తి సరోజినీ దేవి, అవినాష్, చక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'సంగిశెట్టి' సేవలు కొనసాగిస్తాం




**పిఠాపురం, జూలై 27 ( ప్రభాతవార్త )** పిఠాపురం మాజీ ఎమ్మెల్యే సంగిశెట్టి వీరభద్రరావు నియోజకవర్గ అభివృద్ధికి, పేద ప్రజల అభ్యున్నతికి చేసిన సేవలను కొనసాగిస్తామని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆయన కుమార్తె తోట జానకి అధ్యక్షతన స్వగ్రామం బి కొత్తూరులో సోమవారం 22వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అభిమానులు సంగిశెట్టి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం మాజీ జడ్పిటిసి సభ్యుడు జవ్వాది కృష్ణమాధవ రావు, పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సంగిశెట్టి వెంకటేశ్వరరావు, బి. కొత్తూరు మాజీ సర్పంచ్ చెక్క చినబాబు, కొత్తపల్లి బుజ్జి, రెడ్డెం భాస్కర్ రావు, సంగిశెట్టి రాంబాబు,కూరాకుల చిట్టిబాబు, బొలిశెట్టి రామ జోగి, లోకా రెడ్డి రామకృష్ణ, రాయపు రెడ్డి రాజా, తాతపూడి నాగేశ్వరరావు,మెర్నీడి చంటిబాబు, దుడ్డు రాంబాబు, చీకట్ల సత్తిబాబు, గుండుబిల్లి కాశి, మాస వీరబాబు,తదితరులు పాల్గొన్నారు.

# రీసర్వేను పక్కాగా పూర్తి చేయాలి
### జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్



**రంపచోడవరం, జూలై 27:ప్రభాతవార్త.** పోలవరం జిల్లాలోని 12 మండలాల్లో 'మీ భూమి--మీ హక్కు' భూ రీసర్వేను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పక్కాగా నిర్వహించి, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో సర్వే అధికారులు, 12 మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రోవర్ పరికరాలు, డ్రోన్ ద్వారా సేకరించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖచ్చితత్వాన్ని నిర్ధారించాలన్నారు. భూ సరిహద్దులు, సర్వే నంబర్లు, రికార్డులు, వాస్తవ పరిస్థితులు సరిపోలేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతుల అభ్యంతరాలు, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. దశ--1, దశ--2లో పెండింగ్‌లో ఉన్న భూముల రీసర్వేను వేగవంతం చేసి, ఆగస్టు నెలాఖరుకు గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేయాలని తెలిపారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు 'మీ భూమి--మీ హక్కు' పట్టాలు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్, రంపచోడవరం ఆర్డీఓ కె. స్వాతి, సర్వే సహాయ సంచాలకుడు ఎం. శ్రీనివాసరావు, తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## భోగాపురం సభ నేపథ్యంలో రెండు రోజుల పాటు పలు ఆర్టీసీ సర్వీసులు రద్దు



**రావులపాలెం, జూలై 27 (ప్రభాతవార్త) :** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆగస్టు 1న నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు విజయనగరం జోన్ పరిధిలోని ప్రజలను తరలించేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను కేటాయించింది. దీంతో జూలై 31, ఆగస్టు 1 తేదీల్లో రావులపాలెం డిపో పరిధిలోని పలు సాధారణ బస్సు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేసినట్లు డిపో మేనేజర్ వై.వి.వి.ఎన్. కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజుల్లో ప్రయాణికులు అత్యవసరమైతే తప్ప తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ఆయన కోరారు. అలాగే వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లే భక్తులు కూడా బస్సు సర్వీసుల రద్దును దృష్టిలో ఉంచుకుని తమ యాత్రను ప్రత్యామ్నాయ తేదీలకు మార్చుకోవాలని సూచించారు. ప్రయాణికులు ముందస్తుగా ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు చేసుకుని ఆర్టీసీకి సహకరించాలని ఆయన కోరారు.

## అర్హులైన తెలగా విద్యార్థులకు ఆర్థిక సహాయం



**మామిడికుదురు. జూలై 27(ప్రభాతవార్త)** అర్హులైన తెలగా విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించాలని సోమవారం మామిడికుదురులో జరిగిన ది రాజోలు తాలూకా తెలగా ఉద్యోగుల సంక్షేమ సంఘం మండలశాఖ సమావేశంలో తీర్మానించారు.కార్యవర్గ సమావేశంలో ఈ అంశంపై ప్రముఖంగా చర్చించారు.2025-26 విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబర్చిన ఆర్థికంగా వెనుకబడిన ఇంటర్మీడియట్ నుండి డిగ్రీ స్థాయి విద్యార్థులు ఈ ప్రోత్సాహాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.మామిడికుదురులోని వాసు బుక్ స్టాల్ లో దరఖాస్తులు లభిస్తాయన్నారు.పూర్తి చేసిన దరఖాస్తులను అవసరమైన ధృవపత్రాల నకల్లు జతచేసి ఆగస్టు 15 తేదీ లోపులో అందజేయాలన్నారు.ఇతర వివరాలకు సంఘం అధ్యక్షులు యెరుబండి నాగేశ్వరరావు(98499 23600),కార్యదర్శి చిక్కం రవికుమార్ (94921 40886)నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మరిన్ని వార్తలు 6లో

# అండర్-17 క్రికెట్లో రాష్ట్రస్థాయికి గోపాలపురం హైస్కూల్ విద్యార్థుల ఎంపిక



గోపాలపురం, జూలై 27 (ప్రభాతవార్త): తూర్పుగోదావరి జిల్లా కొత్తకొలుమూరులో నిర్వహించిన అండర్-17 టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో గోపాలపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటుతూ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఎనిమిదో తరగతి విద్యార్థిని టి. నక్షత్ర, పదో తరగతి విద్యార్థులు ఎస్. బాల శశి, జి. సత్యప్రకాశ్ అత్యుత్తమ ఆటతీరుతో స్టేట్ మీట్‌కు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. వెంకట కనక పద్మ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు ఆగస్టు 8, 9 తేదీల్లో బాపట్లలో జరగనున్నాయని, ఈ ముగ్గురు విద్యార్థులు అందులో పాల్గొంటారని ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడలు ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా మానసిక వికాసం, జ్ఞాపకశక్తి పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్య, క్రీడలు విద్యార్థులకు రెండు కళ్ల వంటివని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారులు జి. శ్రీనివాసరావు, ఎ. మహేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు అభినందించి, రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు డి. అశోక్, టి. సురేష్, ఇ. రత్నరాజు, సీఆర్పీ కొయ్య నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్థిక సంక్షోభంలో ఆంధ్రప్రదేశ్..

**అన్ని రంగాల్లో విఫలమైన కూటమి ప్రభుత్వం..మాజీ మంత్రి కురసాల**



కొవ్వూరు రూరల్, జూలై 27,(ప్రభాత వార్త): సంపద సృష్టిస్తాం అని అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని, రాష్ట్రంలో అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైందని, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆరోపించారు. రమణయ్యపేట లో స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కన్నబాబు విలేకరులతో మాట్లాడుతూ పండించిన పంటలకు మద్దతు ధర లేక రైతులు, రాష్ట్రంలో ఆక్వా రైతులు, కార్మికులు, పొగాకు ఉత్పత్తిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన నిప్పులు చెరిగారు. ముఖ్యంగా రాష్ట్రంలో మహిళలకు భద్రత కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని, మహిళల భద్రతల పరిస్థితి మరింత దారుణంగా ఉందని విమర్శించారు. తెచ్చిన అప్పుల నుంచి మూలధన వ్యయం కేవలం 23 శాతం మాత్రమే చేసారని, ప్రజా సంక్షేమానికి ఖర్చు చేయకపోతే మిగిలిన రూ 68 వేల కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని ప్రశ్నించారు. ఏకంగా రూ 62 వేల కోట్ల రెవెన్యూ లోటు నమోదైంది దానికి ఈ ప్రభుత్వం ఏం సమాధానం చెప్పుదని నిలదీశారు. స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి ఘోరంగా పడిపోయిందని, జి ఎస్ టీ ఎంతో తగ్గి రూ.34,900 కోట్లు దాకా నష్టం జరిగిందని తెలిపారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ప్రజల చేతికి డబ్బులు ఇవ్వడం వల్ల కొనుగోలు శక్తి పెరిగిందని, కానీ నేడు ఆ పరిస్థితి మాయమైందని ఆవేదన వ్యక్తం చేశారు.బీహార్ లాంటి రాష్ట్రం 18శాతం వృద్ధి నమోదు చేస్తుంటే, మన రాష్ట్రం 22శాతం నష్టాల దిశగా పడిపోయింది, నిత్య అవసరాల సరుకుల ధరలు పెరిగిపోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వ అసమర్థన్యం ప్రజా వ్యతిరేక విధానాలపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం చేస్తుందని మాజీ మంత్రి కన్నబాబు స్పష్టం చేశారు.

# 28న పాడేరులో మంత్రులతో కమిటీ సమావేశంకు వెళ్తాం..

**జాప్యం చేస్తే ఉద్యమమాట.. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రామారావు**



రాజవొమ్మంగి, జూలై 28, ప్రభాతవార్త పాడేరులో 28 తేదీ న జరిగే జీ వో నెంబర్. 3, 1/ 70 చట్ట పరిరక్షణపై గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, హోం మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షులతో ఆదివాసీ సంఘాలతో నిర్వహించే కమిటీ సమావేశానికి వెళు తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు తెలిపారు. చర్చలు పేరుతో జీ వో నెంబర్. 3, 1/70 చట్టంపై స్పష్టమైన వైఖరి చెప్పకపోతే ఉద్యమాలకు సిద్ధమని రామారావు వెల్లడించారు. ఆగస్టు 9 తేదీ వరకూ అన్ని ఆదివాసీ సంఘాలు ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తామన్నారు.

# అన్నదాతలకు అందుబాటులో యూరియా



కాట్రేనికోన,జూలై 27 (ప్రభాతవార్త) కాట్రేనికోన సొసైటీ కార్యాలయంలో ఖరీఫ్ కు సంబంధించి అన్నదాతలకు యూరియా అందుబాటులో ఉందని సొసైటీ చైర్ పర్సన్ పెనుగొండ శ్రీను తెలిపారు. సొసైటీ ఆవరణ లో ఎరువుల విక్రయాలలో భాగంగా మొదటగా యూరియా అమ్మకాలను సోమవారం ప్రారంభించారు. 20 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమం లో సొసైటీ మెంబర్స్ చేకూరి వెంకట కృష్ణంరాజు , నీటి సంఘము అధ్యక్షులు వానపల్లి రాజేశ్వరరావు , రామకృష్ణంరాజు, శంకర్, ఒలేటి భూషణం రైతులు దొమ్మేటి నాగేశ్వరరావు, పంతాడి గణేష్, రాజశేఖర్ ,సానబోయిన వెంకటేశ్వరరావు ,మనోజ్, సుధ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు

# గిరిజన విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి.. ఎంపిపి గోము వెంకటలక్ష్మి



రాజవొమ్మంగి, జూలై 27, ప్రభాతవార్త దివిలింగి పంచాయతీ వెంకటనగరం గ్రామానికి చెంది జడ్డంగి గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతూ అనారోగ్యంతో ఇంటికి వచ్చి మరణించిన కాకర అంజలీదేవి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రాజవొమ్మంగి ఎంపిపి గోము వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం సాయంత్రం విద్యార్థిని కుటుంబాన్ని పరామర్శించారు. వెంకటనగరం గ్రామానికి చెందిన కాకర సింహాచలం, నాగమణి దంపతులకు ఏకైక సంతానం అంజలీదేవి మరణం చాలా భాదాకరమని వైస్సార్సీపీ స్టేట్ యూత్ సెక్రటరీ కొంగర మురళీకృష్ణ అన్నారు. జడ్డంగి ఆశ్రమ పాఠశాలకు వెళ్లి జరిగిన విషయాలను తెలుసుకొన్నారు. ఎంపిపి వెంకటలక్ష్మి, వైస్సార్సీపీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్ రాజు, కొంగర మురళీకృష్ణ, నెల్లూరి మాణిక్యాలరావు, కాళ్ళ రాజబాబు, అబ్బాయిరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు

# జగనన్న కాలనీ సమస్యలు పరిష్కరించాలని ధర్నా..




తాళ్లరేవు, జూలై 27 (ప్రభాతవార్త): మండలంలోని తాళ్లరేవు గ్రామపంచాయతీ జగనన్న కాలనీ ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ వద్ద సోమవారం ధర్నా నిర్వహించి, పంచాయతీ సెక్రెటరీ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ ఈ కాలనీ ఏర్పడి ఐదు సంవత్సరాలు అవుతుందని కాలనీలో సీసీ రోడ్లు, డ్రైన్లు వంటి మౌళిక సదుపాయాలు కల్పించలేదన్నారు. మెయిన్ గ్రామం నుండి డ్రైన్ ద్వారా వెళ్లే మురుగునీరు కాలనీ సమీపంలో అవుట్ లెట్ కు సిసి డ్రైన్ నిర్మాణం లేక మురుగునీరు రోడ్డుపైకి వస్తుందన్నారు. దానివల్ల దోమలు వ్యాపించి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు తక్షణం స్పందించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శి బి రాజేంద్ర కుమార్ స్పందిస్తూ పారిశుధ్యం, వీధిలైట్లు తదితర సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని, రోడ్లు, డ్రైన్స్ నిమిత్తం వర్కులు తీర్మానం చేసి మొదటి ప్రయారిటీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే ఎమ్మెల్యే సుబ్బరాజు దృష్టిలో పెట్టి సమస్య పరిష్కారానికి కృషి స్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దుప్పి అదృష్టదీపుడు, నల్లి ఈశ్వరరావు, నేరేడుమిల్లి త్రిమూర్తులు, పోలవరపు వరలక్ష్మి , కర్రి నాగేశ్వరరావు, వాడ్రేవు సీతారామరాజు, గుండా బత్తుల సత్యనారాయణ, కె. సరోజిని, ధనలక్ష్మి, కె.జానకి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# దేవరపల్లిలో ఆగస్టు 5 నమాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన.

## ఏర్పాట్లు పరిశీలించిన నాయకులు



అనపర్తి / దేవరపల్లి జూలై 27 (ప్రభాతవార్త) ఆగస్టు 5న దేవరపల్లికి జననేత, వైయస్ఆర్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి రానున్నారని ఆయన రైతులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకుంటారు అనంతరం పొగాకు వేలం కేంద్రం సందర్శించ నున్నారని సూర్యనారాయణరెడ్డి తెలిపారు. వైయస్ జగన్ పర్యటనకు సంబంధించిన వైయస్ జగన్ పర్యటనకు ఏర్పాట్లు, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించిన పార్టీ ముఖ్య నేతలు వివరిశీలించారు. ఈ పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను పార్టీ ముఖ్య నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యంగా హెలిప్యాడ్‌తో పాటు పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమీక్షించి, అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ ; ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, తూర్పుగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, మాజీ హోంమంత్రి తానేటి వనిత, మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి గారు, మాజీ శాసనసభ్యులు; రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా, మాజీ శాసనసభ్యులు తలారి వెంకట్రావు, రాజమహేంద్రవరం మాజీ పార్లమెంట్ సభ్యులు, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్, తూర్పు గోదావరి జిల్లా పార్టీ అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి తో పాటు పలువురు పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల పై జిల్లా స్థాయి సమావేశం



కొత్తపేట, జూలై 27, (ప్రభాతవార్త) డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాల్ లో వ్యవసాయ ఎగుమతుల ప్రోత్సాహం లక్ష్యంగా జిల్లా స్థాయి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై చైతన్య సదస్సు కొత్తపేట ఉద్యాన అధికారి జి కోటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధులు గా ఆత్మ చైర్మన్ జక్కంపూడి బాలాజీ జిల్లా ఆత్మ మెంబెర్ కుడప కృష్ణ మూర్తి కొత్తపేట వ్యవసాయ అధికారి కె ద్వారకా దేవి అభ్యుదయ రైతు ఉద్దరాజు ప్రసాద్ రాజు పాల్గొన్నారు ఆత్మ చైర్మన్ జక్కంపూడి బాలాజీ మాట్లాడుతు కంద ఎగుమతులు ను ప్రోత్సహం చెయ్యమన్నారు అలాగే కంద రైతులను ఒక ఎఫ్ పి ఓ గ్రూప్ గా ఏర్పాటు చేసి ఎగుమతి చెయ్యడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునన్నారు అలాగే కొత్తపేట అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ జె భార్గవ్ మహేష్ పాల్గొని జిల్లా లో పంటల సరళి ఎగుమతి కి అనువైన పంటలు గురించి ఉత్పత్తులు గురించి వివరించి రైతులను సద్వినియోగం చేసుకోమని తెలియజేసారు ఈ సమావేశానికి విశాఖపట్నం కు చెందిన ఏపీ ఇ డి ఎ అసిస్టెంట్ మేనేజర్ కె వి విజయ్ బాలాజీ యాదవ్ తెలిపారు పాల్గొని వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయడానికి అవసరమైన ప్రమాణాలు నాణ్యత నియంత్రణ ప్యాకింగ్ గ్రేడింగ్ విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ఏపీ ఈ డి ఏ ద్వారా లభించే అవకాశాలు ఎగుమతి ప్రక్రియ రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలపై సమగ్రంగా వివరించారు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా రైతులు అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని ఎఫ్‌పీఓలు సమిష్టిగా పనిచేస్తే అంతర్జాతీయ మార్కెట్లను సులభంగా చేరుకోవచ్చుని ఆయన సూచించారు కార్యక్రమంలో పాల్గొన్న రైతులు ఎఫ్‌పీఓ ప్రతినిధులు తమ సందేహాలను నివృత్తి చేసుకుని ఎగుమతులపై అవగాహన పెంపొందించుకున్నారు ఈ కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఎఫ్ పి ఓ రైతులు వ్యాపారులు వ్యవసాయ ఆధారిత పారిశ్రామికవేత్తల రైతు సేవ కేంద్రం సిబ్బంది ఉద్యాన విస్తరణ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# భారతరత్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు విద్యార్థుల ఘన నివాళి



వి.ఆర్.పురం,జూలై27,ప్రభాతవార్త భారత దేశానికి శాస్త్ర, సాంకేతికపరంగా ఎన్నో సేవలు అందించిన భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాంకు వి.ఆర్.పురంలోని అబ్దుల్ కలాం పాఠశాల విద్యార్థులు ఘన నివాళులు అర్పించారు. సోమవారం మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం 11 వ వర్ధంతి వేడుకలను, అబ్దుల్ కలాం పాఠశాలలో నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్ర పటానికి ప్రిన్సిపాల్ మాదిరెడ్డి.రామలక్ష్మి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అబ్దుల్ కలాం భారతదేశానికి 11వ రాష్ట్రపతిగా 5 ఏళ్లపాటు (1826 ) రోజులు సేవలందించారన్నారు. ఆయన పదవీకాలం 2002 జూలై 25 నుండి 2007 జూలై 25 వరకు కొనసాగిందని చెప్పారు. జూలై 27 న 2015 న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ వేదికపై విద్యార్థులతో ప్రసంగిస్తు, హఠాత్తుగా గుండెపోటుకు గురై ఈ లోకాన్ని వీడారన్నారు. అబ్దుల్ కలాం మిస్సైల్ మ్యాన్‌గా గుర్తింపు పొంది, తన నిరాడంబరత, నిజాయితీ, మానవతావాదిగా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని చెప్పారు. అబ్దుల్ కలాం ఎందరికో ఆదర్శప్రాయులన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు లహరి, అశ్విని, సుధారాణి, భవాని, కనక, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి తెలుగుదేశం' నేమాంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి దంపతులు శ్రీకారం

**ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు**




కాకినాడ రూరల్,జూలై 27 (ప్రభాతవార్త): తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని కాకినాడ రూరల్ మండలం నేమాం గ్రామంలో కాకినాడ రూరల్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి ఇంటింటికి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి వివరించి ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కర్రీ వెంకట్రాజు, క్లస్టర్ లు సరిదే నాగ హరినాథ్, పేరాబత్తుల లోవబాబు,ప్రకాష్, గ్రామ పార్టీ అధ్యక్షులు గుబ్బల శివ, వాసంశెట్టి లోవరాజు, సీనియర్ నాయకులు మాసుమెను గంగయ్య, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# 67.51 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదుల ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



జగ్గంపేట జులై 27 (ప్రభాతవార్త) జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మనబడి-మన భవిష్యత్తు నిధుల ద్వారా 67.51 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులను జగ్గంపేట శాసనసభ్యులు, టిటిడి బోర్డు సభ్యులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. విద్యా కమిటీ చైర్మన్ జొన్నాడ వీరబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ విద్యారంగంలో సమూల మార్పులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పెద్దపీట వేస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మనబడి-మన భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారిపోతున్నాయని, తరగతి గదుల కొరత లేకుండా చేయడమే కాకుండా ఆధునిక సౌకర్యాలతో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడపా భరత్, కన్నబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, ఆత్మ కమిటీ చైర్మన్ పైడిపాల సూరిబాబు, పోతుల మోహనరావు, జంపన సీతారామచంద్ర వర్మ, జనపరెడ్డి సుబ్బారావు, చదరం చంటిబాబు, కనవ రెడ్డిరామకృష్ణ, ముండ్రు ఎర్రబాబు, పైడిపాల సత్తిబాబు, డి వై ఈవో ప్రభాకర్ శర్మ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పివీ సత్యనారాయణ, ఎంఈఓ స్వామి, ప్రధానోపాధ్యాయులు బి నూకరాజు స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బుర్రకథ ద్వారా గెయిల్ పైప్‌లైన్ పై అవగాహన



రామచంద్రపురం,జూలై 27 (ప్రభాతవార్త): గెయిల్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన ఆర్.ఓ.యు.రైట్ ఆఫ్ యూజ్ గ్యాస్ పైప్‌లైన్ వెంబడి ఉన్న గ్రామాల్లో భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం బుర్రకథ కార్యక్రమాలు నిర్వహించారు. రామచంద్రపురం కళాబృందానికి చెందిన గొర్రెల రాము,కృష్ణా బ్రదర్స్ బృందాలు యానంలోని మెట్టకూరు,కరప మండలంలోని పెద్దాపురప్పాడు,తాళ్లరేవు మండలంలోని లచ్చిపాలెం గ్రామాల్లో బుర్రకథ ప్రదర్శించారు. ఈ సందర్భంగా పైప్‌లైన్ ప్రాధాన్యత,పైప్‌లైన్ పరిసర ప్రాంతాల్లో పాటించాల్సిన భద్రతా నిబంధనలు, సంబంధిత అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి తవ్వకాలు చేపట్టరాదనే విషయాలను ప్రజలకు వివరించారు. అలాగే పైప్‌లైన్ వద్ద గ్యాస్ లీకేజీ లేదా ఇతర అసాధారణ పరిస్థితులు గమనించిన వెంటనే గెయిల్ టోల్‌ఫ్రీ నంబర్ 15101కు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు.

# బిల్లకుర్రు సబ్ స్టేషన్ పరిధి లో విద్యుత్ సరఫరాకు అంతయం



కొత్తపేట, జూలై 27 (ప్రభాతవార్త): కొత్తపేట మండలం లో బిల్లకూరు వానపల్లి గొల్లకోటివారి పాలెం విద్యుత్ వినియోగదారులకు 33/11 కేవీ లైన్ పరిధిలోని 33కేవీ ముక్కామల ఫీడర్ ఆర్డీఎస్ఎస్ స్కీములో కవర్ కండక్టర్ మార్పు కోసం పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించారు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న వానపల్లి గొల్ల కోటివారిపాలెం బిల్లకూరు తరిట్ల వారి పేట డేగల వారి పాలెం నల్లవారిపేట నెల్లి వారి పేట నక్క వారి పేట కముజు వారి పాలెం శ్రీనివాసపురం సత్తెమ్మ కాలనీ మాసాయిపేట ఎలిశెట్టి వారి పాలెం వాకాడి వారి పాలెం ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు కావున విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించి పనులకు అవకాశం కల్పించవలసిందిగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొత్తపల్లి రాంబాబు తెలిపారు. కొత్తపేట పరిధిలో మండల పరిధిలోని పలివెల కండ్రిగ గ్రామ పరిధిలో ట్రాన్స్కో లైన్ వర్క్స్ నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మంగళవారం బుధవారం రెండు రోజులపాటు విద్యుత్ సరఫరా చేస్తామని కొత్తపేట విద్యుత్ శాఖ ఈ ఈ రాంబాబు తెలిపారు

# పంచాయతీ చెరువు సమస్యపై సమావేశం



కాట్రేనికోన జూలై 27(ప్రభాతవార్త) ప్రముఖ పుణ్యక్షేత్రం కుండలేశ్వర ఆలయం చెంతన ఉన్న పంచాయతీ చెరువును ఈ ఏడాది వేసవికాలంలో కొంతమంది ఎటువంటి అనుమతులు లేకుండా పూడ్చివేయడంపై గ్రామానికి చెందిన అక్కల శ్రీధర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ చెరువు పూడ్చివేత ఆకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. దీనికి సంబంధించి ఇటీవల కాలంలో మండల కమిటీ అధికారులు తహసిల్దార్, ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో కాట్రేనికోన ఎస్ఐ తదితరులు సమక్షంలో పంచాయతీ చెరువు సర్వే చేపట్టారు. ఇదిలా ఉండగా ఈ సమస్యకు సంబంధించి సోమవారం కుండలేశ్వరంలో ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువు పూడ్చివేత పై చర్చించారు. గ్రామంలో ఎంతోకాలంగా పంట చేలకు , స్థానికుల అవసరాలకు, పశువులు నీరు తాగేందుకు ఉపయోగపడే ఈ చెరువును పూడ్చవలసిన అవసరం ఏముందని ఎంపిటిసి సభ్యుడు అక్కల శ్రీధర్ ప్రశ్నించారు. గ్రామంలో ఇటువంటి పనులు చేపట్టినప్పుడు అందరికి తెలియజేసి, వారిని కలుపుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని, కానీ ఈ చెరువు వ్యవహారంలో కొంతమంది ఎవరికి సమాచారం ఇవ్వకుండా ఇష్టానురీతిన పంచాయతీ చెరువులు పూడ్చివేశారన్నారు. దీనిపై మరొక వర్గం సభ్యులు మాట్లాడుతూ ఈ చెరువును తాము పూడ్చలేదని తెలిపారు. హైకోర్టులో వేసిన పిటిషన్ ను వెనక్కి తీసుకోవాలని తెలిపారు. దీనిపై శ్రీధర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. చెరువులో ఆక్రమణ తొలగించి రైతులకు ప్రజలకు ఉపయోగపడే వరకు తన పోరాటం సాగిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కుండలేశ్వరానికి చెందిన పలువురు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రెండేళ్ల కూటమి పాలన... సూపర్ సిక్స్, అభివృద్ధి.. సంక్షేమంపై ప్రజలకు అవగాహన.



ఆత్రేయపురం, జూలై 27,(ప్రభాత వార్త) ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా 2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమం సోమవారం మండల టీడీపీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణరాజు (బాబు) , జిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, దొడ్డపనేని త్రినాధరావు లు ఆధ్వర్యంలో కట్టుశీగ గ్రామంలో బూత్ 31 లో ప్రారంబించారు. కుటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామ ప్రజలకు వివరించారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం--2, ఎన్‌టీఆర్ భరోసా, మత్స్యకార భరోసా, సూపర్ సిక్స్, అభివృద్ధి గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ప్రజల సమస్యలు, సూచనలను తెలుసుకుని మై టిడిపి యాప్ ద్వారా నమోదు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇంచార్జీలు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం...

**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...**





ఆలమూరు, జులై 27, (ప్రభాతవార్త) ఆలమూరు మండలంలో దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం అందించిన ఉచిత మోటార్ సైకిళ్లను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. మండలంలో మొత్తం ఆరుగురికి ఈ మోటారు సైకిళ్లు అందగా వారంతా సోమవారం ఉదయం ఆలమూరులో ఎమ్మెల్యే బండారు పర్యటనలో పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులు ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకునేలా, వారికి స్వతంత్ర జీవనాన్ని కల్పించేందుకు ఈ పథకం ఉద్దేశించబడిందని తెలిపారు. లబ్ధిదారులతో మాట్లాడి గత గొడ్డలి పార్టీ ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వంలో దివ్యాంగులకు లభిస్తున్న సంక్షేమ పథకాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. 2019 నుంచి 2024 వరకు 2019కు ముందు చంద్రబాబు నాయుడు తమకు ఇచ్చిన పింఛన్ మొత్తం రూ.3వేలు మాత్రమే అందేదని 5 ఏళ్లలో ఒక్క రూపాయి కూడా వైసిపి హయాంలో పెంచలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ మొత్తాన్ని రూ.6 వేలు చేసి ప్రభుత్వం తమను ఆదుకుందని దివ్యాంగులు తెలిపారు. దివ్యాంగులకు కూటమి ప్రభుత్వంలో అన్ని విధాలా లబ్ధి జరుగుతుందన్నారు.

**సోలార్ ఎనర్జీ ని వినియోగించుకోవాలి...**

ప్రభుత్వం సోలార్ ఎనర్జీ ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచితంగా సోలార్ యూనిట్ అమర్చుకోవడానికి అవకాశం కల్పిస్తుందని, బిసి ఓసి వర్గాలకు రూ.78 వేలు సబ్సిడీ అందిస్తుందని అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆలమూరులో ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసుకున్న సోలార్ యూనిట్ లను ఎమ్మెల్యే బండారు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గాలకు కూటమి ప్రభుత్వం ఎన్నో ప్రయోజనాలు కల్పిస్తుందన్నారు. సోలార్ యూనిటీ ఏర్పాటును ఉచితంగా చేయడంతో పాటు నెలకు రూ.200లను వారికి అద్దె రూపంలో చెల్లిస్తుందన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



**తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ**

**తెలుగు జాతీయ దినపత్రిక వార్త**

# ఏకలవ్య పాఠశాల విద్యార్థినికి తీవ్ర అస్వస్థత.

**మెరుగైన వైద్యం కోసం చోడవరం తరలింపు. యాజమాన్యం పట్టించుకోలేదని ఆరోపించిన విద్యార్థిని తల్లిదండ్రులు.**



అడ్డతీగల,జూలై 27, ప్రభాతవార్త ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతో ఎనిమిదో తరగతి విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన అడ్డతీగల మండలంలో చోటుచేసుకుంది. బాధితురాలి తండ్రి యాట్ల సూరిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గంగవరం మండలం నీలవరం గ్రామానికి చెందిన యాట్ల సూరిరెడ్డి కుమార్తె యాట్ల సాత్విక (13) ఆరో తరగతి నుండి ఏకలవ్య పాఠశాలలోనే చదువుతోంది. ఈ సంవత్సరం రాజవొమ్మంగి నుండి అడ్డతీగల మండలం వేటమామిడి ఏకలవ్య స్కూల్‌కు మార్చగా, అక్కడ ఎనిమిదో తరగతి అభ్యసిస్తోంది. పాఠశాలలో బాలిక తీవ్ర నీరసానికి గురవ్వడంతో సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో కుటుంబ సభ్యులు బాలికను అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం, మెరుగైన వైద్యం కోసం ఐటీడీఏ అంబులెన్స్‌లో రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సదరు విద్యార్థినికి షుగర్ ఉందనే విషయం ఉపాధ్యాయులు, అధికారులకు ముందే తెలిసినప్పటికీ, ఆమె ఆరోగ్యం పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహించారని తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. పాప పరిస్థితి క్షీణించిన తర్వాత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ, తల్లిదండ్రులకు అప్పగించి పాఠశాల సిబ్బంది చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. విద్యార్థిని ఆరోగ్యం పట్ల అలసత్వం ప్రదర్శించిన అధికారులపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవ వేడుకను విజయవంతం చేయండి

**బొబ్బిలి నియోజకవర్గంలో పర్యటించిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్**



శంఖవరం జులై 27 ప్రభాతవార్త మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మితమైన భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవ వేడుకను బొబ్బిలి నియోజకవర్గం ప్రజలు విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యుడు పర్వత సురేష్ పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన పర్వత సురేష్ ను బొబ్బిలి నియోజకవర్గంలోని రామభద్రపురం మండలానికి పరిశీలకునిగా టిడిపి అధిష్టానం నియమించింది. దీనితో బొబ్బిలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే బేబి నాయనతో సమావేశమైన సురేష్ రామభద్రపురం మండలంలో పర్యటించి, నేతలతో భోగాపురం ఎయిర్ పోర్ట్ ను ప్రధాని నరేంద్ర మోడి వచ్చే నెల ఆగష్టు 1న ప్రారంభోత్సవం చేస్తున్నారని, ఆ వేడుకకు భారీ ఎత్తున జన సమీకరణ చేసి, సభను విజయవంతం చేయాలన్నారు

# .మండల పరిషత్ సర్వసభ్య సమావేశం...



ఎటపాక: జూలై 27 ( ప్రభాత వార్త): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కాక కామేశ్వరి అధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశం లో ప్రజా ప్రతినిధులు అధికారులను పలు సమస్యలు పై నిలదీశారు.రైతు యూరియా సరఫరా అలాగే త్రాగునీటి సమస్యలు గురించి వాడి వేడిగా చర్చ సాగింది.రైతులకు వ్యవసాయ సాగుబడి కాలం వచ్చిన పంటలకు ఎరువుల కొరత ఇంకా కొనసాగుతుంది అని , కాంప్లెక్స్ ఎరువు కూడా రైతులకు అందుబాటు లో ఉండేలా చూడాలి అని కోరారు.వర్షాలు లేక వరి పొలాలు నాట్లు కూడా వేసే పరిస్థితి లేదు అని వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ ద్వారా పని కల్పించాలి అన్నారు.అలాగే ముంపు ప్రాంత ప్రజలను అధికారులు పట్టించుకోవడం లేదు అని అన్నారు. ప్రజాప్రతినిధుల గౌరవ వేతనాలు చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ సమావేశం లో వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తామరపల్లిలో ఉచిత మొబైల్ వైద్యశాల



కె గంగవరం, జులై 27, (ప్రభాతవార్త): కె గంగవరం మండలం తామరపల్లి గ్రామ పంచాయతీలో సహారా కియా సంస్థల సంయుక్తంగా ఏర్పాటు చేసిన గ్రామీణ సంచార వైద్యశాల (మొబైల్ వ్యాన్) లో సుమారు 130 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు వైద్యురాలు అనూష తెలిపారు. ఈ మొబైల్ వ్యాన్ లో అవసరమైన వారికి రక్త పరీక్షలు , గుండె పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎం ఎల్ టి జ్యోతి, ఫార్మసిస్ట్ అనూష, ఏఎన్ఎం రాజేశ్వరి, సిబ్బంది ప్రకాష్ రావు చంద్రావు లతో పాటు పంచాయతీ సెక్రెటరీ అరుణ, టిడిపి నాయకులు మేడిశెట్టి నాగేశ్వరరావు, గన్ని శ్రీనివాస్ కిరణ్ ప్రచార కార్యదర్శి చిల్లే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# యువత దేశాన్ని గొప్పదిగా తీర్చిదిద్దాలి -- డా. ఒమ్మి రఘురామ్:




జగ్గంపేట, జూలై 27 (ప్రభాతవార్త ) భారతరత్న, భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డా. ఏ. పి. జె. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా శ్రీ స్వామి వివేకానంద విద్యా సంస్థల్లో ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి సంస్థల ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్ డా. ఒమ్మి రఘురామ్ ముఖ్య అతిథిగా పాల్గొని డా. అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి డా. ఒమ్మి రఘురామ్ మాట్లాడుతూ, డా. అబ్దుల్ కలాం జీవితం ప్రతి భారతీయ యువకుడికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సాధారణ కుటుంబంలో జన్మించి అసాధారణ విజయాలను సాధించిన ఆయన జీవితం కష్టపడే ప్రతి విద్యార్థికి ఆదర్శమని పేర్కొన్నారు. విజ్ఞానం, దేశభక్తి, క్రమశిక్షణ, నిజాయితీ, నిరంతర అధ్యయనం వంటి విలువలను ప్రతి విద్యార్థి కలాం జీవితంలో నుంచి నేర్చుకోవాలని సూచించారు. యువత పెద్ద కలలు కనాలని, ఆ కలలను సాధించడానికి పట్టుదలతో శ్రమించాలని,అప్పుడే భారతదేశం ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తుందని చెప్పారు. పుస్తక పఠనం, విజ్ఞాన సాధన, మంచి విలువలు, దేశసేవ పట్ల అంకితభావం కలిగిన యువతే దేశ భవిష్యత్తుకు నిజమైన బలమని ఆయన అన్నారు. కలాం చూపిన మార్గంలో నడవడం ద్వారానే సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదగగలమని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డా. అబ్దుల్ కలాం సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను ఆచరించాలని ప్రతిజ్ఞ చేశారు.

# అముజూరు లో రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం



కె గంగవరం, జులై 27, (ప్రభాతవార్త): కె గంగవరం మండలం అముజూరు గ్రామంలో టిడిపి మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారంలో భాగంగా రెండేళ్ల పాలన నమ్మకం అభివృద్ధి సంక్షేమం ఇలా పలు కార్యక్రమాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి దీపం పథకం రాష్ట్రానికి పలు కంపెనీల రాక ఎన్టీఆర్ భరోసా వైద్య సేవలు సంక్షేమ పథకాలు మహిళా సాధికారత తల్లికి వందనం ఇలా పలు అభివృద్ధి పథకాల గురించి సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ చిన్నికృష్ణ, క్లో క్లస్టర్ గొడవర్తి రామకృష్ణ చౌదరి,టిడిపి సీనియర్ నాయకులు వెంటూరి వీర రాఘవ చౌదరి,గ్రామ టిడిపి అధ్యక్షులు నాయకులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps